ప్రతిపక్షం

www.prathipaksham.in

బుధవారం 12.11.2025 | Published from: Hyderabad | సంపుటి: 18 సంచిక: 232 పేజీలు:12 వెల రూ. 5/-

@prathipaksham | prathipaksham tv telugu

సౌతాఫ్రికాతో రెండు టెస్టులు గెలిచి తీరాలి 12

ముగిసిన 'అందెశ్రీ' ప్రస్థానం

ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు

స్వయంగా పాడె మోసిన సీఎం రేవంత్ రెడ్డి

- అంతిమయాత్రలో పీసీసీ చీఫ్, మంత్రులు
- తరలివచ్చిన సాహితీ, కళాభిమానులు
- అక్షర యోధుడికి కన్నీటితో చివరి వీడ్కోలు
- పాఠ్యపుస్తకాలలో 'జయ జయహే తెలంగాణ' గీతం
- అందెశ్రీ కుటుంబ సభ్యులలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం
- ఆయన పేరుతో అద్భుత 'స్మృతి వనం' నిర్మాణం
- అందెశ్రీకి పద్మశ్రీ ఇవ్వాలని కేంద్రానికి లేఖ రాస్తా
- అంత్యక్రియల అనంతరం మీడియాతో సీఎం రేవంత్

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, నవంబర్ 11: ప్రముఖ కవి, రచయిత అందెశ్రీ అంత్యక్రియలు ముగిశాయి. లాలాపేట జయశంకర్ స్టేడియం నుంచి తార్నాక, ఉప్పల్ మీదుగా ఘట్‌కేసర్ లోని ఎన్‌ఎఫ్సీ నగర్ వరకు అంతిమయాత్ర సాగగా, సీఎం రేవంత్‌రెడ్డి, పలువురు మంత్రులు, ప్రముఖులు హాజరయ్యారు. ఘట్‌కేసర్‌లో అధికార లాంఛనాలతో అంత్యక్రియలు

..:: మిగతా 2లో

పోలింగ్ సందర్భంగా పలుచోట్ల పరస్పరం ఘర్షణలు జరిగాయి. బోరబండ స్వరాజ్ నగర్‌లో కాంగ్రెస్, బీఆర్ఎస్ వర్గాల మధ్య వివాదం చెలరేగింది. కార్పొరేటర్ ఫసియుద్దీన్ తమపై దాడి చేశారంటూ బీఆర్ఎస్ కార్యకర్తలు ఆందోళనకు దిగారు. దీంతో అక్కడికి చేరుకున్న బీఆర్ఎస్ అభ్యర్థి సునీతను పోలీసులు అడ్డుకున్నారు.ఇక వెంగళరావు నగర్ పోలింగ్ బూత్ నెంబర్ 120 దగ్గర ఓటర్లకు బీఆర్ఎస్ కార్యకర్తలు డబ్బులు పంచుతున్నారంటూ కాంగ్రెస్ కార్యకర్తలు గొడవకు దిగారు. దీంతో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. ఇదే ఏరియాలో సత్తుపల్లి ఎమ్మెల్యే భర్త దయానంద్‌పై ఆర్వోకి బీఆర్ఎస్ నేతలు ఫిర్యాదు చేశారు.

48.42 శాతం పోలింగ్

బద్ధకించిన నగర ఓటరు.. సగం కూడా దాటని 'జూబ్లీ' ఓటింగ్

- ఉదయం నుంచి మందకొడిగానే షురూ
- సాయంత్రం వరకు కూడా అదే తీరు
- స్వల్ప ఘటనలు మినహా అంతా ప్రశాంతం
- ఆరోపణలు, విమర్శలతో అక్కడక్కడా ఉద్రిక్తత
- ఈసీకి అధికార, విపక్షాల పోటా పోటీ ఫిర్యాదులు
- బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలపై ఈసీ కేసులు
- కాంగ్రెస్ నేతలు రిగ్గింగ్ చేశారని సునీత ఫిర్యాదు
- నిబంధనల మేరకు నడుచుకున్నామన్న నవీన్ యాదవ్
- రెండు పార్టీలు విచ్చలవిడిగా డబ్బులు పంచాయన్న దీపక్

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, నవంబర్ 11: చెదురు మదురు సంఘటనలు మినహా జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక పోలింగ్ మంగళవారం ప్రశాంతంగా ముగిసింది. సాయంత్రం ఆరు గంటల వరకు 48. 42 శాతం పోలింగ్ నమోదైందని అధికారులు ప్రకటించారు. దాదాపు అన్ని డివిజన్ లలో ఉదయం నుంచి సాయంత్రం వరకు పోలింగ్ మందకొడిగానే సాగింది. నగర ఓటర్లు ఎప్పటిలాగే ఓటు వేయడానికి బద్ధకించారు. ఈసీ అధికారులు ఎన్ని అవగాహన కార్యక్రమాలు చేపట్టినా ఫలితం లేకుండా పోయింది. కాగా, అధికార పార్టీ, విపక్ష పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవడంతో పోలింగ్ సందర్భంగా పలు చోట్ల గొడవలు జరిగాయి. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల నేతలు పరస్పరం ఎన్నికల సంఘానికి ఫిర్యాదులు చేసుకున్నారు. స్థానికేతరులను ప్రచారం కోసం తిప్పుతున్నారంటూ బీఆర్ఎస్ నేతలపై

..:: మిగతా 2లో

ఉగ్రవాదుల కుట్ర మూలాలను ఛేదిస్తాం

ఢిల్లీ పేలుడు ఘటనను ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తీవ్రంగా ఖండించారు. ప్రస్తుతం భూటాన్ పర్యటనలో ఉన్న ప్రధాని అక్కడ మంగళవారం నిర్వహించిన ఓ సమావేశంలో మాట్లాడారు. ఉగ్ర కుట్ర మూలాలను ఛేదిస్తామని వెల్లడించారు.

11

పాక్ రాజధాని ఇస్లామాబాద్‌లో పేలుడు

పాకిస్తాన్‌లో మరోసారి ఉగ్రవాదులు రెచ్చిపోయారు. రాజధాని ఇస్లామాబాద్‌లో భారీ పేలుడు సంభవించింది. ఉగ్రవాదులు జరిపిన ఈ ఆత్మాహుతి దాడిలో 12 మంది మృతి చెందగా, సుమారు 20 మంది గాయపడ్డారు.

11

ఎర్రకోట సందర్శన బంద్

ఢిల్లీలో ఉన్న ఎర్రకోట సమీపంలో సోమవారం రాత్రి ఏడు గంటలకు కారు పేలుడు ఘటన జరిగిన విషయం తెలిసిందే. ఆ పేలుడు ధాటికి 12 మంది మృతిచెందగా, 20 మంది వరకు గాయపడ్డారు. ఈ నేపథ్యంలో ఎర్రకోటను బంద్ చేశారు.

11

భారీగా పెరిగిన ఎమ్మెల్యేల ఆస్తులు

పలు రాష్ట్రాల ఎమ్మెల్యేల ఆస్తులపై ఏడీఆర్ నివేదిక విడుదల చేసింది. ఆంధ్రప్రదేశ్ ఎమ్మెల్యేల ఆస్తులు 11,323 కోట్లు అని తేలింది. తెలంగాణ రాష్ట్రంలో ఎమ్మెల్యేల ఆస్తులు 4,637 కోట్లు ఉన్నట్టు తెలుస్తోంది.

11

బిహార్ మళ్లీ ఎన్డీయే కూటమిదే!

- మెజారిటీ ఎగ్జిట్ పోల్ ఫలితాలివే
- వంద సీట్ల మార్కు దగ్గరే ఆగిన విపక్ష కూటమి
- తేజస్వీ యాదవ్ కు మరోసారి నిరాశేనా!
- సర్వేలను తాము నమ్మబోమన్న ఎంజీబీ నేతలు
- ఏ మాత్రం ప్రభావం చూపని పీకే జన్ సురాజ్ పార్టీ

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో

పాట్నా, నవంబర్ 11: బిహార్‌లో మరోసారి ఎన్డీయే కూటమిదే విజయమని మెజారిటీ పోల్స్ అంచనా వేశాయి. 130 నుంచి 150 సీట్లు ఎన్డీయేకు వస్తాయని మెజారిటీ సర్వేలు చెబుతున్నాయి. మహాఘట్‌బంధన్‌సీట్లు 100 దాటకపోవచ్చని సర్వేలు వెల్లడించాయి. ఇక్కడ ఎంతో హడావుడి చేసిన ప్రశాంత్ కిశోర్‌కు చెందిన జన్ సురాజ్ పార్టీ ప్రభావం అంతంత మాత్రమే అని కూడా

..:: మిగతా 2లో

అక్కాచెల్లెళ్లకు సీఎం రేవంత్ కానుక

- స్వయం సహాయక సంఘాల మహిళలకు
- 19న రెండు చీరల చొప్పున పంపిణీ
- 65 లక్షల మంది మహిళలకు అందజేత
- ఆదేశాలు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, నవంబర్ 11 : రాష్ట్రంలోని స్వయం సహాయక సంఘాల మహిళలకు ఉచిత చీరల పంపిణీకి ప్రభుత్వం ముహూర్తం ఖరారు చేసింది. ఈ నెల19న దివంగత ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా వీటిని పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తోంది. రాష్ట్రంలో 65 లక్షల మంది మహిళలకు ఉచిత చీరలు అందనున్నాయి. నిజానికి దసరా, బతుకమ్మ సంబరాల సందర్భంగా చీరలను పంపిణీ చేయాలని ప్రభుత్వం భావించింది. కానీ, కొన్ని అనివార్య కారణాల వల్ల అది అమలుకు నోచుకోలేదు. అప్పటి నుంచి మహిళలు చీరల కోసం ఎదురుచూస్తున్నారు. ఎట్టకేలకు చీరలు పంపిణీ చేయాలని అధికారులకు ఆదేశాలు వచ్చాయి. గత ప్రభుత్వ కాలంలో రేషన్‌కార్డు ఉన్నవారికి ఒక చీర చొప్పున సరఫరా చేయగా, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా పొదుపు సంఘాలలో సభ్యులుగా ఉన్నవారికి 'అక్కా చెల్లెళ్లకు రేవంతన్న కానుక' పేరుతో యేడాదికి రెండు చేనేత చీరలను పంపిణీ చేయనుంది. ఇందుకు అవసరమైన చీరలు ఇప్పటికే జిల్లాలకు రాగా, గోదాములలో భద్రపరిచారు.

మొదటిసారి బతుకమ్మ చీరల పంపిణీ

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటిసారి బతుకమ్మ చీరలను పంపిణీ చేయనుంది. 65 లక్షల మంది పొదుపు సంఘాల మహిళలకు చీరలను ఉచితంగా ఇస్తామని సీఎం ప్రకటించిన విషయం తెలిసిందే. ఇందుకు అనుగుణంగా కార్యచరణ కూడా పూర్తయినట్లు సమాచారం. ఇందుకోసం రూ.318 కోట్లు విడుదల చేయడంతో

..:: మిగతా 2లో

తుఫాను బాధితులకు పరిహారం

- రూ.12.99 కోట్ల నిధులు విడుదల
- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర సర్కారు
- తక్షణ సహాయం అందజేసేందుకు సిద్ధం
- 14 జిల్లాలలో తుఫాను, వరద ప్రభావం

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, నవంబర్ 11 : మొంథా తుఫాను బాధితులకు తెలంగాణ ప్రభుత్వం తక్షణ ఆర్థిక సాయం మంజూరు చేసింది. దెబ్బతిన్న ఇండ్ల మరమ్మతులకు రూ.12.99 కోట్లను విడుదల చేసింది. 15 జిల్లాలలోని 8,662 ఇండ్లకు రూ.15 వేల చొప్పున ఆర్థిక సాయాన్ని బాధిత కుటుంబాలకు అందించనున్నారు. భారీ వర్షాలు, వరదలతో గత నెల చివరి వారంలో పలు ప్రాంతాలలో తీవ్ర నష్టం జరిగింది. ఆయా జిల్లాల కలెక్టర్లు రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. వేలాది ఎకరాలలో పంటలు దెబ్బతిన్నాయి. భీకర వర్షాల కారణంగా రాష్ట్రవ్యాప్తంగా 16 మంది మృతిచెందగా, వేలాది ఎకరాలలో చేతికొచ్చిన పంటలు దెబ్బతిన్నాయి. 14 జిల్లాలలో తుఫాను ప్రభావం చూపినట్లు రోడ్లు భవనాల శాఖ

..:: మిగతా 2లో

ఛత్తీస్‌గఢ్‌లో మరో ఎన్‌కౌంటర్

- ఆరుగురు మావోయిస్టుల మృతి
- నేషనల్ పార్క్ అటవీ ప్రాంతంలో ఘటన
- మృతి చెందినవారిలో మావోయిస్టు కీలక నేతలు

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో

బీజాపూర్, నవంబర్ 11: ఛత్తీస్ గఢ్-మహారాష్ట్ర సరిహద్దు బీజాపూర్ జిల్లాలో మంగళవారం మరో భారీ ఎన్ కౌంటర్ జరిగింది. నేషనల్ పార్క్ ప్రాంతంలో జరిగిన ఈ ఎదురు కాల్పులలో ఆరుగురు

..:: మిగతా 2లో

చదరపు గజానికి రూ.3,40,000

- మునుపటి రికార్డును బద్దలు కొట్టిన వేలం
- నాలెడ్జ్ సిటీ బొటిక్ యూజ్ ప్లాట్‌కు డిమాండ్

..:: 3లో



రాష్ట్రీయం

బిహార్ మళ్లీ ఎన్డీయే కూటమిదే!

మొదటిపేజీ తరువాయి

తెలిపోయింది. ఇతర పార్టీలు కూడా ఏవీ ప్రభావం చూపే పరిస్థితులలో లేవు. ఎన్డీయేకు 133-159 సీట్లు, మహాఘట్‌బంధన్‌కు 75-101 సీట్లు, జేఎస్పీకి 5 సీట్లు, ఇతరులకు 28 సీట్లు వస్తాయని 'పీపుల్ పల్స్' అంచనా వేసింది. 'ఎన్డీయేకు 133-148 సీట్లు, మహాఘట్ బంధన్‌కు 87-102 సీట్లు, జేఎస్పీకి 2 సీట్లు, ఇతరులకు 36 సీట్లు వస్తాయని 'పీపుల్ ఇన్‌సైట్' సర్వే వెల్లడించింది. పేర్కొంది. ఎన్డీయేకు 147-167 సీట్లు, మహాఘట్ బంధన్‌కు 70-90 సీట్లు, జేఎస్పీకి 2 సీట్లు, ఇతరులకు 36 సీట్లు వస్తాయని 'మ్యాట్రిజ్' అంచనా వేసింది. ఎన్డీయేకు 135-150 సీట్లు వస్తాయని 'జేవీఎస్ పోల్స్' పేర్కొంది. మహాఘట్ బంధన్ 88-103 సీట్లతో సరిపెట్టుకుంటుందని, ఇతరులకు 36 సీట్లు రావచ్చని తెలిపింది. దైనిక్ భాస్కర్ ప్రకారం, ఎన్డీయేకు 145-160 సీట్లు, మహాఘట్ బంధన్‌కు 73-91 సీట్లు వస్తాయి. ప్రశాంత్ కిశోర్‌కు చెందిన జేఎస్పీ కనీసం ఖాతా కూడా తెరవకపోవచ్చని పేర్కొంది. ఇతరులు 3 సీట్లు గెలుచుకుంటారని పేర్కొంది. ఎన్డీయేకు 142-162 స్థానాలు, మహాఘట్ బంధన్ 80-98 స్థానాలు, జేఎస్పీ 14 స్థానాలు, ఇతరులు 3 స్థానాలు గెలుపొందవచ్చని 'పీమార్క్' సర్వే అంచనా. ఎన్డీయేకు 130-138 సీట్లు, మహాఘట్ బంధన్ 100-108 సీట్లు, జేఎస్పీ 0, ఇతరులు 35 సీట్లలో విజయం సాధించే అవకాశం ఉందని 'చాణక్య స్ట్రాటజీస్' అంచనా వేసింది.

తేజస్వీ యాదవ్‌ముఖ్యమంత్రి కల

ఎగ్జిట్ పోల్స్ విపక్షాలకు షాకిచ్చేలా ఉన్నాయి. తేజస్వీ యాదవ్‌ముఖ్యమంత్రి కల నెరవేరేలా కనిపించడం లేదు. ఎన్నో అంచనాలతో ప్రశాంత్ కిశోర్ పెట్టిన జన్ సురాజ్ పార్టీకి ఘోర వైఫల్యం తప్పేలా లేదు. కమ్యూనిస్ట్ పార్టీలు, చిన్నాచితకా పార్టీల పరిస్థితి మరీ దయనీయంగా ఉంది. అయితే, ఎగ్జిట్ పోల్స్ గురించి తాము పట్టించుకోబోమని, ఈసారి బిహార్‌లో తమదే విజయమని విపక్ష కూటమి నేతలు చెబుతున్నారు. ఈసారి బిహార్‌లో మహాఘట్ బంధన్ కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని కచ్చితంగా తెలుసని కాంగ్రెస్ నాయకురాలు సుప్రియా శ్రీనేత్ అన్నారు. గతంలోనూ ఎగ్జిట్ పోల్స్ తప్పని తేలాయని, ఇప్పుడు కూడా తప్పని తేలుతాయని, తేజస్వి యాదవ్ భారీ ఓట్ల మెజారిటీతో గెలుస్తారని నమ్మకం ఉందని ఆర్జేడీ నేత మృత్యుంజయ్ తివారీ పేర్కొన్నారు.

అక్కాచెల్లెళ్లకు సీఎం రేవంత్ కానుక

మొదటిపేజీ తరువాయి

మార్చి నుంచి వీటి తయారీని చేనేత, జౌళి శాఖ చేపట్టింది. చీరలను ఇచ్చేందుకు బీఓపీపీ లామినేటెడ్ వోవెన్ బ్యాగులను కూడా తయారు చేశారు. గత ప్రభుత్వం ఈ పథకాన్ని మొదలుపెట్టగా, ప్రజల నుంచి విమర్శలు వచ్చాయి. నాసిరకం చీరలను కానుకగా ఇస్తున్నారని కొందరు మహిళలు ఆరోపించారు. పండుగకు ఇలాంటి చీరలు ఎవరైనా ధరిస్తారా! అంటూ మండిపడ్డారు. మరికొన్ని ప్రాంతాలలో వాటిని పూర్తి స్థాయిలో పంపిణీ చేయక పంచాయతీ కార్యాలయాలలోనే ఉండిపోయాయి.

ఛత్తీస్‌గఢ్‌లో మరో ఎన్‌కౌంటర్

మొదటిపేజీ తరువాయి

మావోయిస్టులు మరణించారు. బీజాపూర్ ఎస్పీ డాక్టర్ జితేంద్ర యాదవ్ ఈ విషయాన్ని ధ్రువీకరించారు. మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా జాతీయ భద్రతా బలగాల వేట కొనసాగుతోంది. ఈ క్రమంలోనే మావోయిస్టులకు మరోమారు భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఛత్తీస్‌గఢ్-బీజాపూర్ జిల్లా నేషనల్ పార్క్ అటవీ ప్రాంతంలో మంగళవారం ఉదయం నుండి పోలీసులకు మావోయిస్టులకు మధ్య ఎదురు కాల్పులు చోటు చేసుకున్నాయి. ఆరుగురు మావోయిస్టులు మృతి చెందారు. ఘటనా స్థలం నుండి ఇన్సాస్, స్టెన్ గన్, 303 ఆరు ఆయుధాలను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయని సమాచారం. మృతిచెందిన వారిలో మావోయిస్టు అగ్రనేతలు మద్దేడు ఏరియా కమిటీ ఇన్‌ఛార్జ్ బుచ్చన్న, మోస్ట్ వాంటెడ్ మావోయిస్టు పాపారావు భార్య ఊర్మిల ఉన్నారని తెలిసింది. ఎదురు కాల్పులు ఇంకా కొనసాగుతున్నట్లు పోలీసు వర్గాలు చెబుతున్నాయి. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అంటున్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి సిద్ధం

- మెడికల్ నిబంధనలు సరళతరం చేస్తాం
- సంప్రదింపుల కమిటీ సమావేశంలో సింగరేణి సీఎండీ బలరామ్

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 11 : గతానికి భిన్నంగా ఈసారి గుర్తింపు, ప్రాతినిధ్య కార్మిక, అధికార సంఘాలతో జరిగిన సమావేశాలు ప్రశాంతంగా, నిర్మాణాత్మక సూచనలతో, సలహాలతో హుందాగా జరిగాయని సింగరుణి సీఎండీ ఎన్. బలరామ్ చెప్పారు. కార్మిక సంఘాలు సూచించిన అన్ని సమస్యలపైన కూలంకషంగా చర్చించి సానుకూలంగా నిర్ణయాలు తీసుకుంటామని పేర్కొన్నారు. హైదరాబాద్ సింగరేణి భవన్‌లో మంగళవారం నాడు సంఘాల ప్రతినిధులతో జరిగిన 38వ సంయుక్త సంప్రదింపుల కమిటీ సమావేశంలో ఆయన ప్రసంగించారు. కార్మిక సంఘాలు సూచించిన విధంగా మెడికల్ అటెండెన్స్ నిబంధనలను సరళతరం చేస్తామన్నారు. కార్మికులకు, అధికారులకు రావాల్సిన పదోన్నతులలో ఎటువంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఒకవేళ ఉద్యోగులకు, అధికారులకు చార్జిషీట్లు జారీ అయిన పక్షంలో నిర్ణీత వ్యవధిలో వాటిపై విచారణను పూర్తి చేసేలా చూస్తామన్నారు. గుర్తింపు కార్మిక సంఘం అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, జనరల్ సెక్రెటరీ రాజ్ కుమార్, ప్రాతినిధ్య కార్మిక సంఘం ఐఎన్టీయూసీ సెక్రెటరీ జనరల్, రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ జనక్ ప్రసాద్, అధికారుల సంఘం అధ్యక్షులు లక్ష్మీపతి గౌడ్ సూచించిన సమస్యలపై, సూచనలపై సీఎండీ ఎన్. బలరామ్ సానుకూలంగా స్పందించారు. సంస్థ ప్రగతి పైన భవిష్యత్తు ప్రణాళికలను ఎంతో ఉద్వేగంగా వివరించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు గౌతమ్ పొట్రు, ఎల్వీ సూర్యనారాయణ, కె.వెంకటేశ్వర్లు, ఎం.తిరుమలరావు మాట్లాడారు. జీఎంలు టి.శ్రీనివాస్, ఐఆర్, పీఎం కవితా నాయుడు పాల్గొన్నారు.

13న బీసీల ధర్మ పోరాట దీక్షలు

- ప్రభుత్వాలపై పోరాటం చేయాల్సిందే
- 'స్థానిక' ఎన్నికలపై తొందరపడవద్దు
- పార్లమెంట్ సమావేశాలలో యుద్ధం చేయండి
- దీక్ష పోస్టర్ ఆవిష్కరణలో జాజుల శ్రీనివాస్ గౌడ్, గుజ్జు కృష్ణ

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 11 : బీసీలకు 42 శాతం రిజర్వేషన్ సాధన కోసం ఈ నెల 13న రాష్ట్రవ్యాప్తంగా ధర్మ పోరాట దీక్షలు చేపట్టాలని బీసీ జేఏసీ వర్కింగ్ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్, బీసీ జేఏసీ చీఫ్ కోఆర్డినేటర్ గుజ్జుకృష్ణ పిలుపునిచ్చారు. హైదరాబాదులోని కాచిగూడ అభినంద్ గ్రాండ్ హోటల్ లో బీసీ జేఏసీ చీఫ్ ఆర్డినేటర్ గుజ్జ కృష్ణ, బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారితో కలిసి జాజుల శ్రీనివాస్ గౌడ్ మంగళవారం నాడు పోస్టర్ ఆవిష్కరించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ రిజర్వేషన్ సాధన కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అఖిలపక్షంతో ఢిల్లీకి వెళ్లి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలన్నారు. డిసెంబర్ ఒకటి నుండి మొదలయ్యే పార్లమెంట్ సమావేశాలలో బీసీ రిజర్వేషన్ల అంశంపై రాహుల్ గాంధీ ఇండియా కూటమి నేతలతో సమన్వయం చేసుకుని పార్లమెంటును స్తంభింపచేయాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం దిగివచ్చేదాకా పోరాటాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పోరాటం చేస్తే బీసీలు కూడా అండగా ఉంటారని తెలిపారు. అలా కాక, బీసీల మాటను ఇటు పెడచెవిన పెట్టి స్థానిక ఎన్నికలు నిర్వహిస్తామంటే మాత్రం అమీ తుమీ తేల్చుకుంటామని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం, బీజేపీ పూటకో మాట మాట్లాడి బీసీ వర్గాలను రోజురోజుకూ దూరం చేసుకుంటున్నాయన్నారు. ఇప్పటికైనా పార్లమెంట్ సమావేశాలలో రాష్ట్ర ప్రభుత్వం చేసిన చట్టాన్ని యధావిధిగా ఆమోదించాలని కోరారు.

ఇస్లామాబాద్‌లో దాడి వెనుక భారత్ హస్తం ఉందన్న పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ఆరోపణలు నిరాధారమైనవి. ఆ దేశంలోని సైనిక పాలన తరహా విధ్వంసం, అధికార దోపిడి నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికి పాక్ వ్యూహం పన్నింది. ప్రపంచ దేశాలకు వాస్తవం ఏంటో తెలుసు. పాక్ కుట్రల ద్వారా ప్రపంచ దేశాలు తప్పుదోవ పట్టవు.

- విదేశాంగ ప్రతినిధి రణధీర్ జైస్వాల్

48.42 శాతం పోలింగ్

మొదటిపేజీ తరువాయి

కాంగ్రెస్ పార్టీ ఫిర్యాదు చేసింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డితో పాటు ఆ పార్టీ కార్పొరేటర్లపై చర్యలు తీసుకోవాలని కోరింది. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నియోజకవర్గంలో తిరుగుతూ ఓటర్లను ప్రలోభ పెడుతున్నారని బీఆర్ఎస్ ఆరోపించింది జూబ్లీహిల్స్‌లో గెలుపు కోసం ఎమ్మెల్యేలు దిగజారి ప్రవర్తిస్తున్నారని మండిపడింది. కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రజా ప్రతినిధులు పోలింగ్ స్లిప్పులు పట్టుకొని, అటు నోట్ల కట్టలతో ఓటర్లను ప్రలోభ పెడుతున్నారని, దీంతో కాంగ్రెస్ తన ఓటమిని ఒప్పుకుందని ఎద్దేవా చేసింది.

రిగ్గింగ్ జరుగుతోందని

జూబ్లీహిల్స్ పోలింగ్‌లో రిగ్గింగ్ జరుగుతోందని బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీకి ఓటేయకపోతే బయట తిరగనివ్వబోమంటూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, నియోజకవర్గంలో రౌడీషీటర్లు తిరుగుతున్నారని విమర్శించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు, ఎమ్మెల్యేలకు ఇక్కడ పనేంటి అని సునీత ప్రశ్నించారు. బీఆర్ఎస్ నేతలు అసత్య ఆరోపణలు చేస్తున్నారని కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్ ఎదురుదాడి చేశారు. ఈసీ నిబంధనల ప్రకారమే తమ పార్టీ నేతలు నడుచుకుంటున్నారని, తమ పార్టీ నేతలు ఎవరూ నియోజకవర్గంలో లేరని చెప్పారు. మరోవైపు పోలింగ్ కేంద్రాల సమీపంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు ఓటర్లకు డబ్బులు పంచుతున్నారని బీజేపీ అభ్యర్థి లంకల దీపక్ రెడ్డి ఆరోపించారు. రెండు పార్టీల నేతలు ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తున్నా కూడా పోలీసులు పట్టించుకోవడం లేదని, దొంగ ఓట్లు వేస్తున్నా కూడా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు.

పలు చోట్ల ఘర్షణలు

పోలింగ్ సందర్భంగా పలుచోట్ల పరస్పరం ఘర్షణలు జరిగాయి. బోరబండ స్వరాజ్ నగర్‌లో కాంగ్రెస్, బీఆర్ఎస్ వర్గాల మధ్య వివాదం చెలరేగింది. కార్పొరేటర్ ఫసియుద్దీన్ తమపై దాడి చేశారంటూ బీఆర్ఎస్ కార్యకర్తలు ఆందోళనకు దిగారు. దీంతో అక్కడికి చేరుకున్న బీఆర్ఎస్ అభ్యర్థి సునీతను పోలీసులు అడ్డుకున్నారు. ఇక వెంగళరావు నగర్ పోలింగ్ బూత్ నెంబర్ 120 దగ్గర ఓటర్లకు బీఆర్ఎస్ కార్యకర్తలు డబ్బులు పంచుతున్నారంటూ కాంగ్రెస్ కార్యకర్తలు గొడవకు దిగారు. దీంతో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. ఇదే ఏరియాలో సత్తుపల్లి ఎమ్మెల్యే భర్త దయానంద్‌పై ఆర్వోకి బీఆర్ఎస్ నేతలు ఫిర్యాదు చేశారు. వెంగళరావునగర్ పోలింగ్ కేంద్రం దగ్గర ఓటర్లను ప్రభావితం చేస్తున్నారని బీఆర్ఎస్ పార్టీ ఆరోపించింది. బీఆర్ఎస్ ఏజెంట్లను బూత్‌లోకి పంపి తనను అడ్డుకున్నారంటూ షేక్‌పేట్ డివిజన్‌లో పోలీసులతో కాంగ్రెస్ నేత సత్యనారాయణ. వాగ్వాదానికి దిగారు. కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడితో పాటు సత్యనారాయణకు పోలీసులు సర్ది చెప్పడంతో గొడవ సద్దుమణిగింది.

తుఫాను బాధితులకు పరిహారం

మొదటిపేజీ తరువాయి

గుర్తించింది. 334 ప్రాంతాలలో 230.41 కిమీ రహదారులు తీవ్రంగా దెబ్బతిన్నాయి. 201 రహదారుల మీద వర్షపు నీరు పొంగిపొర్లింది. ఎనిమిది రోడ్లకు పగుళ్లు వచ్చాయి. 156 ప్రాంతాలలో రాకపోకలు ఆగిపోగా పలుచోట్ల అధికారులు వాటిని పునరుద్ధరించారు. 61 చోట్ల కల్వర్టులు దెబ్బతిన్నాయి. హన్మకొండ, వరంగల్, నల్గొండ, సూర్యాపేట, నాగర్‌కర్నూలు, ములుగు, రాజన్నసిరిసిల్ల, సిద్ధిపేట, యాదాద్రి భువనగిరి, మహబూబ్‌నగర్, కరీంనగర్, రంగారెడ్డి, వికారాబాద్, వనపర్తి జిల్లాలకు నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఇళ్ల మరమ్మతులకు రూ.15 వేలు

మొంథా తుపాను కారణంగా పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10 వేలు, మృతుల కుటుంబాలకు రూ.5 లక్షలు, మరణించిన పశువుల యజమానులకు రూ. 50 వేల చొప్పున పరిహారం అందిస్తామని సీఎం వరంగల్ పర్యటనలో ప్రకటించారు. నీట మునిగిన ఇంటికి రూ.15 వేలు, నిర్వాసితులైతే ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసే విషయాన్ని పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. మొంథా తుపాను ప్రభావంతో తెలంగాణలో పంటనష్టంపై సర్వే పూర్తి అయ్యింది. 1,17,757 లక్షల ఎకరాలలో పంట నష్టం జరిగినట్లు అధికారులు ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. వరి 83,407 ఎకరాలు, పత్తి 30,144 ఎకరాలు, మొక్కజొన్న 2,097 ఎకరాలలో దెబ్బతిన్నాయి. అత్యధికంగా నాగర్‌కర్నూల్‌లో పంట నష్టం జరిగినట్లు నివేదికలో పేర్కొన్నారు. దెబ్బతిన్న పంట వివరాలు కేంద్రానికి పంపి ఎన్‌డీఆర్ఎఫ్ కింద నిధులు కోరనున్నారు.

ముగిసిన 'అందెశ్రీ' ప్రస్థానం

మొదటిపేజీ తరువాయి

కొనసాగాయి. అందెశ్రీ భౌతికకాయం వద్ద సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తో పాటు మంత్రులు మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, శ్రీధర్‌బాబు, అడ్లూరి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నివాళులు అర్పించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా అందెశ్రీ పాడె మోశారు. పాల్గొన్నారు. అలాగే వి.హనుమంత రావు, విమలక్క తదితరులు పాల్గొన్నారు. అందెశ్రీతో గతంలో అనేక విషయాలు చర్చించానని సీఎం గుర్తు చేసుకున్నారు. ఆయన రచించిన 'జయ జయహే తెలంగాణ'ను రాష్ట్ర గీతంగా నిర్ణయించామన్నారు. ఈ గీతాన్ని పాఠ్యపుస్తకాలలో చేరుస్తామని చెప్పారు. అందెశ్రీ కుటుంబ సభ్యులలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చారు. తన జీవితాన్ని ప్రజల కోసం త్యాగం చేసిన మహనీయుడు అందెశ్రీ అని సీఎం కొనియాడారు.

అందెశ్రీ గొప్ప మానవతావాది

అందెశ్రీ రచించిన 'నిప్పులవాగు' భావితరాలకు స్ఫూర్తిదాయకమని సీఎం పేర్కొన్నారు. ప్రతి గ్రంథాలయంలో నిప్పులవాగు పుస్తకం ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. సమాజమే కుటుంబమని భావించిన గొప్ప మానవతావాది అందెశ్రీ అని కొనియాడారు. అందెశ్రీకి పద్మశ్రీ పురస్కారం ఇవ్వాలని కేంద్రానికి మరోసారి లేఖ రాస్తామన్నారు. కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ ఇందుకు ప్రయత్నించాలని రెడ్డి కోరారు. 'ప్రత్యేక రాష్ట్ర సాధనలో అందెశ్రీ పాత్ర ఎనలేనిది. రాష్ట్ర సాధనలో కోట్ల మందిని ఏకం చేయాలని అందెశ్రీని కోరాను. అందెశ్రీ మృతి నాకు వ్యక్తిగతంగా తీరని లోటు. అందెశ్రీ స్ఫూర్తితోనే పేదలు, బడుగువర్గాలకు అండగా ఉన్నామని' సీఎం అన్నారు. అందెశ్రీ పేరుతో స్మృతివనాన్ని అత్యద్భుతంగా తీర్చిదిద్దుతామన్నారు. వేలాదిగా తరలివచ్చిన అభిమానులు, సాహితీప్రియులు అక్షరయోధుడికి కడసారి కన్నీటి వీడ్కోలు పలికారు.

మల్లుబాయిని ఓదార్చిన సీఎం

అందెశ్రీ సతీమణి మల్లుబాయి సీఎం రేవంత్ రెడ్డిని చూసి ఒక్కసారి బోరున విలపించారు. కుమార్తెలు వాక్కులమ్మ, వెన్నెల, వేకువ, కుమారుడు దత్తు సంప్రదాయం పద్ధతిలో కర్మకాండలను నిర్వహించగా, అధికారిక లాంఛనాలతో అందెశ్రీ అంత్యక్రియలు పూర్తయ్యాయి. ముఖ్యమంత్రి అందెశ్రీ కుటుంబ సభ్యులను ఓదార్చారు. అంతిమ సంస్కార కార్యక్రమాన్ని దగ్గరుండి పరిశీలించారు. సీఎం ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన సలహాదారు కే కేశవరావు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై ప్రభుత్వం స్పందించాలి

- **డిండి, నక్కలగండి నిర్వాసితులకు అండ**
- **నల్గొండ పర్యటనలో జాగృతి అధ్యక్షురాలు కవిత**

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నల్గొండ ప్రతినిధి, నవంబర్ 11: తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత జాగృతి జనంబాట కార్యక్రమంలో భాగంగా నల్గొండ జిల్లాలోని పలు ప్రాంతాలను మంగళవారం సందర్శించారు. డిండి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పరిధిలోని కిష్టరాయినిపల్లి రిజర్వాయర్, శివన్నగూడెం రిజర్వాయర్ల నిర్వాసితులను కలిసి వారి సమస్యలు తెలుసుకున్నారు. బాధితులు కన్నీటితో తమ బాధలను వ్యక్తం చేయగా, వారికి అండగా ఉంటానని కవిత భరోసా ఇచ్చారు. డిండి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పూర్తయితే వేలాది మందికి లాభం చేకూరుతుందని పేర్కొన్నారు. ప్రాజెక్టు నిర్మాణం ఆలస్యం కావడంతో అనేక కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని అన్నారు. 2015లోనే పనులు పూర్తయ్యి ఉంటే సమస్యలు తలెత్తేవి కావని ఆమె అన్నారు. పద కొండుండ్లలో అప్పుడు చిన్నవారుగా ఉన్నవారు ఇప్పుడు పెద్దవారు అయ్యారని, వారికి కూడా పరిహారం చెల్లించే బాధ్యత ప్రభుత్వంపై ఉందని గుర్తుచేశారు. అవసరమైతే యువతతో కలిసి హైదరాబాద్‌లో ఉద్యమం చేపడతానని స్పష్టం చేశారు.

గురుకులాల బాధలు

తర్వాత కవిత దేవరకొండ మండలం కొమ్మపల్లి గురుకుల పాఠశాలను సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి వారి పరిస్థితులు తెలుసుకున్నారు. అక్కడి హాస్టల్ పరిస్థితులు చూసి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. దేవరకొండ ఎస్టీ బాలుర రెసిడెన్షియల్ హాస్టల్ లో పరిస్థితులు చాలా దయనీయంగా ఉన్నాయని తెలిపారు. 450 మంది విద్యార్థులు ఉన్నా ఇద్దరు శానిటేషన్ వర్కర్లు మాత్రమే ఉండటం బాధాకరమని పేర్కొన్నారు. స్కూల్‌కు కాంపౌండ్ వాల్ లేకపోవడం, క్లాస్‌రూమ్‌లు సరిగా లేకపోవడం వంటి సమస్యలను గుర్తించి, కలెక్టర్, ఆర్డీవో చర్యలు తీసుకోవాలని కోరారు. దేవరకొండ బస్టాండ్ చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహానికి, కవి అందెశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. తర్వాత నక్కలగండి ప్రాజెక్టును సందర్శించారు. నిర్వాసితుల సమస్యలను విన్నారు. త్వరలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డిని కలిసి ఈ అంశాలపై చర్చిస్తానని భరోసా ఇచ్చారు.

జర్నలిస్టుల రైల్వే పాసులు పునరుద్ధరించాలి

- **ఎంపీ అర్వింద్ కు టీయూడబ్ల్యూజే వినతి**

ప్రతిపక్షం ప్రతినిధి, జగిత్యాల, నవంబర్ 11: జర్నలిస్టుల రైల్వే పాసులను పునరుద్ధరించాలని కోరుతూ టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ కు వినతిపత్రం సమర్పించారు. మంగళవారం నాడు కలెక్టరేట్ లో నిర్వహించిన దిశ సమావేశం లో పాల్గొనేందుకు వచ్చిన ఎంపీని యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చీటి శ్రీనివాసరావు, బెజ్జంకి సంపూర్ణాచారి కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రజలకు మధ్య అనుసంధానంగా ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా నిరంతరం పనిచేస్తున్న జర్నలిస్టులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొన్ని సౌకర్యాలు కల్పించాయన్నారు. ఇందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీలో రాయితీతో కూడిన ప్రయాణానికి జర్నలిస్టులకు బస్సు పాసులు అందజేస్తుందన్నారు. గతంలో కేంద్ర ప్రభుత్వం కూడా జర్నలిస్టులకు రాయితీతో కూడిన రైల్వే పాసులను అందజేసేదని వాటిని మూడు సంవత్సరాల క్రితం రద్దు చేశారన్నారు. రైల్వే పాసులను పునరుద్ధరించేందుకు కృషి చేయాలని ఎంపీ ని కోరారు. సానుకూలంగా స్పందించిన ఎంపీ రైల్వే మంత్రి, అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఎంపీని కలిసిన వారిలో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు గడ్డల హరికృష్ణ, హైదర్ అలీ, కోశాధికారి సిరిసిల్ల వేణుగోపాల్, సీనియర్ జర్నలిస్టులు రాజేందర్ రెడ్డి, ఆనంద్, వంశీకృష్ణ, చింత లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

మహానగరానికి 'నీటి ఎద్దడి' లేకుండా చర్యలు

- **అధికారులకు సీఎస్ రామకృష్ణారావు ఆదేశం**

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 11 : ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు గ్రేటర్ హైదరాబాద్ లో రానున్న రోజులలో త్రాగు నీటి సమస్య రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణారావు అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన సచివాలయంలో హైదరాబాద్ వాటర్ వర్క్స్ విభాగం పని తీరుపై సమీక్ష నిర్వహించారు. మంజీర, సింగూరు, గోదావరి ఫేజ్ 2,ఫేజ్ 3 పనులపై ఆరా తీశారు. భూసేకరణ, పైప్ లైన్ల నిర్మాణంపై అధికారులతో చర్చించారు. ఇరిగేషన్, రెవెన్యూ, అటవీ, రోడ్లు, భవనాల శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ప్రభుత్వ నిర్దేశించిన ప్రాజెక్టులను పూర్తి చేయడానికి సహకరించుకోవాలని అన్నారు. కాగా, ఈ సమావేశంలో నీటి పారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా, హైదరాబాద్ వాటర్ వర్క్స్ మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డి, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, పీసీసీఎఫ్ డాక్టర్ సి. సువర్ణ, రంగారెడ్డి, సిద్దిపేట జిల్లా కలెక్టర్లు, మిషన్ భగీరథ ఇంజనీర్ ఇన్ చీఫ్ కృపాకర్ రెడ్డి తదితరలు పాల్గొన్నారు.

'దేశిని' ఆశయాలను కొనసాగిస్తాం

- **రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్**

ప్రతిపక్షం, హుస్నాబాద్, నవంబర్ 11 : ఇందుర్తి మాజీ శాసనసభ్యులు దేశిని చిన్న మల్లయ్య ఆశయాలను కొనసాగిస్తానని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. దేశిని చిన్న మల్లయ్య వర్ధంతి సందర్భంగా మంత్రి పొన్నం సంతాప ప్రకటన విడుదల చేశారు. దేశిని చిన్న మల్లయ్య ఈ ప్రాంతానికే కాకుండా యావత్ తెలంగాణ రాష్ట్రానికే ఆదర్శమని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఆయన కీలక పాత్ర పోషించారని గుర్తు చేసిన మంత్రి, ప్రజల మధ్య నిరాడంబర జీవనం గడుపుతూ సీపీఐకి విశిష్ట సేవలు అందించారని తెలిపారు. ప్రజల సమస్యలను అర్థం చేసుకుని వాటి పరిష్కారానికి కృషి చేసిన ప్రజానేతగా నిలిచారని అన్నారు. మల్లయ్య ఆశయాలు, ప్రజాసేవ పట్ల ఆయన చూపిన నిబద్ధత తనకు ప్రేరణనని పేర్కొన్న మంత్రి పొన్నం, దేశిని చిన్న మల్లయ్య వారసుడిగా ఆయన ఆశయాలను కొనసాగిస్తూ ప్రజాసేవలో ముందుకు సాగుతానన్నారు.

తన ఇంటి ముందు రోడ్డుకు నీళ్లు పడుతున్న స్థానికుడు

సీసీ రోడ్డు వేశారు, నీళ్లు పట్టడం మరిచారు

- **పర్యవేక్షణ లోపంతో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం**
- **షాద్ నగర్ మున్సిపాలిటీలో రహదారుల తీరిది**

ప్రతిపక్షం, షాద్ నగర్, నవంబర్ 11 : షాద్ నగర్ మున్సిపాలిటీని జిల్లాలో ఆదర్శంగా నిలిపేందుకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కృషిచేస్తున్నారు. ఇందులో భాగంగా గతంలో ఎన్నడూ లేని విధంగా పట్టణంలోని కాలనీలలో సీసీ రోడ్లకు భారీ ఎత్తున నిధులు తీసుకొచ్చారు. అయితే, సీసీ రోడ్ల నిర్మాణంలో కాంట్రాక్టర్ నాణ్యత ప్రమాణాలు ఏమాత్రం పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మున్సిపాలిటీ అధికారులు రహదారుల పనులను పరిశీలించడం లేదనే విమర్శలు కూడా ఉన్నాయి. ఇష్టానుసారంగా సీసీ రోడ్లు నిర్మిస్తున్నారని, వర్షపు నీరు వెళ్లేందుకు వీలులేకుండా కొన్ని కాలనీలలో రోడ్ల నిర్మాణం చేపట్టారని అంటున్నారు. రహదారుల క్యూరింగ్ సరిగ్గా చేయడంలేదని ఆరోపిస్తున్నారు. తిరుమల మెఘా టౌన్ షిప్ కాలనీలో ఐదు రోజుల క్రితం సీసీ రోడ్డు వేశారు. కానీ, దానిని తిరిగి చూసే నాథుడే కరువయ్యారు. సీసీ రోడ్డుపై కట్టలు కట్టి క్యూరింగ్ చేపట్టాలి. అలా చేపడితేనే రోడ్డు నాణ్యతగా ఉంటుంది. రోడ్డు వేసి రోజులు గడుస్తున్నా క్యూరింగ్ చేయకుండా నిర్లక్ష్యంగా వదిలేశారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చర్యలు తీసుకోవాలని కాలనీ ప్రజలు వేడుకుంటున్నారు.



చదరపు గజానికి రూ.3,40,000

- **మునుపటి రికార్డును బద్దలు కొట్టిన వేలం**
- **నాలెడ్జ్ సిటీ బొటిక్ యూజ్ ప్లాట్‌కు డిమాండ్**

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 11 : తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (టీజీఐఐసీ) హైదరాబాద్ నాలెడ్జ్ సిటీకి నడిబొడ్డున ఉన్న రాయదుర్గ్‌లో, వ్యూహాత్మకంగా కేటాయించిన సుమారు ఒక ఎకరం భూమి వేలాన్ని విజయవంతంగా ముగించింది. ఈ వేలంలో చదరపు గజానికి రూ. 3 లక్షల 40 వేల చొప్పున గణనీయ ధర పలికింది. చదరపు గజానికి ఈ చారిత్రాత్మక ధర, 2017లో (చదరపు గజానికి రూ. 88,000) నమోదైన మునుపటి రికార్డును బద్దలు కొట్టింది. ఈ సందర్భంగా టీజీఐఐసీ వీసీ, ఎండీ శశాంక మాట్లాడుతూ, 'ఈ వేలంలో స్థిరంగా నమోదవుతున్న అధిక పనితీరు, ముఖ్యంగా 'బొటిక్ మల్టీ యూజ్' అభివృద్ధికి అనువైన ప్లాట్ల విషయంలో, హైదరాబాద్ ఆర్థిక వృద్ధి అసాధారణ లోతు, పరిపక్వత ప్రదర్శిస్తుంది. నగరంలో అత్యంత వేగంగా విస్తరిస్తున్న, అధిక రాబడినిచ్చే వ్యాపార కారిడార్‌లో ప్రధాన స్థలాలను దక్కించుకోవడానికి డెవలపర్లు వ్యూహాత్మకంగా ప్రీమియం చెల్లించి మరీ పెట్టుబడి పెడుతున్నారు' అని చెప్పారు. పారదర్శక, పెట్టుబడిదారులకు అనుకూలమైన తెలంగాణను నిర్మించడంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పరిశ్రమల మంత్రి శ్రీధర్ బాబు పరివర్తనాత్మక దృష్టికి ఈ వేలం చారిత్రాత్మక విజయం ఒక నిదర్శనమని పేర్కొన్నారు..

ఎంజేపీటీబీసీ కళాశాలలో బీఎస్సీ ప్రవేశాలు

- **ఈ నెల 14న కౌన్సెలింగ్ నిర్వహణ**
- **ఎంజెపీ కార్యదర్శి బడుగు సైదులు**

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 11 : ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం అనుబంధ కళాశాలలో బీఎస్సీ అగ్రికల్చర్ కోర్సు ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈనెల 14న కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామని బీసీ గురుకుల విద్యాసంస్థల సొసైటీ కార్యదర్శి బడుగు సైదులు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంజెపీ ద్వారా నిర్వహిస్తున్న ఈ కోర్సులో ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు రాజేంద్ర నగర్ లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ అగ్రికల్చర్ యూనివర్సిటీ ఆడిటోరియంలో నిర్వహించే కౌన్సెలింగ్ కు హాజరు కావాలని పేర్కొన్నారు. అన్ని సర్టిఫికెట్స్ ఒరిజినల్, జిరాక్స్ కాపీలు తీసుకుని రావాలని సూచించారు. వివరాల కోసం https://www.pjtau.edu.in, https://mjptbcwreis.telangana.gov.in/ వెబ్ సైట్ సందర్శించాలని పేర్కొన్నారు.

నీటి ట్యాంకులలో కలిపే విషం తయారీ

- **ఉగ్రవాది మొయినుద్దీన్ విచారణలో సంచలన విషయాలు**



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 11 : అరెస్టు అయిన ఉగ్రవాది డాక్టర్ మొయినుద్దీన్ విచారణలో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. గుజరాత్ రాష్ట్ర ఏటీఎస్ బృందం రాజేంద్రనగర్ ప్రాంతంలో సయ్యద్ మొయినుద్దీన్‌ను అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. విచారణలో కీలక సమాచారం బయటకు వచ్చినట్టు తెలుస్తోంది. మొయినుద్దీన్ భారీ స్థాయిలో విషప్రయోగం చేసి చంపాలని కుట్ర పన్నినట్లు వెల్లడైంది. అతను రెసిన్ అనే ప్రాణాంతక రసాయనాన్ని తయారు చేస్తున్నాడని పోలీసులు తెలిపారు. ఈ విషాన్ని దేవాలయాల నీటి ట్యాంకులలో, పబ్లిక్ వాటర్ ట్యాంక్‌లో కలిపి పెద్ద ఎత్తున ప్రజలను చంపాలని కుట్ర పన్నినట్లు తెలుస్తోంది. మొయినుద్దీన్ నుంచి రెసిన్ తయారీలో ఉపయోగించే పలు రసాయన పదార్థాలను గుజరాత్ ఏటీఎస్ స్వాధీనం చేసుకుంది. మొయినుద్దీన్ పాకిస్తాన్ నుంచి వచ్చిన హ్యాండ్లర్ ఆదేశాల మేరకు ఈ విషాన్ని తయారు చేస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. దానికి సంబంధించిన డిజిటల్ ఆధారాలు కూడా లభించినట్టు అధికారులు తెలిపారు. సయ్యద్ మొయినుద్దీన్ చైనాలో ఎంబీబీఎస్ పూర్తి చేసి హైదరాబాద్‌కు తిరిగి వచ్చి, ఆన్‌లైన్ ట్రీట్‌మెంట్ పేరుతో వైద్య సేవలు అందిస్తున్నాడు. అతనితో పాటు గుజరాత్ ఏటీఎస్ నలుగురిని అరెస్ట్ చేసింది. మొయినుద్దీన్ నుండి మరిన్ని వివరాలు తెలుసుకోవడానికి ప్రత్యేక బృందం విచారణ జరుపుతోంది.

'జీవిత సాఫల్య పురస్కారం' అందుకున్న నశీర్ అహమ్మద్

- **అందజేసిన ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు**

ప్రతిపక్షం ప్రతినిధి, విజయవాడ, నవంబర్ 11: మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా రాష్ట్ర ఉర్దూ అకాడమీ ప్రముఖ చరిత్రకారుడు, బహుగ్రంథ రచయిత సయ్యద్ నశీర్ అహమ్మద్ కు ప్రకటించిన జీవిత సాఫల్య పురస్కారాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంగళవారం రాత్రి విజయవాడలో అందజేశారు. అల్పసంఖ్యాక వర్గాల సంక్షేమ దినోత్సవ సభలో ముఖ్యమంత్రి ఈ పురస్కారాలను అందజేశారు. నశీర్ అహమ్మద్ ను 25 వేల నగదు, జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు. 2014లో నశీర్ వెలువరించిన 'చరితార్థులు' ఆల్బంను ముఖ్యమంత్రికి అందజేశారు. ఈ గ్రంథంలో 155 మంది ముస్లిం స్వాతంత్ర్య సమరయోధుల చిత్రాలు, వారి వివరాలను ఆంగ్లం తెలుగు భాషలలో పొందుపర్చిన విషయాన్ని ముఖ్యమంత్రికి వివరించారు. 2016 లో ఉగాది పురస్కారం, 2025 యేట ఉగాది సందర్భంగా 'కళారత్న' పురస్కారం ముఖ్యమంత్రి నుండి అందుకున్న నశీర్ అహమ్మద్ ప్రస్తుత జీవన సాఫల్య పురస్కారం తో మూడు సార్లు అందుకున్నట్టయింది. కార్యక్రమంలో మైనార్టీ శాఖా మంత్రి ఎన్ఎండీ ఫరూక్, శాసన సభ్యులు ఎండీ నసీర్, బోండా ఉమామహేశ్వర రావు, సయ్యద్ షాజహాన్ బాషా, రాష్ట్ర నూర్ బాషా ఆర్థిక సహాయక సంస్థ అధ్యక్షుడు షేక్ నాగూల్ మీరా, రాష్ట్ర ప్రభుత్వ మైనారిటీ వ్యవహారాల సలహాదారు అహమ్మద్ షరీఫ్, మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు ఎండీ ఫరూక్ షుబ్లీ, తెలుగు దేశం అధికార ప్రతినిధి సయ్యద్ రఫీ, ఎస్.పి సాహెబ్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు.



అందెశ్రీకి కళాకారుల అంతిమ వీడ్కోలు

- **కుటుంబ సభ్యులను కలిసి పరామర్శ**

ప్రతిపక్షం, హుస్నాబాద్, నవంబర్ 11 : ప్రసిద్ధ వాగ్గేయకారుడు, లోకకవి అందెశ్రీ అంతిమయాత్రలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన కళాకారులు పాల్గొని నివాళులు అర్పించారు. ఘట్ కేసర్ లో కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. అందెశ్రీ మరణం కళా, సాహిత్య రంగానికి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవతో అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ద్రావిడ సాహిత్య సంస్కృతిక కళా మండలి వ్యవస్థాపక అధ్యక్షులు రామంచ భరత్, జనజాగృతి కళాసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ముక్కెర సంపత్ కుమార్, మాజీ సర్పంచ్, బోయిని సమ్మన్న, బోయిని రాజశేఖర్, పొన్నాల వినోద్ కుమార్ పాల్గొన్నారు.

"



ముంబై ఇండియన్స్ గత వేలంలో అధిక ధరకు కొనుగోలు చేసిన బౌల్ట్, దీపక్ చాహర్ ను వదిలేయాలి. వీరిద్దరినీ వదిలేస్తే పర్స్ ఎక్కువగా మిగులుతుంది. టీమ్ బెంచ్ స్ట్రెంత్‌ను స్ట్రాంగ్ చేసుకోవచ్చు. అవసరమైతే వారిని మళ్లీ తక్కువ ధరకు మినీ వేలంలో తీసుకునే అవకాశం ఉంటుంది.

- ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్ హెడెన్

ఓపెన్ వాయిస్

మారణహోమాలను నివారించలేమా!

దేశ రాజధాని ఢిల్లీ ఎర్రకోట సమీపంలో సోమవారం సాయంత్రం బాంబు పేలుళ్లు జరిగాయి. మెట్రో స్టేషన్ దగ్గర గేట్ -1 వద్ద పార్కింగ్ చేసిన ఓ కారులో పేలుళ్లు జరిగాయి. ఈ ఘటనలో ఐదు కార్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. సమీపంలో ఉన్న దుకాణాల తలుపులు, కిటికీలు ధ్వంసమయ్యాయి. ఘటన జరిగిన తర్వాత బాంబ్ స్క్వాడ్ బృందాలతో ఘటనా స్థలానికి చేరుకుని విచారణ మొదలుపెట్టారు. మొదట ఈ ఘటనలో ఒకరే మృతిచెందినట్లు కథనాలు వచ్చాయి. ఆ తర్వాత చనిపోయినవారి సంఖ్య 12కు పెరిగింది. 20 మంది తీవ్రంగా గాయపడ్డారు. వారి శరీరాలు పూర్తిగా ఛిద్రమయ్యాయి. గాయపడిన వారిని ఎల్ఎన్జేపీ ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటనలో చాలావరకు వాహనాలు ధ్వంసమయ్యాయి. ఈ పేలుడు వెనక ఉగ్ర కుట్ర ఉందేమోనన్న కోణంలో దర్యాప్తు మొదలు పెట్టారు. ఆదివారం యాంటీ టెర్రరిజం స్క్వాడ్ విస్తృతంగా దాడులు జరిపింది. ఈ దాడులలో ఉగ్ర మూలాలు ఉన్న వ్యక్తులను అరెస్ట్ చేసింది. వారిని అరెస్టు చేసిన తర్వాత ఒకరోజు వ్యవధిలో ఈ ఘటన జరగడం విశేషం.

ఉగ్రవాదులు మనదేశంలో దాడులు జరపడానికి కుట్రలు పన్నారని యాంటీ టెర్రరిజం స్క్వాడ్ దర్యాప్తులో తేలింది. పలు ప్రాంతాలలో ఉగ్రవాదులను దర్యాప్తు బృందం అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఇది జరిగిన ఒక రోజు వ్యవధిలోనే ఈ దారుణం చోటుచేసుకుంది. దీని వెనుక ఉగ్రవాదులు ఉన్నారని దర్యాప్తు బృందం అధికారులు అనుమానిస్తున్నారు. లోతుగా దర్యాప్తు మొదలు పెట్టారు. మన దేశంలో గడిచిన వారం రోజుల వ్యవధిలో ఉగ్రవాద వ్యతిరేక పోలీసుల బృందం విస్తృతంగా దాడులు నిర్వహించింది. ఈ దాడులలో నలుగురు డాక్టర్లు అరెస్టు అయ్యారు. వీరి నుంచి పోలీసులు ఏకంగా 2,900 వందల కిలోల పేలుడు పదార్థాలను, రైఫిళ్లు, పిస్టల్స్, రిసిన్, అమోనియం నైట్రేట్ వంటి విష పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ పరిణామం జరిగిన గంటల వ్యవధిలోనే ఢిల్లీలో భారీ పేలుడు చోటు చేసుకుంది. వాస్తవానికి ఈ పేలుడు అనేక సంచలన విషయాలనూ బయటపెట్టింది. ఉగ్రవాద వ్యతిరేక బృందం నలుగు డాక్టర్లను అరెస్ట్ చేసిన తర్వాత ఉగ్ర కుట్ర బయటపడింది. ఫరీదాబాద్ లో ఆల్ ఫలాయ్ యూనివర్సిటీలో అధ్యాపకుడిగా పని చేస్తున్న డాక్టర్ ముజమిల్ షకీల్, జమ్మూ కాశ్మీర్ ప్రాంతానికి చెందిన డాక్టర్ ఆదిల్ అహ్మద్ రథర్, గుజరాత్ లోని డాక్టర్ అహమ్మద్ మోహియుద్దీన్ సయ్యద్, ఉత్తరప్రదేశ్ కుచెందిన మహిళా డాక్టర్ ను ఉగ్రవాద వ్యతిరేక పోలీసుల బృందం అరెస్ట్ చేసింది. జమ్ము కాశ్మీర్, ఫరీదాబాద్ ప్రాంతాలలో పోలీసులు సంయుక్తంగా ఆపరేషన్ నిర్వహించి నలుగురిని పట్టుకున్నారు. సమాజంలో వీరిని ఎవరు కూడా అనుమానించరనే ఉద్దేశంతోనే ఉగ్రవాద సంస్థలకు నిత్యం అందుబాటులో ఉండేవారు. దేశ వ్యాప్తంగా దాడులకు ప్రణాళిక రూపొందించారు. అరెస్ట్ అయిన వైద్యులు జైషే ఏ మహమ్మద్, అన్సార్ గజ్వతుల్ హింద్ అనే ఉగ్రవాద సంస్థల తో సంబంధం ఉన్నట్టు విచారణలో తేలింది. డాక్టర్ కాబట్టి ఎవరూ అనుమానించరనే ఉద్దేశంతోనే వీరు ఉగ్రవాద సంస్థలకు టచ్ లో ఉండేవారని తెలుస్తోంది. అరెస్టు అయిన వారిలో ఇద్దరు డాక్టర్లు 2018-2021 కాలంలో భారత భద్రతా దళాల దాడిలో గాయపడిన ఉగ్రవాదులకు చికిత్స అందించారని తెలుస్తోంది. ఇదే క్రమంలో ఇంటెలిజెన్స్ వర్గాలు ఈ మాడ్యూల్ మొత్తాన్ని జాగ్రత్తగా పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ఢిల్లీ ఎర్రకోట వద్ద జరిగిన పేలుడు కూడా ఉగ్రదాడి అని అనుమానాలు వ్యక్తమౌతున్న నేపథ్యంలో ఈ నలుగురు పట్టుబడ్డారు. దేశ రాజధానిలో పేలుడు జరిగిన నేపథ్యంలో ఈ ఘటన సంచలనంగా మారింది. సరిగ్గా ఆదివారం ఆముదంతో విషయం తయారు చేసే వందల మందిని చంపడానికి కుట్ర చేసిన హైదరాబాద్ ఉగ్రవాది సయ్యద్ అహ్మద్ మోహియుద్దీన్, మరో ఇద్దరు ఐసిస్ సానుభూతిపరులను గుజరాత్ ఏటీఎస్ పోలీసులు అరెస్ట్ చేశారు.

ప్రతిపక్షం
హైదరాబాద్
బుధవారం
12.11.2025

జడలు విప్పిన ఉగ్రవాద భయం

ఇలాంటి సంక్లిష్ట పరిస్థితి ఎదుర్కోవడానికి కేవలం పోలీసు బలగాలే చాలనుకోవడం పొరపాటు. భద్రతా వ్యవస్థ ఒక వైపు పని చేస్తుంటే, ప్రజాస్వామ్య దేశంలో ప్రతి పౌరుడూ నిధానంగా అప్రమత్తత చూపాలి. అనుమానాస్పదంగా కనిపించే కానిస్టర్లు, నిర్లక్ష్యంగా వదిలేసిన బ్యాగులు, అనుచితంగా ప్రవర్తించే వ్యక్తుల గురించి వెంటనే సమీప పోలీసు బలగాలకు, మెట్రో సిబ్బందికి సమాచారం ఇచ్చే అలవాటు పెరగాలి. సామాజిక మాధ్యమాలలో అసత్య వార్తలు, గాలివార్తలు వ్యాప్తి చెందకుండా సమాచారాన్ని సంపూర్ణంగా ధ్రువీకరించుకున్న తరువాత మాత్రమే పంపాలి. పుకార్లు ఒక నగరాన్ని మరింత భయాందోళనకూ గురి చేస్తాయి, విచారణలో ఉన్న సంస్థల పనికి ఆటంకం కలిగిస్తాయి. ప్రభుత్వం పక్షాన చూసుకుంటే దేశ భద్రతా వ్యవస్థకు వ్యూహాత్మక బలోపేతం అవసరం.

డా. రక్కిరెడ్డి ఆదిరెడ్డి
98495 77610

ఢిల్లీలోని ఎర్రకోట మెట్రో స్టేషన్ గేట్ నంబర్ -1 దగ్గర పార్క్ చేసిన కారు ఒక్కసారిగా పేలిపోవడం, వరుసగా మంటలు చెలరేగి పక్కనే నిలిపిన మూడు నాలుగు వాహనాలు దగ్ధమవడం దేశాన్ని దిగ్భ్రాంతికి గురి చేసింది. సాయంత్రం సమయములో జరిగిన ఈ ఘటనలో అక్కడున్న ప్రజలు భయభ్రాంతులతో పరుగులు తీయడం, పొగ మేఘాలు పైకి ఎగిసిపోవడం దేశవ్యాప్తంగా టెలివిజన్ ఛానెల్స్, సామాజిక మాధ్యమాలలో ప్రత్యక్ష చిత్రాలుగా ప్రసారమయ్యాయి. ప్రారంభ సమాచారం ప్రకారం కారులో ఏదో రకమైన పేలుడు సంభవించిందని, బలమైన శబ్దం తరువాత మంటలు చెలరేగి పక్కనున్న వాహనాలకు వ్యాపించాయని ఢిల్లీ అగ్నిమాపక శాఖ పేర్కొంది. ఘటన తరువాత చారిత్రక ప్రాధాన్యం కలిగిన ఎర్రకోట పరిసర ప్రాంతమంతా పోలీసు బలగాలతో నిండిపోయింది, ఢిల్లీ జూదా కీలక ప్రాంతాలలో హై అలర్ట్ ప్రకటించారు. ఈ కారు పేలుడుకు కారణం ఏమిటి? యాదృచ్ఛిక ప్రమాదమా? పన్నాగం పన్నిన ఉగ్ర చర్యా! అనే అంశంపై విచారణ ఇంకా కొనసాగుతోంది. ప్రాథమిక సమాచారం ప్రకారం ఈ ఘటనను ఉగ్రదాడిగా ఖరారు చేశారు. ఈ పేలుడు జరిగిన రోజే, దగ్గరలోని హర్యానాలోని ఫరీదాబాద్ ప్రాంతంలో భారీగా పేలుడు పదార్థాలు, ఆయుధాలు పట్టుబడడం బట్టి చూస్తే, దేశవ్యాప్తంగా ప్రమాద సంకేతాలు ఎంత తీవ్ర స్థాయికి చేరుకున్నాయో స్పష్టమవుతోంది. ఫరీదాబాద్ లో దాదాపు 300 కిలోలకుపైగా పేలుడు పదార్థాలు, అసాల్ట్ రైఫిల్ వంటి పరికరాలు స్వాధీనం చేసుకోవడం, ఇద్దరు వైద్యులు సహా పలువురిని అరెస్ట్ చేయడం జరిగింది.

అఫ్గానిస్తాన్ హ్యాండ్లర్‌కు అనుబంధంగా

ఈ పరిణామాల వెంటనే గుజరాత్ రాష్ట్రం ఏటీఎస్ ఇటీవల అరెస్ట్ చేసిన కొంతమంది వ్యక్తుల కేసు కూడా వెలుగులోకి వచ్చింది. ఆ కేసులో అఫ్గానిస్తాన్‌లో ఉన్న హ్యాండ్లర్‌కు అనుబంధంగా నిర్వహించినట్లు చెప్పబడుతున్న డాక్టర్‌తో పాటు యూపీకి చెందిన యువకులు పాకిస్తాన్ సరిహద్దు వద్ద డ్రోన్ల ద్వారా ఆయుధాలు, విషతుల్య రసాయనాలను స్వీకరించినట్టు విచారణ సంస్థలు వెల్లడించాయి. ఈ కేసు వివరాలు బయటకు వచ్చిన వెంటనే రిసిన్ వంటి అత్యంత ప్రమాదకర విషపదార్థాలు కూడా ఈ కుట్రలో భాగమని బయటపడటం దేశ భద్రతా వ్యవస్థలకి పెద్ద హెచ్చరిక అయ్యింది. ఇప్పటికే లష్కరే తోయిబా, జైషేమహ్మద్ వంటి అతి తీవ్రవాద సంస్థలు కాశ్మీర్ లోయలో సమన్వయ దాడుల కదలికలు ప్రారంభించాయని నిఘావర్గాలు హెచ్చరిక నివేదికలు పంపాయి. పాకిస్తాన్‌కు చెందిన హఫీజ్ సయీద్ భారతదేశంపై కొత్త కుట్రలుపన్నుతున్నాడని, బంగ్లాదేశ్ వంటి పొరుగు దేశాలను కొత్త లాంచ్ ప్యాడ్‌లుగా మలిచే యత్నం చేస్తున్నాడని కూడా తాజా ఇంటెలిజెన్స్ సమాచారం వెల్లడిస్తోంది. ఇటీవల దేశవ్యాప్తంగా విమానాశ్రయాల వద్ద కూడా నిర్దిష్ట కాలానికి హై అలర్ట్ అమలులో ఉండేలా కేంద్ర సంస్థలు సూచనలు ఇచ్చాయి. ఈ సంఘటనల సమాహారం చూస్తే ఎర్రకోట మెట్రో స్టేషన్ దగ్గర జరిగిన పేలుడు ఏ కోణంలో జరిగినా, దేశ భద్రతకు ఇది ఒక హెచ్చరిక గడియారంలా మోగిందని చెప్పాలి.

సామాన్య ప్రజల జీవిత కేంద్రాలు

ఢిల్లీ వంటి రాజధాని నగరాలు సామాన్య ప్రజల జీవిత కేంద్రాలు మాత్రమే కాదు, రాజకీయ, ఆర్థిక, వ్యాపార నిర్ణయాల ఆవాసాలు. అందుకే గత రెండు దశాబ్దాలలో ఢిల్లీని లక్ష్యంగా చేసుకుని ఉగ్రవాదులు పలుమార్లు దాడులకు పాల్పడ్డారు. 2005 అక్టోబర్ 29న దీపావళికి కాస్త ముందుగా సరోజినీ నగర్, పహార్గంజ్, గోవింద్‌పురి ప్రాంతాలలో వరుస బాంబు పేలుళ్లు జరగడం, దాదాపు 60 మందికిపైగా ప్రాణాలు కోల్పోవడం దేశాన్ని కుదిపేసిన సంఘటన. ఆ తరువాత 2008 సెప్టెంబర్ 13న ఢిల్లీ కానాట్, కరోల్ బాగ్ తదితర ప్రాంతాలలో ఐదుచోట్ల వరుస పేలుళ్లు జరిగి 20కుపైగా మంది దాకా ప్రాణాలు కోల్పోయారు. 2011లో ఢిల్లీ హైకోర్టు గేటు వద్ద జరిగిన బాంబు పేలుడు కూడా రాజధాని భద్రతలోని లోపాలను బహిర్గతం చేసింది. ఈ నగరంలోనే భారత పార్లమెంట్‌పై 2001 డిసెంబర్ 13న జరిగిన దాడి భారత ప్రజాస్వామ్యం గుండెలలో గాయంలా గుర్తుండిపోయే సంఘటన. ప్రజాస్వామ్య వ్యవస్థలపై ద్వేషంతో నిండిన ఉగ్రవాద మానసికత ఎంత ప్రమాదకర రూపం తీసుకుంటుందో ఈ దాడి ప్రపంచానికి చూపించింది. సమస్త దాడులలో ప్రధాన లక్ష్యం ఏమిటంటే ప్రజలలో భయం నింపడం, ప్రభుత్వంపై విశ్వాసం దెబ్బతీయడం, సామాజిక ఐక్యతను పాడు చేయడం.

పెద్ద ఎత్తున పేలుడు పదార్థాల స్వాధీనం

ఇలాంటి నేపథ్యం ఉన్న దేశంలో తాజా ఎర్రకోట మెట్రో సంఘటన, ఫరీదాబాద్ వంటి ప్రాంతాలలో పెద్ద ఎత్తున పేలుడు పదార్థాల స్వాధీనం, ఉగ్రవాద సంస్థల కదలికలపై వస్తున్న నిఘా నివేదికలు కలిపి చూస్తే, దేశంలో ఉగ్రవాద చర్యలు మళ్లీ ఉధృతమయ్యే ప్రమాదాన్ని తేలికగా తిప్పికొట్టలేము. ఒకవైపు అంతర్జాతీయ సరిహద్దులపై డ్రోన్‌ద్వారా ఆయుధాల స్మగ్లింగ్, మరొకవైపు ఇంటర్నెట్ ద్వారా మౌలికవాద ప్రచారం, ఎన్క్రిప్టెడ్ యాప్‌లలో రహస్య సందేశాల మార్పిడి వంటి సాంకేతిక పద్ధతులు ఉగ్రవాదులకి కొత్త సాధనాలుగా మారుతున్నాయి. పేలుడు పదార్థాల రూపం కూడా గతంతో పోలిస్తే మారుతోంది. అమోనియం నైట్రేట్, ఇంప్రొవైజ్డ్ ఎక్స్‌ప్లోసివ్ డివైసులు మాత్రమే కాక విషతుల్య రసాయనాలనూ పరిగణలోకి తీసుకుంటున్నట్లు తాజా కేసులు సూచిస్తున్నాయి. ఈ పరిస్థితిలో అమాయక పౌరుల ప్రాణాలు అత్యంత అస్థిర స్థితిలో ఉంటాయి. ఉగ్రవాదులు ఎంచుకునే లక్ష్యాలు ఎక్కువగా మార్కెట్లు, బస్ స్టాండ్లు, మెట్రో స్టేషన్లు, దేవాలయాలు, ప్రభుత్వ కార్యాలయాలు వంటి జనసంద్రత గల ప్రదేశాలు కాబట్టి సామాన్య వ్యక్తి ప్రతీ రోజూ ప్రయాణించే మార్గమే ప్రమాద గమనంగా మారిపోతుంది. 2005, 2008 ఢిల్లీ పేలుళ్లు దీపావళి షాపింగ్‌కు వచ్చిన సాధారణ కుటుంబాలపై పడి ఎంత విషాదం సృష్టించాయో అప్పటి వార్తాచిత్రాలు గుర్తు చేస్తున్నాయి. నేటి ఎర్రకోట మెట్రో సమీప ఘటనలో కూడా అదే ఆశంక కనిపిస్తోంది - స్వల్ప సమయంలో తప్పించుకోలేని స్థితిలో ఉన్న ప్రయాణికులపై తక్షణ ప్రభావం పడుతుంది, ఆ ఘటనను ప్రత్యక్షంగా చూసిన వారికి దీర్ఘకాలిక మానసిక ఆందోళన మిగులుతుంది.

కేవలం పోలీసు బలగాలే చాలనుకోవడం

ఇలాంటి సంక్లిష్ట పరిస్థితి ఎదుర్కోవడానికి కేవలం పోలీసు బలగాలే చాలనుకోవడం పొరపాటు. భద్రతా వ్యవస్థ ఒక వైపు పని చేస్తుంటే, ప్రజాస్వామ్య దేశంలో ప్రతి పౌరుడూ నిధానంగా అప్రమత్తత చూపాలి. అనుమానాస్పదంగా కనిపించే కానిస్టర్లు, నిర్లక్ష్యంగా వదిలేసిన బ్యాగులు, అనుచితంగా ప్రవర్తించే వ్యక్తుల గురించి వెంటనే సమీప పోలీసు బలగాలకు, మెట్రో సిబ్బందికి సమాచారం ఇచ్చే అలవాటు పెరగాలి. సామాజిక మాధ్యమాలలో అసత్య వార్తలు, గాలి వార్తలు వ్యాప్తి చెందకుండా సమాచారాన్ని సంపూర్ణంగా ధ్రువీకరించుకున్న తరువాత మాత్రమే పంపాలి. పుకార్లు ఒక నగరాన్ని మరింత భయాందోళనకూ గురి చేస్తాయి, విచారణలో ఉన్న సంస్థల పనికి ఆటంకం కలిగిస్తాయి. ప్రభుత్వం పక్షాన చూసుకుంటే దేశ భద్రతా వ్యవస్థకు వ్యూహాత్మక బలోపేతం అవసరం. రాష్ట్ర పోలీసు శాఖల ఆధునికీకరణ, అధునాతన కమ్యూనికేషన్ సాధనాలు, డ్రోన్ మానిటరింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత సీసీటీవీ విశ్లేషణ వంటి పద్ధతులు విస్తృతంగా వినియోగంలోకి రావాలి. కేంద్ర నిఘా సంస్థలు, రాష్ట్ర నిఘా విభాగాలు, మెట్రో రైలు సంస్థ, రైల్వే రక్షణ దళాలు పరస్పర సమాచారం సమయానికి పంచుకునే వ్యవస్థ మరింత పటిష్ఠం కావాలి. అంతర్జాతీయ స్థాయిలో ఉగ్రవాదానికి ఆర్థిక మద్దతు అందించే నెట్‌వర్క్‌లను గుర్తించి తగిన ఆంక్షలు విధించే దిశలో కూడా భారతదేశం ఇప్పటికే తీసుకుంటున్న చర్యలు మరింత వేగవంతం కావాలి.

(వ్యాస రచయిత పౌర సంబంధాల అధికారి, కేయూ, వరంగల్)

రాయి సెంటర్లే న్యాయస్థానాలు

1944 నుంచి ఆదివాసి గిరిజన సంప్రదాయంలో ఉన్న ఈ రాయి సెంటర్లను వెలుగులోకి తెచ్చి, వ్యవస్థను బలోపేతం చేయడంలో తొలి గిరిజన ఐఏఎస్ అధికారి తుకారం కృషి మరువలేనిది. ఆయన రాయి సెంటర్లకు చట్టబద్ధత కల్పించారు. గిరిజన వ్యవహారాలలో కీలకమైన పొడవాజాన్ (16 రకాల వాయిద్యాలు), అట్రడెమ్ సింగ్ (18 రకాల నృత్యాలు)లను పటిష్టం చేశారు. ధాన్య కరాగారాలు (గ్రెయిన్ బ్యాంకులు) ఏర్పాటు చేయించి, గిరిజనులు నిల్వ చేసిన ధాన్యానికి సమాన మొత్తాన్ని ఐటీడీఏ ద్వారా సబ్సిడీపై అందజేసి, పొదుపు సంఘాలను ప్రోత్సహించారు. ఈ కారణంగానే ఈ వ్యవస్థ నేటికీ ఆధునిక సమాజంలో గిరిజనుల సాంస్కృతిక, సామాజిక విలువలను పరిరక్షిస్తోంది.

వెంకగారి భూమయ్య
9848559863

ఆదివాసీ గిరిజన తెగల సామాజిక, సాంస్కృతిక జీవితంలో రాయి సెంటర్లు అత్యున్నత న్యాయ వేదికలుగా, నేటికీ సుప్రీంకోర్టుతో సమాన విలువను కలిగి ఉన్నాయి. దేశానికి స్వాతంత్ర్యం రాక పూర్వమే ఆవిర్భవించిన ఈ సంస్థలు, నిరక్షరాస్యత, అమాయకత్వం రాజ్యమేలుతున్న వెనుకబడిన గిరిజన ప్రాంతాలలో, తరతరాలుగా ఉచిత న్యాయం, తక్షణ పరిష్కారాలను అందిస్తున్నాయి. నవీన న్యాయానికి ఏమాత్రం తీసిపోని విధంగా, ఇవి తమ సంప్రదాయ ధార్మికతతో గిరిజనుల మధ్య తలెత్తే తగాదాలు, వివాదాలకు పరిష్కార మార్గాలు చూపుతున్నాయి. రాయి సెంటర్ పెద్దలు చెప్పే తీర్పులకు చట్టబద్ధత ఉంది. దీనికి ప్రభుత్వం 1981లోనే అధికారిక గుర్తింపు ఇచ్చింది. గిరిజన తెగల కేసులు కోర్టులు, పోలీస్ స్టేషన్ల వరకు వెళ్లనివ్వకుండా, ఇక్కడ చెప్పే తీర్పులనే వారు అంతిమంగా భావిస్తారు.

వ్యవస్థాపక నిర్మాణం—నైతిక నాయకత్వం

ఒక రాయి సెంటర్ దాదాపు 20 నుంచి 40 గిరిజన గ్రామాల పరిధిలో ఉంటుంది. ఈ వ్యవస్థలో ఆయా గ్రామాలలోని పెద్దలైన పటేల్, మహాజన్, దేవారి, గట్యాల్ వంటివారు కలిసి 11 మందితో కార్యవర్గాన్ని ఏర్పాటు చేస్తారు. ఇందులో అధ్యక్షుడిని సార్ మేడి, ఉపాధ్యక్షుడిని ఉప మేడి, కార్యదర్శిని గీతాదర్, కోశాధికారిని ఖజాన్ దార్ అని పిలుస్తారు. జిల్లావ్యాప్తంగా సుమారు 140 రాయి సెంటర్లు పనిచేస్తుండగా, ఇవన్నీ రాజ్ గోండు సేవా సమితి అంతర్భాగంగా ఉన్నాయి. ఈ సెంటర్లలో గోండు, తోటి, కోలామి, నాయక పోడు, పర్ధాన్ ,అంద్ వంటి ఆరు ఆదివాసి గిరిజన తెగలు ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. సార్ మేడిగా ఎంపిక కావడానికి ఉన్నత విద్య కానీ, డబ్బు దర్పం కానీ అవసరం లేదు. కేవలం సత్ప్రవర్తన, సేవాభావం, సద్గుణాలు, మత్తుపానీయాలు సేవించకుండా ఉండడం వంటి నైతిక విలువలే ప్రధాన అర్హతలు. కఠిన ప్రమాణాల కారణంగానే ఈ వ్యవస్థపై గిరిజనులకు అచంచల నమ్మకం ఉంది.

న్యాయ విధి విధానాలు, సామాజిక సేవలు

సమస్యలు పరిష్కారం కొలిక్కి రానప్పుడు, జిల్లా స్థాయిలో సర్వసభ్య సమావేశాలు ఏర్పాటు చేస్తారు, దీనిని వారు సుప్రీంకోర్టుగా పిలుచుకుంటారు. ఈ సమావేశాలకు జిల్లా పోలీస్ అధికారులు కూడా హాజరవుతారు. రాయి సెంటర్లు న్యాయ నిర్ణయాలకే పరిమితం కాకుండా, అనేక సామాజిక కార్యక్రమాలు చేపడుతూ, గిరిజనుల వ్యవహారాలలో సంస్కరణలకు బాటలు వేస్తున్నాయి. సామూహిక వివాహాలను ప్రోత్సహించడం ద్వారా ఆర్థిక వ్యయాన్ని తగ్గించడం, 1980-90 దశకంలో దేవదాన్ గోదాం (గ్రెయిన్ బ్యాంక్) లను ఏర్పాటు చేసి, కరువు వచ్చినప్పుడు గిరిజనులకు ధాన్యాన్ని పంపిణీ చేయడం వంటి సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారు. యేటా డిసెంబర్ 31న ఉట్నూరులోని గుసాడిగుట్టలో వీరు వార్షిక సమావేశాన్ని నిర్వహించుకుంటారు.

వ్యవస్థ బలోపేతంలో ఐఏఎస్ తుకారం కృషి

1944 నుంచి ఆదివాసి గిరిజన సంప్రదాయంలో ఉన్న ఈ రాయి సెంటర్లను వెలుగులోకి తెచ్చి, వ్యవస్థను బలోపేతం చేయడంలో తొలి గిరిజన ఐఏఎస్ అధికారి తుకారం కృషి మరువలేనిది. ఆయన రాయి సెంటర్లకు చట్టబద్ధత కల్పించారు. గిరిజన వ్యవహారాలలో కీలకమైన పొడవాజాన్ (16 రకాల వాయిద్యాలు), అట్రడెమ్ సింగ్ (18 రకాల నృత్యాలు)లను పటిష్టం చేశారు. ధాన్య కరాగారాలు (గ్రెయిన్ బ్యాంకులు) ఏర్పాటు చేయించి, గిరిజనులు నిల్వ చేసిన ధాన్యానికి సమాన మొత్తాన్ని ఐటీడీఏ ద్వారా సబ్సిడీపై అందజేసి, పొదుపు సంఘాలను ప్రోత్సహించారు. ఈ కారణంగానే ఈ వ్యవస్థ నేటికీ ఆధునిక సమాజంలో గిరిజనుల సాంస్కృతిక, సామాజిక విలువలను పరిరక్షిస్తోంది.

(వ్యాస రచయిత సీనియర్ జర్నలిస్ట్)

న్యుమోనియా రహిత భారతం

డా. బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

న్యుమోనియా అంటువ్యాధితో 2021లో 2.2 మిలియన్ మంది మరణించగా, అందులో 5.02 లక్షల మంది పిల్లలు ఉన్నారు. ఐదేండ్ల లోపున్న పిల్లల అధిక మరణాలకు కారణమైన వ్యాధి న్యూమోనియా. కొవిడ్ 19 కారణంతో మరో 10 మిలియన్ కూడా అదనంగా మరణించినట్లు గణాంకాలు తెలియజేస్తున్నాయి. అధిక ప్రాణాలు గైకొంటున్న వ్యాధులలో న్యూమోనియా ప్రధానమైనదని తేలింది. వాతావరణ ప్రతికూల మార్పులు, గాలి కాలుష్యం కోరలు చాచడంతో శ్వాస వ్యవస్థ, ఊపిరితిత్తుల సమస్యలు ఉత్పన్నం కావడం, న్యూమోనియా మహా విపత్తు వస్తుందనే భయం కూడా ఉందని, జనులు ప్రమాదపు అంచున ఉన్నారని వైద్యులు అంచనా వేస్తున్నారు. న్యూమోనియా వ్యాధి ఐదేండ్ల లోపు పిల్లలకు, వృద్ధులకు వస్తుంది. టీకాలు వేయించుకోనివారు, పోషకాహారలోపాలు, ఇంటిలో వంట చెరుకు వాడేవారు, కలుషిత గాలి పీల్చేవారు, పొగ త్రాగే దురలవాటు ఉన్న వారు అధికంగా న్యూమోనియా బారిన పడే ప్రమాదం ఉంటుంది.

ప్రపంచ న్యూమోనియా దినం—2025 ఇతివృత్తం

న్యూమోనియా వ్యాధి తీవ్రత, ప్రమాదాన్ని గుర్తించిన అంతర్జాతీయ సమాజం 2009 నుంచి యేటా 12 నవంబర్ న 'ప్రపంచ న్యూమోనియా దినం' పాటిస్తూ ఆ వ్యాప్తి పట్ల కనీస అవగాహన కల్పిస్తారు. బ్యాక్టీరియా, వైరస్ లేదా ఫంగీ సంక్రమణ కారణంగా తాపజనక శ్వాస రుగ్మత (ఇన్ఫ్లమేటరీ రెస్పిరేటరీ డిసార్డర్) లేదా న్యూమోనియా వ్యాధి అంటుకుంటుంది. ఈ సూక్ష్మజీవులు ఊపిరితిత్తులలో చేరి 'ఎల్వియోలి' అనే భాగంపై ప్రభావాన్ని చూపి న్యూమోనియాకు దారి తీస్తుంది. దీని వల్ల ఊపిరితిత్తులలో నీరు చేరి శ్వాస తీసుకోవడం ఇబ్బంది అవుతుంది. బలహీన వ్యాధి నిరోధకశక్తి కలిగిన పిల్లలు, వృద్ధులకు న్యూమోనియా సోకి ప్రాణాంతకంగానూ మారవచ్చు. ప్రపంచ న్యూమోనియా దినం 2025 ఇతివృత్తంగా 'పిల్లల మనుగడ (చైల్డ్ సర్వైవల్)' అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహిస్తున్నారు.

న్యూమోనియాలో రకాలు

న్యూమోనియా నివారించదగిన అంటు వ్యాధి. తుమ్మడం, దగ్గడం, ముక్కు చీదడం లాంటి సందర్భాలలో మరొకరికి సంక్రమిస్తుంది. పిల్లలలో బ్యాక్టీరియా కారణ స్ట్రెప్టోకోకల్ న్యూమోనియా అతి ప్రధానమైనది. దాని తర్వాత హిమోఫిలస్ ఇన్ఫ్లుయెంజా రెండవ ప్రధానమైనది. న్యూమోనియాలో రెస్పిరేటరీ సిన్సిటియల్ వైరస్ వ్యాధి వైరస్ వర్గంలో ముఖ్యమైనది. ఈ వ్యాధికి చికిత్స కూడా అందుబాటులో ఉన్నది. ప్రపంచ న్యూమోనియా దినం వేదికగా ప్రభుత్వాలు, వైద్య ఆరోగ్య శాఖ, ఎన్జీఓలు, ఇతర సంస్థలు కలిసి అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, తీసుకోవలసిన జాగ్రత్తలు, చికిత్సా పద్ధతులు వివరించడం వంటివి మంచి ఫలితాలను ఇస్తాయి. న్యూమోనియాను తొలిదశలో గుర్తించడం, చికిత్స తీసుకోవడం, నివారణ మార్గాలను తెలుసుకోవడం లాంటి అంశాలను గుర్తుంచుకోవాలి.

న్యూమోనియా సోకడానికి కారణాలు

ప్రపంచ ఆరోగ్య సంస్థ వివరాల ప్రకారం యేటా 14 లక్షల పిల్లలు న్యూమోనియా సోకి చనిపోవడం, పిల్లల మరణాలలో 18 శాతం వరకు న్యూమోనియా కారణం కావడం గమనార్హం. యూనిసెఫ్ ప్రకారం ప్రతి 39 సెకన్లకు ఒక పిల్లవాడు న్యూమోనియాతో మరణిస్తున్నాడు. వృద్ధులలో న్యూమోకోకల్ న్యూమోనియా అధికంగా సోకుతుంది. కాగా, న్యూమోసిస్టిక్ జిరోవెస్సీ వ్యాధి ఫంగస్ సోకడంతో వస్తుంది. గాలి కాలుష్యం, స్మోకింగ్ వల్ల 16 లక్షల వృద్ధులు మరణిస్తున్నారు. డబ్ల్యూహెచ్ఓ, యూనిసెఫ్ సంయుక్తంగా న్యూమోనియా, డయేరియా వ్యాధుల కట్టడికి గ్లోబల్ యాక్షన్ ప్లాన్ అమలు చేస్తున్నారు. ఐదేండ్ల లోపు పిల్లలు, 65 యేండ్లు దాటిన వృద్ధులు, దీర్ఘకాలిక రోగులు, పర్యావరణ కాలుష్య ప్రాంతాలలో నివసిస్తున్న జనులు, హెచ్ఐవి, క్యాన్సర్ లాంటివి సోకినవారు న్యూమోనియా ప్రమాదంలో పడే అవకాశాలే ఎక్కువ.

నివారణ మార్గాలు

టీకాలు వేయించడం, పోషకాహారం అందిచడం, గాలి కాలుష్యాన్ని తగ్గించడం వల్ల వ్యాధి తీవ్రత తగ్గుతుంది. యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ వైరల్, యాంటీ ఫంగల్ ఔషధాలతో న్యూమోనియా కట్టడి జరుగుతుంది. భౌతిక దూరాలు పాటించడం, మాస్కులు ధరించడం, పబ్లిక్ ప్రదేశాలు ఉమ్మి వేయకుండా ఉండడం, దగ్గినపుడు లేదా తుమ్మినపుడు కండువా కప్పుకోవడం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం, గాలి కాలుష్యాన్ని కట్టడి చేయడం, నదులను కలుషితం కాకుండా చూసుకోవడం లాంటి పలు జాగ్రత్తలు కేసులను తగ్గిస్తాయి.

(నేడు ప్రపంచ న్యూమోనియా నివారణ దినం)

(వ్యాస రచయిత సామాజిక విశ్లేషకులు)

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula
@gmail.com

జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో తీవ్ర ఉద్రిక్తత

ప్రతిపక్షం, సిటి బ్యూరో, నవంబర్ 11: జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉపఎన్నిక పోలింగ్ రోజు ఉద్రిక్తతలు చెలరేగాయి. కాంగ్రెస్ నాయకులు ఎన్నికల నియమాలను ఉల్లంఘిస్తూ ఓటర్లపై ప్రభావం చూపడానికి ప్రయత్నిస్తున్నారని బీఆర్ఎస్ ఆరోపించింది. బోరబండ పోలింగ్ బూత్ వద్ద బీఆర్ఎస్ కార్యకర్తపై కాంగ్రెస్ నేత బాబా ఫసియుద్దీన్ దాడి చేశారని ఆరోపణలు వచ్చాయి. ఈ ఘటనపై మాగంటి సునీత గోపీనాథ్ తీవ్రంగా స్పందించారు. టేబుల్ పెట్టుకోకుండా కార్యకర్తలపై దౌర్జన్యం చేయడం, పోలీసుల మౌనం పట్ల ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు అధికార పార్టీకి తొత్తులుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ కార్యకర్తలు భయపడకుండా ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు. వెంగళరావు నగర్ డివిజన్‌లో బూత్ నం.205లో ఓటర్లకు డబ్బులు పంచుతుండగా లోకల్ కాంగ్రెస్ నాయకుడు పట్టుబడ్డాడు. బీఆర్ఎస్ కార్యకర్తలు అతడిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని అధికారులకు అప్పగించారు. రహమత్ నగర్‌లో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎమ్మెల్సీ శంకర్ నాయక్‌లు బూత్‌ల వద్ద తిరుగుతున్నారని, అధికారులు వాటిపై స్పందించకపోవడం పట్ల బీఆర్ఎస్ ఆగ్రహం వ్యక్తం చేసింది. జూబ్లీహిల్స్‌లో నాన్‌లోకల్స్‌ను మోహరించి, కాంగ్రెస్ పార్టీ టీషర్ట్‌లతో ప్రచారం చేస్తూ ఓటర్లపై ప్రభావం చూపే ప్రయత్నం జరుగుతోందని బీఆర్ఎస్ ఆరోపించింది. ఈ అంశంపై రిటర్నింగ్ అధికారికి ఇప్పటికే పలు ఫిర్యాదులు సమర్పించినట్లు తెలిపింది. బోరబండలో బీఆర్ఎస్ నేతలపై కాంగ్రెస్ నేత బాబా ఫసియుద్దీన్ దాడి చేయడం ఆందోళన కలిగించేదని పేర్కొంది. ఇప్పటి వరకు 60 ఫిర్యాదులు చేసినప్పటికీ అధికారులు చర్యలు తీసుకోకపోవడం ఎన్నికల కమిషన్ పక్షపాత ధోరణికి నిదర్శనమని బీఆర్ఎస్ వ్యాఖ్యానించింది. వెంగళరావు నగర్ బూత్ నం.203 వద్ద కాంగ్రెస్ కార్యకర్తలు డబ్బు పంచిపెడుతున్నారని, పోలీసులు కళ్లు మూసుకుని చూస్తున్నారని బీఆర్ఎస్ ఫిర్యాదు చేసింది. ఈ ఘటనపై ఎన్నికల కమిషన్, రిటర్నింగ్ అధికారులు తక్షణ విచారణ చేపట్టాలని డిమాండ్ చేసింది. పోలీసు అధికారుల నిర్లక్ష్యం కారణంగా కాంగ్రెస్ కార్యకర్తలు మరింత ధైర్యంగా అవినీతి చర్యలు కొనసాగిస్తున్నారని పేర్కొంది. డాన్ బాస్కో స్కూల్ పోలింగ్ బూత్ వద్ద శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, అలాగే ఎర్రగడ్డ, శంకర్లాల్ నగర్ ప్రాంతాల్లో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తన కాన్వాయ్‌తో తిరుగుతున్నట్లు బీఆర్ఎస్ ఆరోపించింది. ఉప ముఖ్యమంత్రి భట్టిస్ విక్రమార్క జూబ్లీహిల్స్ ప్రాంతంలో పర్యటించి ఎన్నికల నియమావళిని ఉల్లంఘించారని, ఆయనతోపాటు ఇతర కాంగ్రెస్ నేతలు డబ్బులు పంచి ఓటర్లను ప్రభావితం చేయడానికి ప్రయత్నిస్తున్నారని బీఆర్ఎస్ ప్రెస్ నోట్‌లో పేర్కొంది. ఈ చర్యలు ప్రజాస్వామ్య విలువలను దెబ్బతీస్తున్నాయని తీవ్రంగా ఖండించింది. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేష్ రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ నేతలు ఓటర్లను ప్రలోభపెట్టడమే కాకుండా రౌడీ ప్రవర్తనకు దిగారని, ప్రజల తీర్పుతో సంబంధం లేని చర్యలు చేస్తున్నారని విమర్శించారు. "ఒక్క ఆడబిడ్డను ఓడించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం మొత్తం వీధుల్లోకి దిగింది," అని ఆయన అన్నారు. జూబ్లీహిల్స్ షైక్‌పేట్ డివిజన్‌లోని డైమండ్ హిల్స్ ప్రాంతంలోని అల్‌ఫలాహ్ స్కూల్ బూత్‌ల వద్ద తీవ్రమైన అవకతవకలు చోటు చేసుకున్నాయని ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ పేర్కొన్నారు. పోలీసుల మౌన సహకారంతో కాంగ్రెస్ కార్యకర్తలు బూత్ ఏజెంట్లను బెదిరిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ లీగల్ సెల్ కేంద్ర ఎన్నికల కమిషన్, రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి, రిటర్నింగ్ అధికారులకు ఐదు ఫిర్యాదులు సమర్పించింది. సీఈఓ స్పందించి, స్థానిక అధికారులకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించగా, ఇప్పటికే నాలుగు ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయని బీఆర్ఎస్ తెలిపింది. ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్, డోర్నకల్ ఎమ్మెల్యే రామచంద్ర నాయక్‌లపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు ధృవీకరించారు. కృష్ణా నగర్ బూత్ వద్ద కాంగ్రెస్ నేతలు ఫేక్ ఐడీలతో దొంగ ఓట్లు వేస్తున్నారని ఆరోపిస్తూ మాగంటి సునీత ధర్నా చేశారు. ఈ ఘటనలో బీఆర్ఎస్ కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేశారు. మాగంటి సునీత కుటుంబ సభ్యులు రోడ్డుపై బైటాయించారు. షైక్‌పేట్ డివిజన్ సమత కాలనీ అపెక్స్ స్కూల్ బూత్ వద్ద అధికార పక్షానికి మద్దతుగా పోలీసులు వ్యవహరిస్తున్నారని బీఆర్ఎస్ ఆరోపించింది. జూబ్లీహిల్స్‌లో పోలింగ్ పూర్తయ్యే వరకు ఎగ్జిట్ పోల్స్‌పై నిషేధం విధించాలని బీఆర్ఎస్ నేతలు సీఈవోను కలిశారు. కొన్ని బూత్‌లలో రాత్రి 89 గంటల వరకు పోలింగ్ కొనసాగవచ్చని, ఆ సమయంలో ఎగ్జిట్ పోల్స్ ప్రసారం చేస్తే ఓటర్లపై ప్రభావం చూపే అవకాశం ఉందని వారు పేర్కొన్నారు. అదే సమయంలో మహ్మద్ ఫంక్షన్ హాల్ వద్ద బీఆర్ఎస్ నాయకులపై పోలీసుల దాడి జరిగి, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి గాయపడ్డారు. ఈ ఘటనపై బీఆర్ఎస్ తీవ్రంగా నిరసన వ్యక్తం చేసింది.

పోలీసుల దౌర్జన్యం... కాంగ్రెస్ నాయకుల అరాచకం

- కాంగ్రెస్ దొంగ ఓట్లను అడ్డుకున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి

ప్రతిపక్షం, సిటీబ్యూరో, నవంబర్ 11 : జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని యూసఫ్ గూడా డివిజన్ లో దొంగ ఓట్లను వేయడానికి చూస్తున్న కాంగ్రెస్ నాయకులను గుర్తించి నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి అడ్డుకున్నారు. అభ్యర్థిని మాగంటి సునీత గోపినాధ్ ని పోలింగ్ స్టేషన్ లోకి ఒక మహిళ అని చూడకుండా పోలీసులు అడ్డుకొనే ప్రయత్నం చేయగా పోలీసులు దౌర్జన్యంగా కాంగ్రెస్ గుండాల వైపు పోలీసులు మద్దతుగా ఇస్తున్నారని పోలీసులపై పెద్ది మండిపడ్డారు.పోలీసుల తోపులాట లో పెద్ది సుదర్శన్ రెడ్డి కి గాయాలయ్యాయి.

ఓటు హక్కు వినియోగించుకున్న నవీన్ యాదవ్

ప్రతిపక్షం, సిటి బ్యూరో, నవంబర్ 11 : జూబ్లీహిల్స్ నియోజకవర్గం లో ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న ఉప ఎన్నికలను స్వయంగా బైక్ పైన వెళ్లి పలు పోలింగ్ కేంద్రాలలో పర్యవేక్షించిన కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి నవీన్ యాదవ్. అనంతరం జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో భాగంగా కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి నవీన్ యాదవ్ వారి కుటుంబ సభ్యులతో కలిసి వెంకటగిరి నాసర్ ఉన్నత పాఠశాలలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి ఓటు విలువైనదని, ప్రజలు అధిక సంఖ్యలో బయటకు వచ్చి ఓటు వేసి తమ ప్రజాస్వామ్య హక్కును వినియోగించాలని ఆయన అన్నారు. నవీన్ యాదవ్ ఎన్నికల ప్రక్రియలో శాంతి, సుస్థిరత నెలకొనాలని ఆకాంక్షిస్తూ, జూబ్లీహిల్స్ అభివృద్ధి కోసం ప్రజలు అందరు ఓటు వేయాలని అన్నారు.

ఎల్లారెడ్డి గూడ శ్రీనగర్ కాలనీ 290 బూతులో కుటుంబ సమేతంగా వచ్చి ఓటు హక్కును వినియోగించుకున్న జూబ్లీహిల్స్ బిఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునిత -ప్రతిపక్షం, సిటి బ్యూరో

జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ దే విజయం

- టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 11 : జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికల పోలింగ్ సరళిని పరిశీలిస్తే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ ఘన విజయం సాధించబోతున్నారని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ, అభివృద్ధి పథకాలకు ఓటర్లు ఆకర్శితులై కాంగ్రెస్ కు ఓటు వేశారన్నారు. పార్టీ అభ్యర్థికి ఓటు వేసిన ఓటర్లందరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఉప ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకొన్న సీఎం రేవంత్ రెడ్డితో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ నేతలు, కార్యకర్తలందరికి ఆయన పేరుపేరునా ధన్యవాదాలు చెప్పారు. నెల రోజులుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పోరేషన్ చైర్మన్ లు, నాయకులు ఎంతో కష్టపడి కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం పని చేశారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సలహాలు, సూచనలు, అందరి కష్టంతో ఇక్కడ గెలవబోతున్నామన్నారు. గెలుపు కోసం పనిచేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.

పార్టీ శ్రేణులకు, జూబ్లీహిల్స్ ఓటర్లకి ధన్యవాదాలు

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 11: గత నెలరోజులుగా జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత గోపీనాథ్ గెలుపు కోసం శక్తివంచన లేకుండా పనిచేసిన పార్టీ నేతలు, కార్యకర్తలకు పేరుపేరున బి ఆర్ ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కృతజ్ఞతలు తెలిపారు. అధికార పార్టీ ఎన్ని దౌర్జన్యాలకు పాల్పడినా, భయభ్రాంతులకు గురిచేసినా బయటకు వచ్చి ఓటు వేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు అని పేర్కొన్నారు.

కృష్ణానగర్, శ్రీనగర్‌లో రిగ్గింగ్

- బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత నిరసన

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 11 : జూబ్లీహిల్స్ నియోజకవర్గం పరిధి కృష్ణానగర్‌లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కృష్ణానగర్, శ్రీనగర్ పరిధిలోని పలు పోలింగ్ కేంద్రాలలో ఇతర ప్రాంతాల నుంచి మహిళలను తీసుకొచ్చి కాంగ్రెస్ నేతలు దొంగ ఓట్లు వేయిస్తున్నారంటూ బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత నిరసనకు దిగారు. కాంగ్రెస్ నేతలు నిబంధనలు ఉల్లంఘించి దొంగ ఓట్లు వేయిస్తున్నారని మండిపడ్డారు. దొంగ ఓటర్లకు పోలీసులు సహకరిస్తున్నారన్నారు. తాము దొంగ ఓటర్లను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని పోలీసులకు, ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. చనిపోయిన వృద్ధురాలి పేరుతో కూడా ఓటేశారన్నారు. ఎన్నికల కమిషన్ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ రౌడీ షీటర్లతో దౌర్జన్యాలకు పాల్పతోందని, తమ పార్టీ కార్యకర్తలను కొట్టి, తిరిగి వారి మీదనే కేసులు పెడతామని నవీన్ యాదవ్ అనుచరులు బెదిరిస్తున్నారని మాగంటి సునీత పేర్కొన్నారు.

అధికార కాంగ్రెస్ పార్టీ దుర్వినియోగానికి పాల్పడింది

- ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

ప్రతిపక్షం, సిటి బ్యూరో, నవంబర్ 11 : జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికార దుర్వినియోగానికి పాల్పడిందని,ఆ పార్టీకి చెందిన గుండాలు, రౌడీలు పోలింగ్ ప్రారంభమైన కొద్ది సేపటి నుంచే దౌర్జన్యాలకు దిగారని,అరాచకం సృష్టించారని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర చెప్పారు.ఎన్నికల కమిషన్ పూర్తిగా వైఫల్యం చెందిందని,అధికార కాంగ్రెస్ దొంగ ఓట్లు వేయించుకునేందుకు ప్రయత్నిస్తున్నదని పలు మార్లు ఫిర్యాదు చేసినా కూడా ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు.ఢిల్లీలో బీఆర్ఎస్ ఎంపీలు ఎన్నికల సంఘాన్ని, హైదరాబాద్ లో సిఇవో సుదర్శన్ రెడ్డిని కేటీఆర్, హరీష్ రావు తదితరులు పలుమార్లు కలిసి 20కి పైగా ఆధారాలతో సహా ఫిర్యాదులు చేసినా కనీస స్పందన కానరాలేదని ఎంపీ రవిచంద్ర తెలిపారు.యూసఫ్ గూడలోని ఫంక్షన్ హాళ్లలో దొంగ ఓటర్లు మోహరించి ఉన్నారనే సమాచారంతో బీఆర్ఎస్ అభ్యర్థి సునీత,తాను ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, ఎర్రోల శ్రీనివాస్ తదితర నాయకులు అక్కడకు వెళితే రౌడీ మూకలు దౌర్జన్యానికి దిగారన్నారు.అధికార పార్టీ నాయకులు,కార్యకర్తలు, రౌడీలు పోలింగ్ స్టేషన్ల వద్దనే అరాచకాలకు దిగితే పోలీసులు వారిని అడ్డుకోకుండా వత్తాసు పలికారని ఎంపీ రవిచంద్ర పేర్కొన్నారు.పోలింగ్ స్టేషన్ పక్కనే కాంగ్రెస్ ఎన్నికల కార్యాలయం ఉండడం చట్ట విరుద్ధమని ఎన్నికల సంఘానికి వివరించినా కూడా ఎటువంటి చర్య తీసుకోకపోవడం తీవ్ర విచారకరమన్నారు.కాంగ్రెస్ గుండాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నా,దాడులకు దిగుతున్నా కూడా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూచనల మేరకు బీఆర్ఎస్ శ్రేణులు సంయమనం పాటించడం జరిగిందని ఎంపీ రవిచంద్ర చెప్పారు.రాష్ట్రంలో ఈరోజు ప్రజాస్వామ్యం ఖూనీ అయ్యిందని, ఎన్నికలను సజావుగా జరిపించడంలో ఎన్నికల సంఘం ఫెయిల్ అయ్యిందన్నారు.అధికార పార్టీకి కొమ్ము కాసిన పోలీసుల వైఖరి గురించి డీజీపీ శివధర్ రెడ్డికి, ఎన్నికలను సజావుగా నిర్వహించడంలో వైఫల్యం చెందిన సిఈవో సుదర్శన్ రెడ్డిపై కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసి, చట్టపరంగా తగు చర్యలు తీసుకోవాల్సిందిగా కోరుతామని ఎంపీ వద్దిరాజు చెప్పారు.

ఓటు వేసిన హైడ్రా కమిషనర్ రంగనాథ్

ప్రతిపక్షం, సిటి బ్యూరో, నవంబర్ 11: జూబ్లీహిల్స్ శాసన సభ స్థానానికి జరుగుతున్న ఉప ఎన్నికల్లో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఓటు హక్కు వినియోగించుకున్నారు. మధుర నగర్ లోని శ్రీనిధి విశ్వభారతి హై స్కూల్ లోని పోలింగ్ బూత్ 132 లో కుటుంబ సమేతంగా వచ్చి ఓటు వేశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. ఓటు హక్కు వినియోగించుకోవడం మన అందరి బాధ్యత అని అన్నారు. ఓటును సద్వినియోగం చేసుకోవాలి, వృధా చేసుకోవద్దు అని సూచించారు. యువత కూడా ఓటు వేసిన తర్వాత మిగతా పనులు చూడాలన్నారు. ఓటు హక్కును వినియోగించుకోవడాన్ని నిర్లక్ష్యం చేయరాదని సూచించారు.

మౌలానా ఆజాద్ ఆశయ సాధనకు కృషి చేయాలి

- ఎంఐఎం కరీంనగర్ అధ్యక్షుడు గులాం అహ్మద్ హుస్సేన్

ప్రతిపక్షం కరీంనగర్ బ్యూరో, నవంబర్ 11 : స్వాతంత్ర్య సమరయోధుడు, దేశ తొలి విద్యా శాఖ మంత్రి, భారతరత్న మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంఐఎం కరీంనగర్ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ పిలుపునిచ్చారు. ఆజాద్ 136వ జయంతి సందర్భంగా కరీంనగర్ రూరల్ మండలం మగ్దూంపూర్ మైనారిటీ గురుకుల బాలుర 3, బొమ్మకల్ బాలుర 1 ఆశ్రమ పాఠశాలలలో మంగళవారం నిర్వహించిన జాతీయ విద్యా దినోత్సవంలో గులాం అహ్మద్ హుస్సేన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మనిషికి మూలం చదువే నని, బాల్యదశలోనే చదువును వంట పట్టుకుని చదివితే ఉజ్వల భవిష్యత్తు సహకారం అవుతుందని చెప్పారు. మైనారిటీ గురుకులాలలో చదువుతున్న విద్యార్థులు డాక్టర్లు, ఇంజనీర్లుగా పారామెడికల్ కోర్సులలో ఉన్నత విద్యావంతులుగా రాణిస్తున్నారని అన్నారు. విద్యార్థులు తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని, పాఠశాల పేరు, ఉపాధ్యాయుల పేరు నిలబెట్టాలని, ఐఏఎస్ ఐపీఎస్ అధికారులుగా, ప్రత్యక్ష రాజకీయాలలోనూ రాణించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఆరిఫ్ అహ్మద్, ప్రిన్సిపల్స్ చంద్రమోహన్, మహేశ్, విజిలెన్స్ అధికారులు అక్రమ్ పాషా, ఇంతియాజ్ అలీ, అకాడమీ కో ఆర్డినేటర్ మేరాజ్, వార్డెన్లు సైఫుద్దీన్, ఉస్మాన్ పాల్గొన్నారు.

ఏపీలో 39లక్షల మందికి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాం. 22,861మందిలో సర్వైకల్, 9,963మందిలో బ్రెస్ట్, 26,639మందిలో నోటి క్యాన్సర్ లక్షణాలను గుర్తించాం. వీరిని బోధనాస్పత్రుల్లోని అంకాలజిస్టులు మరోసారి పరీక్షించి వ్యాధి నిర్ధారణ, చికిత్స అందిస్తారు. అధికారులు క్యాన్సర్‌పై ప్రజల్లో అవగాహన కల్పించాలి, మళ్లీ స్క్రీనింగ్ చేపట్టాలి.

- ఏపీ మంత్రి సత్యకుమార్

ప్రాంతీయం

ఆపదలో ఉన్న నిరుపేదలకు ఆర్థిక భద్రతనిచ్చేది సీఎం సహాయనిధి

- కూన శ్రీనివాస్ గౌడ్

ప్రతిపక్షం, కుత్బుల్లాపూర్, నవంబర్ 11 : ఆపదలో ఉన్న నిరుపేదలకు ఆర్థిక భద్రతనిచ్చేది, ఆరోగ్య భరోసానిచ్చేది సీఎం సహాయనిధి అని కెకెఎం ట్రస్ట్ చైర్మన్, కాంటెస్టెడ్ కార్పొరేటర్ కూన శ్రీనివాస్ గౌడ్ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ఇటీవలే అనారోగ్య పరిస్థితులతో ఆసుపత్రిలో చికిత్స పొందిన కొండా సుజాత, ఎరగాం ధండ్ల వంశీ, రెడ్డి సత్యనారాయణ, నీరుడు ఓంప్రకాష్, మర్గం శంకర్, కొట్టె సులోచనలు గతంలో మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సిఎం సహాయానిధికింద దరఖాస్తు చేసుకున్నారు. వారికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన మూడు లక్షల రూపాయల ఆర్థిక సహాయాన్ని మంగళవారం తన నివాసం వద్ద కూన శ్రీనివాస్ గౌడ్ పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో అలాగే మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు ప్రత్యేక కృషితో నియోజకవర్గంలో ప్రజాపాలన ద్వారా బడుగు, బలహీన వర్గాలకు అండగా నిలుస్తున్నారని కొనియాడారు. ప్రజాపాలనలో పేద, మధ్యతరగతి ప్రజలకు ముఖ్యమంత్రి, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజానర్సింహా కార్పొరేట్ రంగంలో వైద్యం అందించడంతో పాటు వైద్యనికి అయినా ఖర్చులు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా పేదలకు అందించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో దూలపల్లి మాజీ కౌన్సిలర్ బైరి శివకుమార్ గౌడ్, చౌడ శ్రీనివాస్, నాగిల్ల శ్రీనివాస్, బాలప్ప, సాగర్, ఉలిపి శ్యామ్, అరుణ్ కుమార్, రఘు గౌడ్, సంపత్, కృష్ణ, కృష్ణమ నాయుడు, కృష్ణారెడ్డి, లబ్దిదారులు, నియోజకవర్గం ప్రజలు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలకు ఎంపికైన విద్యార్థినిలు

ప్రతిపక్షం, చిట్యాల, నవంబర్ 11: టీ సాట్, తెలంగాణ ప్రభుత్వ గెజిటెడ్ హెడ్మాస్టర్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో వార్షిక విద్యార్థుల పోటీలు జరిగాయి. దీనిలో భాగంగా జరిగిన జిల్లా స్థాయి క్విజ్ పోటీల్లో చిట్యాల మండలం చిన్నకాపర్తి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. పాఠశాలకు చెందిన పదవ తరగతి విద్యార్థిని శ్రీవిద్య, 9వ తరగతి విద్యార్థిని వలిగొండ నర్మద మొదటి స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిని పాఠశాల హెచ్ఎం, మండల విద్యాధికారి సైదా నాయక్, ఉపాధ్యాయులు భూపాల్ రెడ్డి, బాలకృష్ణ, నయీముద్దీన్, అష్రఫ్ అలీ, మాధవి, రేవతి, సాయిబాబా, చంద్రశేఖర్, అబ్దుల్ గఫార్, శ్రీలత, నవ్య, శిరీష లు అభినందించారు.

చిట్యాలలో అదనపు కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు

ప్రతిపక్షం, చిట్యాల, నవంబర్ 11: చిట్యాల తహశీల్దార్ కార్యాలయాన్ని నల్గొండ జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్, ఆర్డీవో అశోక్ రెడ్డిలు మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. సిబ్బందితో మాట్లాడి పలు సూచనలు చేశారు. అలాగే మల్లన్నగుడి వద్ద గల ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పీఏసీఎస్ చైర్మెన్ సుంకరి మల్లేష్‌గౌడ్ తో కలిసి సందర్శించి రికార్డులను పరిశీలించారు. అనంతరం వెంకటేశ్వర రైస్ ఇండస్ట్రీని సందర్శించారు. కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చే ధాన్యాన్ని ఎప్పటికప్పుడు దిగుమతి చేసుకోవాలని ఆదేశించారు. ఇన్చార్జి తహశీల్దారు విజయ ఇతరులు వారితో ఉన్నారు.

హైదరాబాద్ విజయవాడ జాతీయ రహదారిపై బస్సు దగ్ధం

- ప్రయాణికులు సురక్షితం

ప్రతిపక్షం, చిట్యాల, నవంబర్ 11: హైదరాబాద్, విజయవాడ జాతీయ రహదారిపై మంగళవారం తెల్లవారుజామున బస్సు దగ్ధమైన సంఘటన జరిగింది. నల్గొండ జిల్లా చిట్యాల మండలం వెలిమినేడు శివారులో హైదరాబాద్ నుండి కందుకూరుకు వెళుతున్న విహారి స్లీపర్ ప్రైవేట్ ట్రావెల్ బస్సు (ఎన్ఎల్ 01 బీ 3250) లో షార్ట్ సర్క్యూట్ వల్ల ఇంజన్ లో మంటలు చెలరేగాయి. డ్రైవర్ దీనిని గుర్తించి బస్సును ఆపారు. వెంటనే అప్రమత్తమై ప్రయాణికులు దిగాలని అలర్ట్ చేశారు. అత్యవసర ద్వారం నుండి కొందరు, మరికొందరు అద్దాలను పగలగొట్టి దిగారు. ప్రయాణికులు దిగిన కొద్ది క్షణాల్లోనే బస్సుకు నిప్పంటుకొని పూర్తిగా కాలిపోయింది. రెండు ఫైర్ ఇంజన్లు సంఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పేసినప్పటికీ, అప్పటికే బస్సు పూర్తిగా కాలిపోయింది. బస్సులో 32 మంది ప్రయాణికులు ఉన్నారు. ఎవరికి ఎలాంటి ప్రాణహానే జరగకపోవడంతో ప్రయాణికులందరూ ఊపిరి పీల్చుకున్నారు. సంఘటన స్థలానికి హుటాహుటిన చిట్యాల సీఐ నాగరాజు తన సిబ్బందితో వెళ్లి ట్రాఫిక్ ను క్రమబద్ధీకరించారు.

సంధ్యా శ్రీధర్‌రావుకు హైకోర్టులో చుక్కెదురు

- ఎఫ్‌సీఐ లే ఔట్‌లో రహదారుల పునరుద్ధరకు ఆదేశం
- బాధితులకు అండగా ఉంటామని చెప్పిన హైకోర్టు
- హైడ్రాకు పలు సూచనలు చేసిన న్యాయమూర్తి

ప్రతిపక్షం,సిటి బ్యూరో , నవంబర్ 11: గచ్చిబౌలిలోని ఫెర్టిలైజర్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఎంప్లాయిస్ కోపరేటివ్ హౌసింగ్ సొసైటీ లే ఔట్‌లో సంధ్యా కన్వెన్షన్ యజమాని శ్రీధరరావు ఆక్రమణలను హైకోర్టు మంగళవారం తప్పుపట్టింది. రహదారులు ఆక్రమించి పలు నిర్మాణాలు చేపట్టడాన్ని సీరియస్‌గా పరిగణించింది. మొత్తం 20 ఎకరాల పరిధిలో వేసిన లేఔట్‌లో 162 వరకూ ప్లాట్లుండగా.. అందులోని మెజార్టీ ప్లాట్లు నావనే ఉద్దేశంతో రహదారులు, పార్కులు ఆక్రమిస్తే వ్యవస్థలు చూస్తూ ఊరుకోవని హెచ్చరించింది. హైడ్రా అందుకే ఆక్రమణలను తొలగించిందని పేర్కొంది. ఒకసారి లే ఔట్ వేస్తే.. అదే కొనసాగుతుందని స్పష్టం చేసింది. సంధ్యా శ్రీధర్ రావు రహదారుల ఆక్రమణలను ఇటీవల హైడ్రా తొలగించిన విషయం విధితమే. ఈ విషయమై సంధ్యా శ్రీధరరావు హైకోర్టును ఆశ్రయించారు. మంగళవారం ఈ కేసు విచారణలో భాగంగా జస్టిస్ విజయ్‌సేన్ రెడ్డి పై వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా బాధిత ప్లాట్ యజమానులు కూడా వారి గోడును హైకోర్టుకు విన్నవించుకున్నారు. లే ఔట్‌లో సరిహద్దులన్నీ చెరిపేసి ఇష్టానుసారం నిర్మాణాలు చేపడుతున్నారని సంధ్యా శ్రీధర్‌రావుపై ఫిర్యాదు చేశారు. ఎక్కువ ప్లాట్లు కొని.. తమను భయపెట్టి మిగతావి కూడా సొంతం చేసుకోవాలని సంధ్యా శ్రీధరరావు ప్రయత్నించారని పేర్కొన్నారు. ఎక్కువ ప్లాట్లు తనవే ఉన్నాయని.. లే ఔట్‌లోని రహదారులు, ఆ పక్కనే ఉన్న తమ ప్లాట్లు, పార్కులు సరిహద్దులు పట్టించుకోకుండా నిర్మాణాలు చేపట్టారని హైకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఇదేమని అడిగితే తమపై దాడి చేసేవారని తెలిపారు.

హైడ్రాను ఆశ్రయించాం

ఓ ప్లాట్ యజమానురాలిపై దాడి చేయడమే కాకుండా తప్పుడు కేసులు కూడా పెట్టారని సంధ్యా శ్రీధర్ రావుపై బాధితులు ఫిర్యాదు చేశారు. ఇందుకు గాను సంధ్య శ్రీధర్‌రావుకు రూ. 10 లక్షలు సుప్రింకోర్టు ఫైను విధించిన విషయాన్ని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. తమ ప్లాట్లు చూడడానికి కూడా వీలు లేకుండా చేశారని వాపోయారు. నేరుగా దాడులు చేసి భయభ్రాంతులకు గురి చేసిన సమయంలో తాము హైడ్రాను ఆశ్రయించామని బాధితులు తెలిపారు. హైడ్రా అధికారులు వెంటనే స్పందించి క్షేత్రస్థాయిలో పరిశీలించి రహదారుల ఆక్రమణలను నిర్ధారించాక చర్యలు తీసుకున్నారని పేర్కొన్నారు. మాకు పెట్టిన ఇబ్బందులను కోర్టుకు విన్నవించుకోవడానికే తాము ఈ కేసులో ఇంప్లీడ్ అయ్యామని చెప్పారు. బాధితుల ఫిర్యాదులన్నీ విన్నాక జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి ఇప్పటికే రహదారుల పునరుద్ధరణకు తాము హైడ్రాకు సూచించామని బాధితులకు తెలిపారు. అందులోని ప్లాట్ల యజమానులకు అండగా హైకోర్టు ఉంటుందని ధైర్యం చెప్పారు. లే ఔట్‌లోని రహదారులను, పార్కులను పునరుద్ధరించాలని హైడ్రాకు హైకోర్టు మరోసారి సూచించింది. ఫైనల్ హియరింగ్ కోసం ఈనెల 18వ తేదీకి కేసును వాయిదా వేసింది.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

- అల్లీపురంలో డిసెంబర్ 1న నిర్వహణ

ప్రతిపక్షం ప్రతినిధి, ఖమ్మం, నవంబర్ 11: అల్లీపురం దైవకృపా మినిస్ట్రీస్ ప్రార్థన మందిరంలో ఖమ్మం జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్, పాస్టర్స్ ఫెలోషిప్ ఐక్యవేదిక ఆధ్వర్యంలో డిసెంబర్ ఒకటిన ఉదయం పది గంటలకు అద్భుతమైన క్రిస్మస్ ఆరాధన మహోత్సవం జరుగుతుందని తిమోతి గౌరవాధ్యక్షులు వేముల సత్యం తెలిపారు. ప్రధాన కార్యదర్శి రాంబాబు అధ్యక్షతన నాలుగు సంవత్సరాలుగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ఉన్న అందరు దైవ సేవకులు పాస్టర్స్ బిషప్పులు అన్ని ఫెలోషిప్స్ హెడ్స్ పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సమన్వయకర్త రాధాకృష్ణ, సలహాదారులు ప్రసాద్ రావు, నరసయ్య, జిల్లా సమన్వయకర్త పానుగంటి రాజరత్నం, ఎర్నెస్ట్ పాల్, జార్జిములర్ ఎలీషా పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలతో పేద ప్రజలకు ఎంతోమేలు

- సర్దార్ నగర్ మార్కెట్ మాజీ డైరెక్టర్ ఆంజనేయులు గౌడ్

ప్రతిపక్షం, మొయినాబాద్, నవంబర్ 11 : ఉచిత వైద్య శిబిరాలతో పేద ప్రజలకు ఎంతోమేలు అని సర్దార్ నగర్ మార్కెట్ మాజీ డైరెక్టర్ ఆంజనేయులు గౌడ్ అన్నారు. మండల పరిధిలోని చిన్నమంగళారం గ్రామ పంచాయతీ ఆవరణలో ఏఐజీ ఆసుపత్రివారి సౌజన్యంతో సర్దార్ నగర్ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ ఆంజనేయులు ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో ప్రజలకు లివర్ స్కానింగ్, రక్తం, బిపి, షుగర్ పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... నేడు మనం తీసుకునే ఆహారం, వాతావరణంలో వస్తున్న మార్పులు, ఇతర కాలుష్యాల వలన ప్రతి ఒక్కరు అనారోగ్యాల బారిన పడుతున్నారని, ఇలాంటి పరిస్థితిలో ఆరోగ్యం పట్ల నిర్లక్షం వద్దని, ప్రతిఒక్కరూ ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేసుకొని ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కీర్తి, ఎ.ఆంజనేయులు గౌడ్ ,ఎన్.రాములు, పి.గోపాల్ రెడ్డి, పి.బిక్షపతి గౌడ్, పి.శ్రీకాంత్ రెడ్డి, పి.మోహన్ రెడ్డి, పి.ప్రతాప్ రెడ్డి, ఏవీ రెడ్డి, ఎన్.నారాయణ, జి.నర్సింగ్ రావు , బి.రాములు, టి.రాజు, ఎం.వెంకటేష్, బి.శంకర్, టి.నరేష్, వి.రవి, టి.బాలరాజ్ , వి.రమేష్, ఎ.వెంకటేష్ గౌడ్, కె.గోపాల్, కె.రాజు, సెక్రటరీ శ్రీలత రెడ్డి, గ్రామ నాయకులు, యువకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విద్యార్థులకు మేలు

- రచయిత యాడవరం చంద్రకాంత్ గౌడ్

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, నవంబర్ 11 : విద్యార్థులు బాల్య దశ నుండే నీతి నైతిక విలువలతోకూడిన కథలు గేయాల పుస్తకాలు చదవాలని, తద్వారా విద్యార్థులలో జ్ఞానం పెరుగుతుందని కవి, రచయిత, సమీక్షకులు యాడవరం చంద్రకాంత్ గౌడ్ అన్నారు. రాంపూర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా మంగళవారం నాడు వివిధ రకాల బాల సాహిత్య పుస్తకాలను అందించారు. పుస్తక పఠనం తప్పనిసరి అలవాటు చేసుకోవాలన్నారు. ప్రధానోపాధ్యాయులు పరుషరాములు గౌడ్ మాట్లాడుతూ పుస్తకాన్ని మస్తిష్కానికి ఎక్కించుకుంటే బాలలు మంచి దారిలో పయనిస్తారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గీత, సృజన, విద్యా వాలంటీర్లు పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి

- మత్స్య సహకార సంఘం నాయకుడు గరుగు రాజు ముదిరాజ్.

ప్రతిపక్షం, మొయినాబాద్, నవంబర్ 11: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకున్నప్పుడే మనసుకు ప్రశాంతత కలుగుతుందని మత్స్య సహకార సంఘం నాయకుడు గరుగు రాజు ముదిరాజ్ అన్నారు . మున్సిపాలిటీ పరిధి చిలుకూరులో శ్రీ రేణుక ఎల్లమ్మ ప్రతిష్ఠా మహోత్సవము శ్రీశ్రీ రేణుక ఎల్లమ్మ కళ్యాణము శ్రీ రేణుక ఎల్లమ్మ బోనాల ఉత్సవాలు గత వారం రోజులుగా చిలుకూరులో ఘనంగా నిర్వహించారు. 500 సంవత్సరాల పురాతన మైన దేవాలయం శిథిలావస్థలో ఉన్న రేణుక ఎల్లమ్మ దేవాలయాన్ని చిలుకూరు గ్రామాన్ని చెందిన గరుగు రాజు ముదిరాజ్ గ్రామస్తులతో కలిసి ఈ దేవాలయాన్ని ఎలాగైనా నూతనంగా నిర్మించాలని దృఢ సంకల్పంతో ఆయన గ్రామస్తుల సహకారంతో సొంత నిధులతో సుమారు రూ.45 లక్షలతో ఈ దేవాలయాల నిర్మాణాన్ని పూర్తిచేసి గత వారం రోజులుగా రేణుక ఎల్లమ్మ కళ్యాణం రేణుక ఎల్లమ్మ బోనాలు శివసత్తులు పోతురాజుల విన్యాసాలతో గ్రామమంతా భక్తిశ్రద్ధలతో మార్మోగింది .ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పలు జాగ్రత్త సైతం తీసుకున్నారు అనంతరం తీర్థప్రసాదాలు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు .ఈ కార్యక్రమంలో మాజీ జెడటిసి శ్రీకాంత్, మంచి రేవుల శ్రీరాములు, జెవంత్ , సుధాకర్ రెడ్డి, దర్గ నరేందర్ , రాంపల్లి సంతోష్ కుమార్ చారి గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు కొత్త 50 ఆటోలను అందజేసిన ఎమ్మెల్యే

ప్రతిపక్షం, సిటి బ్యూరో, నవంబర్ 11 : ఉప్పల్ నియోజకవర్గం లోని ఆటో డ్రైవర్లకు 50 మందికీ ప్రభుత్వ స్కీం జీఓ నంబర్ 263 కింద వచ్చిన కొత్త ఆటోలను ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి చేతుల మీదుగా ఆటో డ్రైవర్లకు అందజేసి రిబ్బన్ కట్ చేసి డ్రైవర్లకు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆటో డ్రైవర్లకు శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రతీ ఒక్కరు జాగర్తగా ఆటోలను నడపాలని కోరారు. మీ ఇంట్లో వాళ్ళు ను మంచిగా చూసుకోవాలని.మీ పిల్లలను మంచిగా చదివించాలని చెప్పారు. ఆటోలను నడిపి దినదిన అభివృద్ధి చెందాలని అన్నారు. ఈ కార్యక్రమం బీఆర్టియు కాప్రా అధ్యక్షులు రామాంజనేయులు అధ్యక్షతన సమావేశంలో ఆటో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వేముల మారయ్య , కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి, హమాలీ శ్రీనన్న , బీఆర్టియు రాష్ట్ర కార్యదర్శి మహేష్ దేశపాక్, వర్కింగ్ ప్రెసిడెంట్ పాండు నాయక్, సిహెచ్ సాయి కుమార్ ,సిహెచ్ శ్రీనివాస్ యాదవ్,శ్రీరామ్ నాయక్, ఎర్రం శ్రీనివాస్, గోపాల్,తదితరులు పాల్గొన్నారు.

ఏమైనా చెప్పాలంటే సోషల్ మీడియా ద్వారా వెల్లడిస్తా. రూమర్లు సృష్టించాల్సిన అవసరం లేదు. లక్కీ భాస్కర్ కథ నచ్చి తల్లి క్యారెక్టర్ చేశా. ఇక అటువంటి పాత్రలు వస్తే నిర్మొహమాటంగా నో చెప్పేస్తా. మెగాస్టార్ చిరంజీవితో కలిసి నటిస్తున్న 'విశ్వంభర' నా కెరీర్‌లో స్పెషల్ చాప్టర్‌గా నిలిచిపోతుంది. సీనియర్ హీరోలతో నటించడానికి ఇబ్బంది లేదు.

- హీరోయిన్ మీనాక్షి చౌదరి

ప్రాంతీయం

మౌలానా అబుల్ కలాం ఆజాద్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి

- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

ప్రతిపక్షం ప్రతినిధి, నిర్మల్, నవంబర్ 11 : విద్యార్థులంతా మౌలానా అబుల్ కలాం ఆజాద్ జీవితాన్ని మార్గదర్శకంగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. మంగళవారం చించోలి (బి) సమీపంలోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ బాలికల పాఠశాల, కళాశాలలో భారత తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా నిర్వహించిన జాతీయ విద్యా దినోత్సవం కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మౌలానా అబుల్ కలాం ఆజాద్ స్వాతంత్ర సమర యోధులలో ముందువరుసలో నిలిచి, దేశ స్వాతంత్రం కోసం ప్రాణం పణంగా పెట్టారని పేర్కొన్నారు. ఆయన జయంతిని మైనారిటీ సంక్షేమ దినోత్సవంగా కూడా జరుపుకుంటామని తెలిపారు. స్వాతంత్రం అనంతరం భారత తొలి విద్యాశాఖ మంత్రిగా పనిచేసి, విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారని చెప్పారు. విద్య కొద్దిమందికి మాత్రమే అందుబాటులో ఉన్న కాలంలో, మౌలానా ఆజాద్ దేశంలో విద్యా వ్యాప్తి, సమాన అవకాశాల కోసం నిరంతర కృషి చేశారని కలెక్టర్ వివరించారు. మైనార్టీ వర్గాల ఉన్నతికి, సమాజ సమగ్రాభివృద్ధికి కృషి చేసిన గొప్ప వ్యక్తి అని గుర్తు చేశారు. విద్యార్థులు ఆయన గొప్పతనాన్ని తెలుసుకొని ఆదర్శంగా తీసుకోవాలని, ముఖ్యంగా బాలికలు విద్యను మధ్యలో ఆపివేయకుండా, మంచి ఉద్యోగాలను సాధించి సమసమాజ నిర్మాణంలో భాగస్వామ్యం కావాలని సూచించారు. రాజ్యాంగం మహిళలకు అనేక హక్కులు కల్పించిందని, వాటిపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ప్రభుత్వాలు బాలికల విద్యాభివృద్ధికి విస్తృత ప్రోత్సాహకాలు అందిస్తున్నాయని కలెక్టర్ తెలిపారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ మాట్లాడుతూ, భారత రాజ్యాంగ నిర్మాణంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ పాత్ర మరువలేనిదని పేర్కొన్నారు. స్వాతంత్ర సమర యోధుడు, తొలి విద్యాశాఖ మంత్రి అయిన ఆయన జీవితకాలం ప్రతి ఒక్కరికి విద్య అనే లక్ష్య సాధనకు కృషి చేశారని తెలిపారు. విద్యార్థులు ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. అనంతరం ఉద్యోగ నిర్వహణలో ప్రతిభ కనబరిచిన మైనార్టీ శాఖ ఉద్యోగులకు కలెక్టర్ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు, మౌలానా అబుల్ కలాం ఆజాద్ జీవిత చరిత్రపై ఉపన్యాసాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి మోహన్ సింగ్, కలాం గుణం ఎడ్యుకేషనల్ యూత్ వెల్ఫేర్ సొసైటీ నిర్మల్ జిల్లా శాఖ అధ్యక్షులు మొహమ్మద్ ఉస్మాన్, ముఫ్తీ ఇల్యాజ్ అహ్మద్ ఖాస్మీ, ఏఐఎంఐఎం నిర్మల్ శాఖ అధ్యక్షులు అజీంబీన్ యాహియా, సయ్యద్ మజహర్ ఇమ్రాన్ ఉల్లా, మొహమ్మద్ ముజాహిద్ అలీ, తహసిల్దార్ రాజు, కళాశాల, పాఠశాల ప్రిన్సిపల్స్ రహత్ నాజ్నిమ్, సుజాతా రాథోడ్, ఇతర అధికారులు, మైనార్టీ నాయకులు, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రింగు రోడ్డును పూర్తి చేయాలని సీపీఐ నిరసన

ప్రతిపక్షం, గజ్వేల్, నవంబర్ 11: గజ్వేల్ ప్రజ్ఞాపూర్ చుట్టూ ఉన్న రింగ్ రోడ్డును పూర్తి చేయాలని సీపీఐ నియోజకవర్గం కార్యదర్శి శివలింగ కృష్ణ పార్టీ నాయకులతో కలిసి మంగళవారం రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం కృష్ణ విలేకరులతో మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం హయంలో ఏర్పాటు చేసిన గజ్వేల్ ప్రజ్ఞాపూర్ రింగ్ రోడ్డు 23 కిలోమీటర్ల పొడుగుతో 2 వందల 30 కోట్లతో ఏర్పాటు చేసి పది సంవత్సరాలు గడిచిన పూర్తి కాకపోవడంతో గజ్వేల్ లోకి నాగపూర్ హైవే మెదక్, తూప్రాన్, సంగారెడ్డి మీదుగా వచ్చే భారీ వాహనాలు గజ్వేల్ పట్టణం లోకి రావడం వల్ల ట్రాఫిక్ అంతరాయం, రోడ్డు ప్రమాదాలతో ప్రాణాలను కోల్పోవడం జరిగిందని అన్నారు. కేసీఆర్ హయంలో చేపట్టినటువంటి రింగ్ రోడ్డు నేటి వరకు పూర్తి చేయకపోవడం బాధాకరమని, ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం చొరవ తీసుకొని రోడ్డును పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పార్టీ సిద్దిపేట జిల్లా కౌన్సిల్ సభ్యులు స్వర్గం రాజేశం, సీపీఐ నాయకులు మొట్ట శ్రీను, రుద్రారం బిక్షపతి, వెంకట చారి, ఎండి షాదు, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

బీసీ ఆక్రోశ సభ కరపత్రిక ఆవిష్కరణ

ప్రత్యక్షం, గజ్వేల్, నవంబర్ 11: ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఈనెల 15 న కామారెడ్డి లో జరిగే 42 శాతం బీసీ రిజర్వేషన్ అమలు పై బీసీ ఆక్రోశ సభ కరపత్రాల ఆవిష్కరణ మంగళవారం స్థానిక బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం వద్ద గావించారు. ఈ సందర్భంగా బీసీ సంఘం, ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం బీసీలకు 42 శాతం విద్య ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు సభను నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు బిసి సంఘాల నాయకులు మరియు ఎస్సీ,ఎస్టీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మల్లన్న ఆలయంలో హుండీ లెక్కింపు

- 76 రోజులకు రూ.73,18,504 ఆదాయం

ప్రతిపక్షం, కొమురవెల్లి, నవంబర్ 11: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొమురవెల్లి శ్రీమల్లికార్జున స్వామి ఆలయంలో హుండీ లెక్కింపు నిర్వహించగా రూ.73,18,504 నగదు హుండీ ఆదాయం వచ్చింది. మంగళవారం కొమురవెల్లిలో శ్రీ మల్లికార్జునస్వామి ఆలయ ముఖ మండపంలో ఆలయ ఈఓ టి.వెంకటేష్, దేవాదాయశాఖ సిద్దిపేట డివిజన్ ఇన్స్పెక్టర్ పి.విజయలక్ష్మి ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు నిర్వహించారు. ఈసందర్భంగా 76 రోజుల హుండీలను లెక్కించగా నగదు రూ.73,18,504/, మిశ్రమ బంగారం 80 గ్రాములు, మిశ్రమ వెండి 004 కిలోల 800 గ్రాములు, విదేశీ కరెన్సీ 21 నోట్లు వచ్చాయి. హుండీ లెక్కింపులో వచ్చిన మొత్తం నగదును స్థానిక ఎస్బీఐ బ్యాంకులో జమ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ బుద్ధి శ్రీనివాస్, ఆలయ ప్రధాన అర్చకులు మహదేవుని మల్లికార్జున్, ధర్మకర్తలు లింగంపల్లి శ్రీనివాస్, కాయిత మోహన్ రెడ్డి, మామిడాల లక్ష్మి, పర్యవేక్షకులు చంద్రశేఖర్, ఆలయ అర్చకులు, సిబ్బంది, శివ రామకృష్ణ భజన మండలి సేవ సమితి సేవ సభ్యులు, పోలీస్ సిబ్బంది, స్వర్ణకారుడు నర్సింహాచారి, ఎస్బీఐ బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాల అవగాహన సదస్సును విజయవంతం చేయండి

- ఐసీడీఎస్ సూపర్వైజర్ శైనీ సువర్ణ

ప్రతిపక్షం, చేగుంట, నవంబర్ 11: బాల్య వివాహాలను అరికట్టడానికి అవగాహన సదస్సు ఏర్పాటు చేయడం జరిగిందని చేగుంట సెక్టార్ ఐసీడీఎస్ సూపర్వైజర్ షైనీ సువర్ణ పేర్కొన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు అవగాహన సదస్సు కొనసాగుతుందన్నారు. ఈ అవగాహన సదస్సును విజయవంతం చేయాలని కోరారు. ఈ సదస్సులో సమన్వయ శాఖల అధికారులు, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశ వర్కర్లు పాల్గొంటున్నట్లు తెలిపారు.

ఆదర్శ పాఠశాల విద్యార్థికి జిల్లా ప్రథమ స్థానం

- వ్యాస రచన పోటీల్లో విజేతకు ప్రశంస పత్రం అందజేసిన సీపీ

ప్రతిపక్షం, దౌల్తాబాద్, నవంబర్ 11: పోలీస్ అమర వీరుల దినోత్సవం సందర్భంగా జిల్లా పోలీస్ శాఖ నిర్వహించిన 'డ్రగ్స్ వాడకం వలన నష్టాలు.. డ్రగ్స్ నివారణలో పోలీసుల పాత్ర' అనే అంశంపై వ్యాసరచన పోటీల్లో దౌల్తాబాద్ ఆదర్శ పాఠశాలలో 8 వ తరగతి చదువుతున్న విద్యార్థిని విఘ్నేశ్వరి ప్రథమ స్థానంలో నిలిచిందని ప్రిన్సిపాల్ దుర్గాప్రసాద్ తెలిపారు. మంగళవారం జిల్లా పోలీస్ కమిషనర్ కార్యాలయంలో కమిషనర్ విజయ్ కుమార్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం మెమొంటోను అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ నేటి కాలంలో సమాజాన్ని పట్టిపీడిస్తున్న మహమ్మారి డ్రగ్స్ అని వీటికి ప్రతి ఒక్కరు దూరంగా ఉండాలని అన్నారు. డ్రగ్స్ వ్యాస రచన పోటీల్లో విగ్నేశ్వరి ప్రథమ స్థానంలో నిలవడం పాఠశాలకు ఎంతో గౌరవ కారణమని హర్షం వ్యక్తం చేస్తూ విద్యార్థిని విగ్నేశ్వరిని అభినందించారు.

సభ్యత్వ నమోదుకు ప్రత్యేక ఆన్‌లైన్ పోర్టల్

- టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు దొంత నరేందర్

ప్రతిపక్షం, మెదక్ టౌన్, నవంబర్ 11: మెదక్ జిల్లాలోని పంచాయతీ కార్యదర్శులు వారి సభ్యత్వ నమోదు కోసం ఆన్లైన్ సదుపాయాన్ని వినియోగించుకోవాలని టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు దొంత నరేందర్ పిలుపునిచ్చారు. మంగళవారం మెదక్ పట్టణంలో టీఎన్జీవో భవన్లో తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల జిల్లా ఫోరం సభ్యత్వ నమోదు కోసం ప్రత్యేకంగా రూపొందించిన ఆన్లైన్ పోర్టల్ ను జిల్లా కార్యదర్శి రాజ్ కుమార్ తో కలిసి ప్రారంభించారు. తొలి సభ్యత్వాన్ని తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల జిల్లా ఫోరం కార్యదర్శి కాయితీ సంతోష్ సభ్యత్వం నమోదు చేశారు. కార్యదర్శుల సౌకర్యార్థం తీసుకొచ్చిన ఈ పోర్టల్ ను వినియోగించుకొని రెండు నిమిషాల్లో సభ్యత్వాన్ని పొందవచ్చని తెలిపారు. ఈ పోర్టల్ రూపకల్పనలో కృషి చేసిన జిల్లా కార్యదర్శి కాయితీ సంతోష్‌ను ప్రత్యేకంగా అభినందించారు.. త్వరలోనే జిల్లా వ్యాప్తంగా సభ్యత్వాలను పూర్తి చేయాలని ఫోరం కార్యవర్గానికి సూచించారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో జిల్లా ఉపాధ్యక్షులు ఎండి.ఫజులుద్దీన్ సభ్యులు కోలాచలం ప్రవీణ్, ప్రభాకర్ రెడ్డి,జగదీష్, నాగేశ్వర్ లు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలతో నష్టం వాటిల్లిన

పంటలపై అధ్యయనం చేస్తాం

- క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా వ్యవసాయ అధికారి

ప్రతిపక్షం, చేగుంట, నవంబర్ 11: ప్రయివేటు కంపెనీ విత్తనాలతో వరి సాగు చేసి నష్టపోయిన రైతు పంటలను మెదక్ జిల్లా వ్యవసాయ అధికారి దేవా కుమార్ పరిశీలించారు. చేగుంట మండలం రుక్మాపూర్ గ్రామంలో అగ్రిమెంట్ పేరుతో రైతులు సాగుచేసిన 100 ఎకరాల వరి పంటలను చూసి నివ్వెర పోయారు. మగ వరి సీడ్స్ పేరుతో ఒక కంపెనీకి చెందిన సూపర్వైజర్లు వరి విత్తనాలను సరఫరా చేశారు. దీంతో అధిక దిగుబడులతో లాభాలు గడించవచ్చని రుక్మాపూర్ గ్రామానికి చెందిన సుమారు 40 మంది రైతులు కంపెనీ సీడ్స్ పంటలను సాగు చేశారు. వరి పంట ఏపుగా ఎదగకపోవడం ఈనే దశలో తాలి గింజలు ఏర్పడడం, క్రిమిసంహారక మందులు స్ప్రే చేసిన ప్రయోజనం లేకపోవడంతో బాధిత రైతులు పోలీసులు ఆశ్రయించారు. దీంతో జిల్లా వ్యవసాయ అధికారి దేవా కుమార్ మంగళవారం గ్రామాన్ని సందర్శించి పంటల సాగుపై రైతులతో మాట్లాడారు. దెబ్బతిన్న వరి పంటల వివరాలను ఆయన సేకరించారు. నష్టం వాటిలీన పంటలపై వ్యవసాయ పరిశోధకులు అధ్యయనం చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో చేగుంట మండల వ్యవసాయ అధికారి హరిప్రసాద్ నార్సింగ్ మండల వ్యవసాయ అధికారి యాదగిరి రెడ్డిపల్లి సొసైటీ చైర్మన్ మేకల పరమేష్ బాధిత గ్రామ రైతులు పాల్గొన్నారు.

14న రాష్ట్రస్థాయి బాలమిత్ర అవార్డులు

ప్రతిపక్షం, సిద్దిపేట టౌన్, నవంబర్ 11: రాష్ట్రస్థాయి బాలమిత్ర అవార్డుల ప్రదాన కార్యక్రమాన్ని ఈనెల 14న బాలల దినోత్సవ సందర్భంగా హైదరాబాద్‌లోని మినీ రవీంద్రభారతి హాల్‌లో ఘనంగా నిర్వహించనున్నట్లు బాలల హక్కుల ప్రజా వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వలస సుభాష్ చంద్రబోస్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చిన్నారులతో కలిసి కేక్ కట్ చేసి బాలల దినోత్సవాన్ని ప్రత్యేకంగా జరుపుతామని, చిన్నారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఈ కార్యక్రమం నిర్వహించబడుతోందని చెప్పారు. సృజనాత్మకత, ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు ఇది వేదికగా నిలుస్తుందన్నారు. దేశభక్తి పాటలు, భరత నాట్యం, గిటార్, కీబోర్డు, ఫ్లూట్, యోగా, చిత్రలేఖనం, కవిత్వం, జానపద నృత్యం, మిమిక్రీ, కరాటే, కోలాటం, బతుకమ్మ, కూచిపూడి, చెస్, కబడ్డీ, బ్యాడ్మింటన్, టెన్నిస్, వాలీబాల్, బాస్కెట్బాల్, స్విమ్మింగ్, అర్చరీ వంటి వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన చిన్నారులకు రాష్ట్రస్థాయి బాలమిత్ర అవార్డులు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాలల హక్కుల ప్రజా వేదిక రాష్ట్ర కమిటీ నాయకులు, ప్రముఖులు పాల్గొననున్నారని వలస సుభాష్ చంద్రబోస్ తెలిపారు.

సనాతన ధర్మ పరిరక్షణ బోర్డు ఏర్పాటుకు సమయం ఆసన్నమైంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న హిందువులకు తిరుమల ఓ పుణ్యక్షేత్రమే కాకుండా ఆధ్యాత్మిక కేంద్రం. ఆ లడ్డూకు ఎంతో పవిత్రత ఉంది. ఏడాదికి సగటున రెండున్నర కోట్ల మంది భక్తులు వస్తుంటారు. విశ్వాసం, సనాతన ధర్మ భావాలను ఎవరైనా ఎగతాళి చేస్తే అది ఆధ్యాత్మిక నమ్మకాన్ని దెబ్బతీస్తుంది.

- ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ప్రతిపక్షం, చేగుంట, నవంబర్ 11: చికిత్స నిమిత్తం ఆసుపత్రికి వెళుతుండగా గుర్తుతెలియని వాహనం బైకును ఢీకొట్టడంతో మహిళ అక్కడికక్కడే మరణించారు. ఈ సంఘటన నార్సింగి సమీపంలోని వల్లభాపూర్ 44వ జాతీయ రహదారిపై జరిగింది. వల్లభాపూర్ గ్రామానికి చెందిన బాలమణి (55) ఆమె కుమారుడు రాములు (30) ద్విచక్ర వాహనంపై ఆసుపత్రికి వెళ్తున్నారు. జాతీయ రహదారి రోడ్డు క్రాస్ చేస్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో బాలమణి అక్కడికక్కడే మరణించారు. తీవ్రంగా గాయపడ్డ రాములును ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులు సామాజిక అవగాహన కల్పించుకోవాలి



- పోలీస్ కమిషనర్ విజయ్ కుమార్

ప్రతిపక్షం, నంగునూరు, నవంబర్ 11: విద్యార్థులు సామాజిక అవగాహనను కల్పించుకుని తల్లిదండ్రులు ప్రజలను చైతన్యం చేయాలని సిద్దిపేట జిల్లా పోలీస్ కమిషనర్ విజయ్ కుమార్ సూచించారు. పోలీస్ అమరవీరుల దినోత్సవం అక్టోబర్ 21 సందర్భంగా పోలీస్ శాఖ నిర్వహించిన వ్యాసరచన పోటీలలో విజేతలకు మంగళవారం బహుమతులు అందజేశారు. మాదకద్రవ్యాల దుష్ప్రభావాలు, డ్రగ్స్ నివారణలో పోలీసుల పాత్ర, విద్యార్థులు డ్రగ్స్ కు ఎలా దూరంగా ఉండవచ్చును ? అనే అంశంపై వ్యాసరచన పోటీలను అన్ని యాజమాన్యాల పాఠశాలల విద్యార్థులకు నిర్వహించారు. ఈ వ్యాసరచన పోటీలలో జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన 250 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీలలో తెలుగు మాధ్యమంలో బక్రి చెప్యాల జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి సంకటి సిరి చందన(9వ తరగతి) ప్రథమ స్థానాన్ని, ఆంగ్ల మాధ్యమంలో అదే పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థి మెదుదుల స్నేహ ద్వితీయ స్థానాన్ని పొందారు. వీటికి పోలీస్ కమిషనరేట్ లో జరిగిన కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ విజయ్ కుమార్ ప్రశంసా పత్రాలను, స్ఫూర్తిదాయక పుస్తకాలను బహుమతిగా అందించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ విజయ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు సామాజిక సమస్యలపై అవగాహన చేసుకోవడంతో పాటు, చట్టాలపై అవగాహన పెంచుకోవాలని చెప్పారు. రేపటి పౌరులైన నేటి విద్యార్థులు చక్కగా చదువుకుని ఉత్తమ పౌరులుగా ఎదగాలని చెప్పారు. విద్యార్థులు దురలవాట్లను దూరం చేసుకుని చక్కటి క్రమశిక్షణతో దేశభక్తి కలిగిన పౌరులుగా ఎదగాలని చెప్పారు. విద్యార్థులు విజ్ఞానాన్ని పెంచుకోవాలని దీనికోసం విస్తృతంగా గ్రంథ పఠనం చేయాలని తెలిపారు. సీ పీ విజయ్ కుమార్ తన విద్యార్థి దశలోని జీవితపు జ్ఞాపకాలను విద్యార్థులకు స్ఫూర్తినిచ్చే విధంగా ఉదాహరణలతో సహా వివరించారు. కార్యక్రమంలో బక్రి చెప్యాల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దారం నాగేందర్ రెడ్డి, గైడ్ టీచర్ మామిడి పూర్ణచందర్ రావు సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రాంతీయం

విద్యార్థులు ఉన్నత స్థానానికి ఎదగాలి

- రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య
- విద్యార్థులకు స్పోర్ట్స్ యూనిఫామ్స్ అందజేత

ప్రతిపక్షం, అక్బరుపేట్/- భూంపల్లి నవంబర్ 11: విద్యార్థులు మంచి విద్యను అభ్యసించి, ఉన్నత ఫలితాలు సాధించి జీవితంలో ఉన్నత స్థానానికి ఎదగాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. మంగళవారం ఎనగుర్తి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు సొంత ఖర్చుతో స్పోర్ట్స్ యూనిఫామ్స్ బక్కి వెంకటయ్య అందజేశారు. అనంతరం చైర్మన్ వెంకటయ్యను పాఠశాల అధ్యాపక బృందం, విద్యార్థులు శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి దోమకొండ అంజయ్య గౌడ్, నాయకులు జన్నారెడ్డి, రామేశ్వరం పల్లి శ్రీనివాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల బృందం, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల సత్వర పరిష్కారానికి లోక్ అదాలత్

- జిల్లా ఎస్పీ శ్రీనివాస రావు

ప్రతిపక్షం, మెదక్ టౌన్, నవంబర్ 11: ఈ నెల 15న జరగనున్న ప్రత్యేక లోక్ అదాలత్ ను కక్షిదారులు పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని మెదక్ జిల్లా ఎస్పీ శ్రీనివాస రావు మంగళవారం ఒక ప్రకటన ద్వారా విజ్ఞప్తి చేశారు. లోక్ అదాలత్ ద్వారా త్వరితగతిన, తక్కువ ఖర్చుతో, ఇరువైపుల సమ్మతితో సమస్యలను పరిష్కరించుకునే అవకాశం లభిస్తుందని తెలిపారు. చిన్న చిన్న కేసులతో కక్షలు పెంచుకుని కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయాన్ని వృథా చేసుకోవద్దని, రాజీ అంటే విజయం వైపు దారితీసే నిజమైన మార్గమాని పేర్కొన్నారు. న్యాయశాఖ అందిస్తున్న ఈ అవకాశాన్ని ప్రజలందరూ వినియోగించుకోవాలని ఎస్పీ సూచించారు. అదే విధంగా జిల్లా పోలీసు అధికారులు, స్టేషన్ హౌస్ ఆఫీసర్లు, కోర్టు విధులు నిర్వర్తించే కానిస్టేబుల్‌లు మరియు ఇతర సిబ్బంది రాజీ పడదగిన కేసులను గుర్తించి, ఇరువర్గాల వారిని పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. తమ కేసులు లోక్ అదాలత్ ద్వారా రాజీ చేసుకోవాలనుకునే వారు సంబంధిత పోలీసు స్టేషన్ అధికారులను సంప్రదించాలని ఎస్పీ సూచించారు. లోక్ అదాలత్ ద్వారా బాధితులకు త్వరిత న్యాయం అందుతుందని ఎస్పీ పేర్కొన్నారు.

ధాన్యం కొనుగోలులో ఆలస్యం ఉండొద్దు

- కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన అదనపు కలెక్టర్

ప్రతిపక్షం, మెదక్ టౌన్, నవంబర్ 11: మెదక్ మండలం పాతూరు ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రంలో నిర్వహిస్తున్న రిజిస్టర్లను పరిశీలించి ఎప్పటికప్పుడు వచ్చే ధాన్యం వివరాలను అలాగే కొనుగోలు అయిన వివరాలను రిజిస్టర్లో నమోదు చేయాలన్నారు. తేమ వచ్చిన ధాన్యాన్ని ఆలస్యం చేయకుండా కొనుగోలు చేసి ట్యాగ్ చేసిన మిల్లులకు తరలించాలన్నారు. సరిపడా టార్పాలిన్ లను అందుబాటులో పెట్టుకోవాలని, వాతావరణ ప్రతికూల ప్రభావం వలన వర్షం వచ్చే సూచనలు తెలిసినప్పుడు కేంద్రంలో ఉన్న ధాన్యం తడవకుండా వెంటనే తగు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ధాన్యం కొనుగోలు సమర్థవంతంగా నిర్వహించడం జరుగుతుందని ఇప్పటివరకు 70వేల 100 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందన్నారు.అదనపు కలెక్టర్ వెంట కొనుగోలు కేంద్ర నిర్వాహకులు తదితరులు ఉన్నారు.

ఐఐటీ మద్రాస్ కోర్సు పూర్తి చేసిన బక్రి చెప్యాల విద్యార్థులు

ప్రతిపక్షం, నంగునూరు, నవంబర్ 11: సిద్దిపేట జిల్లా సిద్దిపేట అర్బన్ మండలం బక్రి చెప్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఐఐటీ మద్రాస్ కోర్సును విజయవంతంగా పూర్తి చేశారు. స్కూల్ కనెక్ట్ కార్యక్రమంలో భాగంగా బక్రి చెప్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గత ఆగస్టులో ఐఐటి మద్రాస్ తో భాగస్వామ్యం పొందింది. ఐఐటి మద్రాస్ కు చెందిన సెంటర్ ఫర్ అవుట్ రీచ్ అండ్ డిజిటల్ ఎడ్యుకేషన్ విభాగంతో పాఠశాల బక్రి చెప్యాల ఉపాధ్యాయులు మామిడి పూర్ణ చందర్ రావు సింగిల్ పాయింట్ ఆఫ్ కాంటాక్ట్ సభ్యునిగా వ్యవహరించారు. పదవ తరగతి నుండి ఐదుగురు విద్యార్థులను ఆగస్టు 2025 బ్యాచ్ లో భాగస్వామ్యం చేశారు. డాటా సైన్స్, కృత్రిమ మేధ (ఏఐ) విభాగంలో దుగ్యాని చైతన్య, సూరం సుస్మిత, మెడుదుల స్నేహ, ఇంజనీరింగ్ అండ్ బయోలాజికల్ సిస్టమ్స్ విభాగంలో పిండి సహస్ర , బొమ్మ కీర్తన ఎనిమిది వారాల ఆన్లైన్ కోర్సులను విజయవంతంగా పూర్తి చేశారు. దీంతో వీరికి ధ్రువ పత్రాలను అందించారు. ఐఐటి మద్రాస్ నుండి ఆన్లైన్ కోర్సులను విజయవంతంగా పూర్తి చేసుకున్న పాఠశాల విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు దారం నాగేందర్ రెడ్డి, ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.

అందెశ్రీకి నిరుద్యోగ కళాకారుల నివాళులు

ప్రతిపక్షం, సిద్దిపేట టౌన్, నవంబర్ 11: తెలంగాణ రాష్ట్ర గీతరచయిత, సాహితీవేత్త, గేయరచయిత అందెశ్రీ మరణం కళా ప్రపంచానికి తీరని లోటు అని సిద్దిపేట నిరుద్యోగ కళాకారులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కళాకారులు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా అధ్యక్షులు పిన్నింటి దాసు, రాష్ట్ర కార్యదర్శులు ఎర్రవల్లి శ్రీనివాస్, సీహెచ్ పరమేష్, కుంచం శ్రీనివాస్, తునికి రాజు, ప్రముఖ కళాకారులు, టీవీ యాంకర్ సంబరాల బాలన్న, ఉపాధ్యక్షుడు భుజంగం, కళాకారులు చిరంజీవి, విధమౌళి, దేవేందర్ రెడ్డి, గజ్జెల సూర్యావంశీ పాల్గొన్నారు.

“

ఢిల్లీలో పేలుడు ఘటన పూర్తిగా కేంద్రం వైఫల్యమే. ఫరీదాబాద్‌లో 360 కేజీల పేలుడు పదార్థాలు దొరికినా ప్రభుత్వం నిరోధించలేకపోయింది. ఆరేళ్ల క్రితం పుల్వామాలో 350 కేజీల ఆర్డీఎక్స్ దొరికింది. ఇటీవల ఢిల్లీ ఏటీసీపై సైబర్ ఎటాక్‌తో 800 ఫ్లైట్స్‌కు ఆటంకం కలిగింది. ఇలాంటివి జరుగుతున్నా ప్రభుత్వం నుంచి స్పందన ఉండడం లేదు. దేశంలో భయంకర పరిస్థితులున్నాయి.

- కాంగ్రెస్ నేత పవన్ ఖేరా

యువతకు చట్టలపై అవగాహన అవసరం

- హుస్నాబాద్ సీఐ కే. శ్రీను
- షీ టీమ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన

ప్రతిపక్షం, హుస్నాబాద్, నవంబర్ 11: యువతకు చట్టలపై అవగాహన అవసరమని హుస్నాబాద్ సీఐ కే. శ్రీను అన్నారు. మహిళల భద్రత, యువతకు చట్టపరమైన అవగాహన కల్పించే దిశగా సీవీ రామన్ హై స్కూల్ విద్యార్థులకు హుస్నాబాద్ సీఐ కే. శ్రీను, షీ టీమ్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, పోక్సో చట్టం, తెలియని వ్యక్తులతో ఎలా ప్రవర్తించాలి అనే అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులను ఉద్దేశించి హుస్నాబాద్ సీఐ శ్రీను మాట్లాడుతూ ర్యాగింగ్ అనేది నేరం అని, దానిలో పాల్గొనేవారు చట్టపరమైన శిక్షార్హులవుతారని తెలియజేశారు. పాఠశాలలు, కళాశాలల్లో ర్యాగింగ్ జరిగితే వెంటనే 100కు లేదా షీ టీమ్ హెల్ప్‌లైన్ 8712667434 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. అలాగే, పోక్సో చట్టం గురించి వివరించారు. చిన్నారులపై ఏదైనా లైంగిక వేధింపులు జరిగితే అవి తీవ్రమైన నేరాలుగా పరిగణించబడతాయని తెలిపారు. ఈవ్ టీజింగ్, సోషల్ మీడియా ద్వారా వేధింపులు కూడా సైబర్ క్రైమ్ పరిధిలోకి వస్తాయని హెచ్చరించారు. తెలియని వ్యక్తులతో ఎలా ప్రవర్తించాలి అనే అంశంలో, మహిళలు, విద్యార్థులు అపరిచితులపై నమ్మకం పెట్టుకోకుండా జాగ్రత్తగా ఉండాలని, అవసరమైతే వెంటనే పోలీసుల సహాయం తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో షీ టీమ్ సభ్యులు కానిస్టేబుల్ బాబు, కృష్ణ, మహిళ కానిస్టేబుల్ ప్రశాంతి, స్వప్న, సీవీ రామన్ స్కూల్ ప్రిన్సిపల్ నారాయణరెడ్డి , విద్యాసంస్థ సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సిద్దిపేట జిల్లాను అందెశ్రీ సిద్దిపేటగా పేరు మార్చాలి

- సీఎం రేవంత్ రెడ్డిని కోరిన బీసీవై రాష్ట్ర నాయకుడు చక్రధర్ గౌడ్

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, నవంబర్ 11: సిద్దిపేట జిల్లా పేరును అందెశ్రీ సిద్దిపేట జిల్లాగా పేరు మార్చాలి అని సీఎం రేవంత్ రెడ్డిని భారత చైతన్య యువజన పార్టీ రాష్ట్ర నాయకుడు గాదగోని చక్రధర్ గౌడ్ కోరాడు. ఈ మేరకు ఆయన మీడియాతో మాట్లాడుతూ అందెశ్రీని గౌరవించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. తెలంగాణ ఉద్యమంలో అందెశ్రీ కీలక పాత్ర పోషించారని కొనియాడారు. తెలంగాణ రాష్ట్ర గీతం రచించిన అందెశ్రీకి సముచిత గౌరవం ఇవ్వాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని చక్రధర్ గౌడ్ అభిప్రాయ పడ్డారు.

ఘనంగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలు

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, నవంబర్ 11: మెదక్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం కేంద్ర తొలి విద్యాశాఖ మంత్రి అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా పట్టణ పార్టీ అధ్యక్షులు గూడూరు ఆంజనేయులు గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హఫీజ్ మౌలాన సాబ్ మాట్లాడుతూ విద్యావ్యవస్థలో మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ చేసిన విప్లవాత్మకమైన మార్పులను కొనియాడారు. క్రమశిక్షణ, ఆలోచనతో యువత ముందుకు వెళ్లాలని ఆకాక్షించారు. విద్య ద్వారానే సర్వతోముఖాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఆజాద్ మైనార్టీల అభ్యున్నతికి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు ఆమీర్, ముజమ్మిల్, రమేష్, ప్రవీణ్, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

పొదల్లో నక్కిన చిరుత పులి మృతి

- పరిశీలించిన డీఎఫ్ఓ శ్రీనివాస్

ప్రతిపక్షం, దౌల్తాబాద్, నవంబర్ 11: గొడుగుపల్లి అడవిలోని ఓ పొదల్లో నక్కిన చిరుత పులి మంగళవారం రాత్రి మృతి చెందింది. సోమవారం అటు ఇటు కదులుతూ పరిగెత్తలేని స్థితిలో ఉన్న చిరుత, మంగళవారం ఉదయం మృతి చెందింది. చిరుత పులి ఊపిరితిత్తులకు నిమోనియా రావడంతో చనిపోయిందని డీఎఫ్ఓ శ్రీనివాస్ అనుమానం వ్యక్తం చేశారు. మృతి చెందిన చిరుత పులి పరిశీలించి, డీఫ్ఓ వివరాలు వెల్లడించారు. చిరుత పులికి ఎలాంటి గాయాలు, దెబ్బలు తగలలేదని, దంతాలు శరీర భాగాలు అన్ని బాగానే ఉన్నాయని తెలిపారు. చిరుత పులికి శవ పరీక్షలు చేసిన వెటర్నరీ అధికారులు, చిరుతపులి శాంపుల్స్ ఫోరెన్సిక్ ల్యాబ్ కు తరలించారు. ఫోరెన్సిక్ ల్యాబ్ పరీక్షల అనంతరం చిరుత పులి విష హారం తిని చనిపోయిందని తేలితే, ఆ వ్యక్తులను పట్టుకొని కఠినంగా శిక్షిస్తామని డీఎఫ్ఓ శ్రీనివాస్ తెలిపారు. వన్యప్రాణులను సంరక్షణ పట్ల రైతులు, ప్రజలకు బాధ్యత ఉండాలని అన్నారు. సోమవారం అడవిలో పొదల్లో దాగి ఉన్న చిరుతను మంగళవారం ఉదయం ఫారెస్ట్ అధికారులు చూసేసరికి మృతి చెంది ఉంది. వెంటనే జిల్లా వెటర్నరీ అధికారికి సమాచారం అందించడంతో వెటర్నరీ అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని చిరుతకు శవ పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో దుబ్బాక రేంజ్ అధికారి సందీప్ కుమార్, వెటర్నరీ అధికారులు కొండల్ రెడ్డి, పరశురాములు, ఫారెస్ట్ అధికారులు హైమద్, మల్లేశం, వేణు, లింగమూర్తి, బి మల్లేశం, తదితరులు ఉన్నారు.

యూనియన్ బ్యాంక్ నంగునూరు శాఖ రూ 170కోట్ల వ్యాపారం

ప్రతిపక్షం, నంగునూరు, నవంబర్ 11: సిద్దిపేట జిల్లా నంగునూరు మండలంలోని యూనియన్ బ్యాంక్ నంగునూరు శాఖ రూ.170 కోట్లకు పైగా వ్యాపారం చేస్తోందని మేనేజర్ కటికాల అనిల్ తెలిపారు. యూనియన్ బ్యాంక్ వ్యవస్థాపక దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. బ్యాంకులో ఖాతాదారుల మధ్య కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనియన్ బ్యాంక్ గ్రామీణ ప్రజలకు అనేక రకాల ఆర్థిక సేవలను అందిస్తోందని పేర్కొన్నారు. ముంబయి నగరంలో 107 సంవత్సరాల కిందట జాతి పిత మహాత్మా గాంధీ చేతుల మీదుగా యూనియన్ బ్యాంక్ ప్రారంభమైందని చెప్పారు. ప్రపంచ వ్యాప్తంగా రూ 21 లక్షల కోట్ల వ్యాపారం చేస్తూ వేల సంఖ్యలో బ్రాంచ్ లు, ఏటీఎంలు కలిగి ఉన్నాయని వివరించారు. బ్యాంకు సిబ్బంది, ఖాతాదారుల సహకారంతో యూనియన్ బ్యాంక్ తన ప్రయాణాన్ని విజయవంతంగా కొనసాగిస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ లక్వీందర్ సింగ్, బ్యాంక్ ఉద్యోగులు బాల్ రాజు, మాలతి, శ్రీనివాస్ సిబ్బంది బాలా చారి, సంపత్, భూపతి, ఖాతాదారులు పాల్గొన్నారు.

రైతులను పట్టించుకోని ప్రభుత్వం

- బీఆర్ఎస్ నాయకులు

ప్రతిపక్షం, నంగునూరు, నవంబర్ 11: రైతుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా ప్రదర్శిస్తోందని, ధాన్యం డబ్బులు రైతుల ఖాతాల్లో జమ కాకపోవడమే దీనికి నిదర్శనమని ఉమ్మడి మెదక్ జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ రాగుల సారయ్య, నంగునూరు మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత రెడ్డి అన్నారు. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలంలోని పాలమాకుల గ్రామంలో మంగళవారం విలేకరులు సమావేశంలో వారు మాట్లాడుతూ రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటలకు అకాల వర్షాలతో నష్టం వాటిల్లిందని అని పేర్కొన్నారు. అయినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. నంగునూరు మండలం వ్యాప్తంగా అన్ని కొనుగోలు కేంద్రాల్లో రైతులు విక్రయించిన ధాన్యం డబ్బులు రైతుల ఖాతాల్లో జమ కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో రైతులకు సకాలంలో ఎరువులు, పెట్టుబడి సహాయం అందించి ఆదుకున్నదన్నారు. పండించిన పంటకు గిట్టుబాటు ధరతో పాటు ధాన్యం విక్రయించిన వారం రోజుల్లోనే రైతుల ఖాతాల్లోకి డబ్బులు జమ చేసే వారని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో రైతులు ఎంతో సంతోషంగా ఉండేవారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పాలిట శాపంగా మారిందని చెప్పారు. పెట్టుబడి సాయం అందించడంలో ఆలస్యం, నకిలీ విత్తనాలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు .అకాల వర్షాలతో పంట నష్టపోయిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను పట్టించుకోవడం లేదన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలపై పెట్టిన శ్రద్ధ రైతులపై పెట్టడం లేదని మండిపడ్డారు. రైతుల కష్టాలు పట్టని కాంగ్రెస్ ప్రభుత్వానికి జూబ్లీహిల్స్ ఓట్లపై ధ్యాస తప్ప రైతులు పడుతున్న సమస్యలపై ధ్యాస లేదన్నారు. రైతులు పండించిన ధాన్యం విక్రయించినప్పటికీ రైతులు రైతుల ఖాతాలో డబ్బులు పడక రైతుల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇందిరమ్మ రాజ్యం అని చెప్పుకునే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను సంక్షేమ పథకాలు అందించడంలో విఫలమైందని ఆరోపించారు. ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు గడిచినా ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కోల వీరయ్య గౌడ్, వేణు చక్రవర్తి, రంగు రాజు గౌడ్, చెలికాని మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

ప్రాంతీయం

తెలంగాణ తల్లి ముద్దు బిడ్డ స్వర్గీయ అందెశ్రీ

ప్రతిపక్ష ప్రతినిధి, నిజామాబాద్, నవంబర్ 11 : తూటాల వంటి తన మాటలు పాటలతో తెలంగాణ సమాజాన్ని చైతన్యం చేయటంలో కీలక పాత్ర పోషించిన తెలంగాణ తల్లి ముద్దుబిడ్డ అందెశ్రీ అని నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే ఎండల లక్ష్మీనారాయణ అన్నారు. మంగళవారం హైదరాబాదులో అందెశ్రీ అంతక్రియలు పాల్గొన్న ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ సమయంలో కూడా అందెశ్రీ గ్రామ గ్రామీణ తిరుగుతూ ప్రజలను ఉద్యమ వీరులుగా మలచటంలో కీలకపాత్ర పోషించారని అటువంటి మహానుభావుడిని అర్ధాంతరంగా కోల్పోవడం ఆ కుటుంబానికే కాదు యావత్తు తెలంగాణ సమాజానికి తీరని నష్టమన్నారు. తెలంగాణ రాష్ట్ర గీతంగా జయ జయహే తెలంగాణ పాటను గుర్తించడం పట్ల తొలిసారి ఆ గీతాన్ని అధికారికంగా ఆలపిస్తున్న సమయంలో అందెశ్రీ ఎంతో భావోద్వేగానికి లోనైనా సంఘటనను ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ గుర్తు చేసుకున్నారు. తాను తెలంగాణ ఉద్యమంలో భాగంగా ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసిన సమయంలో తన గెలుపు కోసం వెన్నంటి ఉన్న వ్యక్తుల్లో అందెశ్రీ ఒకరిని ఎప్పుడు కలిసినా ప్రజల చైతన్యము, ఉద్యమం ఆకాంక్షలను మాత్రమే మాట్లాడే వాడని గుర్తు చేసుకున్నారు. అందెశ్రీ భౌతిక కాయానికి నివాళులు అర్పించి ఆయన అంత్యక్రియలలో పాల్గొని వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

నిజామాబాద్ రైల్వే స్టేషన్లలో పోలీసుల తనిఖీలు

ప్రతిపక్షం ప్రతినిధి, నిజామాబాద్, నవంబర్ 11: దేశ రాజధాని న్యూఢిల్లీలో గత సోమవారం రాత్రి ఎర్రకోట వద్ద జరిగిన బాంబు పేలుళ్ల సంఘటన దృష్టిలో పెట్టుకొని సికింద్రాబాద్ లైన్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, నిజామాబాద్ రైల్వే పోలీసులు, జీ ఆర్ పీ ఎస్సై సాయారెడ్డి, ఆర్పీఎఫ్ పోలీసులు రైల్వే స్టేషన్ ప్లాట్ ఫామ్ పై, పరిసరాలలో తనిఖీలు చేశారు. అనుమానం ఉన్నచోట వాహనాలలో బాంబు స్క్వాడ్ డాగ్ స్క్వాడ్ తనిఖీలు విస్తృతంగా నిర్వహించారు. అలాగే రైల్వే స్టేషన్ లోని పార్సల్ కేంద్రంలో, అనుమానిత ప్రయాణికుల బ్యాగులను సైతం సోదా చేశారు.

రైలు ఢీ కొని యువకుడు మృతి

ప్రతిపక్షం ప్రతినిధి, నిజామాబాద్, నవంబర్ 11: నిజామాబాద్ జిల్లా ఇందల్వాయి రైల్వే గేటు సమీపంలో పట్టాలు దాటుతున్న గుర్తు తెలియని రైలు ఢీకొనడంతో ఓ యువకుడు మృతి చెందినట్లు నిజామాబాద్ రైల్వే ఎస్సై బి సాయిరెడ్డి తెలిపారు. మంగళవారం ఉదయం ఇందల్వాయి రైల్వే గేట్ కు సమీపంలో కోటగిరి మండలం రాయకూరు గ్రామానికి చెందిన నీరాడి సురేష్ (35) రైలు రాకను గమనించకుండ పట్టాలు దాటుతుండగా రైలు ఢీ కొట్టింది. ఈ ఘటనలో కలిగిన గాయల వల్ల సురేష్ అక్కడిక్కడే మృతి చెందాడు. సురేష్ మొత్తం దిహాని గమనించిన స్థానికులు నిజామాబాద్ స్టేషన్ మేనేజర్ సాయి కిషోర్ కు తెలుపగా, ఆయన రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతుని జేబులో ఆధారాలు పరిశీలించగా అతని ఆచూకీ లభ్యం అయింది. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీ గదికి తరలించారు.

సోయాబీన్ కొనుగోలు కేంద్రం తనిఖీ చేసిన కలెక్టర్

ప్రతిపక్షం ప్రతినిధి, నిజామాబాద్, నవంబర్ 11 : బోధన్ మండలం చిన్నమావంది గ్రామంలో ఏర్పాటు చేసిన సోయాబీన్ కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి మంగళవారం అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ తో కలిసి తనిఖీ చేశారు. కేంద్రంలో రైతులకు అందుబాటులో ఉన్న సదుపాయాలు పరిశీలించారు. సోయాబీన్ పంట నాణ్యత, తేమ శాతంను పరిశీలించిన కలెక్టర్, ఇప్పటి వరకు ఎన్ని క్వింటాళ్ల సోయాబీన్ సేకరణ జరిపారని వివరాలు అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రం వద్ద యంత్రం సహాయంతో పంటను శుభ్రం చేస్తున్న తీరును గమనించి, అధికారులకు సూచనలు చేశారు. రైతులు పంట ఉత్పత్తులు తెచ్చిన వెంటనే తేమ 12 శాతానికి లోబడి ఉంటే వెంటనే తూకం వేయించాలన్నారు. సేకరించిన పంటను జాగ్రత్తగా సీ డబ్ల్యూసీ గోడౌన్ లకు తరలించాలని అన్నారు. రైతులకు నిర్దిష్ట గడువు లోపు బిల్లుల చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని , ఆదేశించారు. కాగా, మొక్కజొన్న, సోయాబీన్ సేకరణకు సంబంధించి పట్టా రైతు బయోమెట్రిక్ వేలి ముద్రను తప్పనిసరిగా తీసుకోవాలనే నిబంధనను అమలు చేస్తుండడం వల్ల తాము ఇబ్బందులు పడాల్సి వస్తోందని పలువురు కౌలు రైతులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ, ఇప్పటికే ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని, సడలింపు ఇవ్వాల్సిందిగా రైతుల పక్షాన మరోమారు కోరతామని అన్నారు. కలెక్టర్ వెంట మార్క్ ఫెడ్ జిల్లా మేనేజర్ మహేష్, వ్యవసాయ అధికారి సంతోష్, స్థానిక అధికారులు ఉన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 20 మందికి జైలు శిక్ష

- 25 మందికి జరిమానా

ప్రతిపక్షం ప్రతినిధి, నిజామాబాద్, నవంబర్ 11 : మద్యం సేవించి వాహనాలు నడుపుతు పట్టుబడ్డ 20 మందికి జైలు శిక్ష, 25 మందికి కోర్టు జరిమానా విధించినట్లు నిజామాబాద్ ఏసిపి రాజా వెంకటరెడ్డి తెలిపారు. నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య ఆదేశాల మేరకు కమిషనరేట్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్లలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా 45 మంది పట్టుబడినట్లు తెలిపారు. వారిని మంగళవారం వివిధ పోలీస్ స్టేషన్ లలో కౌన్సిలింగ్ నిర్వహించి అనంతరం జిల్లా సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ ముందు హాజరు పరచగా 25 మందికి మోటార్ వెహికల్ సవరణ చట్టం 2019 ప్రకారం జరిమానా విధించినట్లు తెలిపారు. 25 మందికి మొత్తం రూ.2,32,000 లు జరిమానా విధించినట్లు తెలిపారు. ఈ మేరకు ప్రజలు మద్యం సేవించి వాహనాలు నడపరాదనీ హెచ్చరించారు.

ఘనంగా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలు

ప్రతిపక్షం ప్రతినిధి, నిజామాబాద్, నవంబర్ 11 : భారతరత్న, కేంద్ర తొలి విద్యాశాఖ మంత్రి అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలను జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సమావేశ మందిరం (కలెక్టరేట్)లో ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ టి. వినయ్ కృష్ణారెడ్డి, ఇతర జిల్లా అధికారులు మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆయన దేశానికి అందించిన సేవలను వక్తలు గుర్తు చేసుకున్నారు. దేశ విద్యా వ్యవస్థను తీర్చిదిద్దిన మహనీయుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ అని కొనియాడారు. 11 ఏళ్లు కేంద్ర విద్యాశాఖ మంత్రిగా ఆజాద్ ఎనలేని సేవలు అందించి, జాతీయ విద్యా విధానం అమలు చేశారన్నారు. రచయితగా, కవిగా, తత్వవేత్తగా, విద్యావేత్తగా, రాజకీయవేత్తగా అనేక సేవలందించిన బహుముఖ ప్రజ్ఞాశాలి అబుల్ కలాం ఆజాద్ అని కీర్తించారు. ఆయన మైనార్టీ వర్గాల అభ్యున్నతికి చేసిన సేవలను సైతం ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఆయన సేవలకు గుర్తింపుగా అబుల్ కలాం ఆజాద్ పుట్టిన రోజును పురస్కరించుకుని ప్రతీ సంవత్సరం నవంబర్ 11వ తేదీన ప్రభుత్వం జాతీయ విద్యా దినోత్సవం నిర్వహిస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారిణి కృష్ణవేణి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సోన్ చేరుకున్న అయ్యప్పల పాదయాత్ర

ప్రతిపక్షం, సోన్, నవంబర్ 11: గత పదిహేను సంవత్సరాలుగా ప్రతి ఏటా జరిగే అయ్యప్ప స్వాముల మహా పాదయాత్ర సోమవారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా లో ప్రారంభమై మంగళవారం సోన్ మండల కేంద్రానికి చేరుకుంది. దాంతో సోన్ గ్రామ అయ్యప్ప భక్తులందరూ పెద్ద ఎత్తున స్వాములకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జీ శ్రీనివాస్ గురు స్వామి మాట్లాడుతూ తొలి ఏడాది 11 మంది స్వాములతో ప్రారంభించిన ఈ మహా పాదయాత్ర అయ్యప్ప స్వామి మహిమతో నేడు 52 మంది స్వాములకు చేరుకుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప భక్తులు, మహిళలు , శేఖర్ అతని మిత్ర బృందం పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో సానుకూల మార్పుకు దారి

- అర్బన్ ఎమ్మెల్యే దన్పాల్

ప్రతిపక్షం ప్రతినిధి, నిజామాబాద్, నవంబర్ 11 : ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో సానుకూల మార్పుకు దారి తీస్తాయని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్య నారాయణ గుప్త అన్నారు. ఇలాంటి కార్యక్రమాలు యువతలో భక్తి, సేవా భావం పెంపొందించి కుటుంబ వ్యవస్థను పటిష్టం చేసుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. మంగళవారం నిజామాబాద్ రూరల్ మండలం మల్లారం లింగేశ్వర గుట్టపై ఇందూర్ ఆధ్వర్యంలో కార్తీక మాస వన భోజన మహోత్సవం జరిగింది. ఈ సందర్భంగా అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సభను ఉద్దేశించి ప్రసంగించారు. భారతమాత భజన పరివార్ ఇందూర్ నిర్వహిస్తున్న ఇలాంటి ధర్మో రక్షిత రక్షిత ధర్మాన్ని మనం కాపాడితే ధర్మం మనల్ని కాపాడుతుందన్నారు. హిందూ సనాతన ధర్మం పరిరక్షణలో మహిళల పాత్ర ఎంతో ముఖ్యమైనదని తెలిపారు. మన హిందూ ధర్మం ఎంతగా పెరుగుతుందో దానికి హిందూ వ్యతిరేక శక్తులు కూడా అంతగా తయారవుతున్నాయని అన్నారు. దీన్ని పసిగట్టి మన హిందూ ధర్మ ప్రచారానికి నారీశక్తి ముందువరుస లో ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఎమ్మెల్యే ను ఘనంగా సత్కరించారు. శ్రీ పిట్ల కృష్ణ మహారాజ్, శ్రీ మధుసూదన నంద సరస్వతి మహారాజ్ సనాతన ధర్మంపై లోతైన ప్రవచనాలు ఇచ్చి భక్తులకు ఆధ్యాత్మిక మార్గదర్శనం అందించారు. మహారాజుల ఉపదేశాలతో భక్తులందరూ మనోనిగ్రహం, భక్తి, సేవా స్ఫూర్తి సూత్రాలను ఆచరణలో పెట్టాలనే సంకల్పం వ్యక్తం చేశారు. భజన పరివార్ సభ్యులు చేసిన భజనలు, హారతులు, జపాలు గుట్ట అంతటా పవిత్రతను నింపాయి. కార్యక్రమ విజయవంతం కోసం కృషి చేసిన నిర్వాహక భక్తులకు, సేవకులకు అందరికీ మహారాజులు ఆశీర్వచనాలు అందించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు వైట్ల సుబ్బారావ్, ప్రముఖ వక్త లక్ష్మణరావు, మెగా. సుబేదార్, గణేష్, వీ హెచ్ పీ గంగా కిషన్, కాపర్తి గురుచరణ్, బీజేపీ నాయకులు మాజీ కార్పొరేటర్ ప్రభాకర్, మఠం పవన్, మారవార్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మౌలానా అబుల్ కలాం ఆజాద్ జీవితం ఆదర్శణీయం

- జిల్లా అదనపు కలెక్టర్ నగేష్

ప్రతిపక్షం, మెదక్ టౌన్, నవంబర్ 11: స్వాతంత్ర సమరయోధులు, భారత మొదటి విద్యాశాఖ మంత్రి, మౌలానా అబుల్ కలాం ఆజాద్ జీవితం ఆదర్శణీయమని అదనపు జిల్లా కలెక్టర్ నగేష్ అన్నారు. అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా కలెక్టరేట్‌లో మంగళవారం మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సంబంధిత అధికారులు, సిబ్బందితో కలసి అదనపు కలెక్టర్ నగేష్ అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆజాద్ జయంతి రోజును జాతీయ విద్యా దినోత్సవంగా నిర్వహిస్తారని తెలిపారు. కేంద్ర విద్యా శాఖా మంత్రిగా పని చేసి విద్యావ్యవస్థలో గణనీయమైన మార్పులు తీసుకవచ్చారని వివరించారు. విద్య ద్వారానే సర్వతోముఖాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. జర్నలిజంలో అపార అనుభవంతో ఉర్దూ పత్రికను నెలకొల్పి సమాజంలో నెలకొన్న రుగ్మతలను రూపుమాపేందుకు కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ భుజంగరావు, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, ఇన్చార్జి మైనారిటీ సంక్షేమ అధికారి విజయలక్ష్మి, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అందెశ్రీ విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలి

- నివాళులర్పించిన బీఆర్ఎస్ నాయకులు

ప్రతిపక్షం, హుస్నాబాద్, నవంబర్ 11: హుస్నాబాద్ పట్టణంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజా గాయకుడు, కవి అందెశ్రీకి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయనను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లికార్జున్ రెడ్డి మాట్లాడుతూ కవి అందెశ్రీ మరణం తెలంగాణ ప్రజలకు తీరని లోటని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఆయన కవిత్వం ప్రజల్లో ఆవేశం, చైతన్యం రేపిందని గుర్తుచేశారు. అందెశ్రీ స్ఫూర్తిని చిరస్థాయిగా నిలబెట్టేందుకు ఆయన విగ్రహాన్ని హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలని, అలాగే మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవ తీసుకొని సిద్దిపేట జిల్లా కేంద్రంలో కూడా విగ్రహం ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ పార్టీ తరపున డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆరెస్ పట్టణ అధ్యక్షులు అన్వర్ పాషా, మాజీ మున్సిపల్ ఛైర్మెన్ సుద్దాల చంద్రయ్య, పార్టీ నాయకులు ఆకుల వెంకట్, అయిలేని అనిత, బొజ్జ హరీష్, చిత్తారి శ్రీనివాస్, డాక్టర్ రవి, గోనెల మధుకర్, బొల్లి శ్రీనివాస్, కుతాటి భాస్కర్, అయూబ్ పాషా, మేకల వికాస్ యాదవ్, దొకొండ ప్రవీన్, యాస శ్రీనివాస్, పూదరి శ్రీనివాస్, పాకాల శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ హక్కుల సాధన సభకు 'చలో ఢిల్లీ'

- మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్న రాజు

ప్రతిపక్షం, చిగురుమామిడి, నవంబర్ 11: మండల కేంద్రంలోని బస్టాండ్ చౌరస్తాలో ఉన్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం ఎదుట జాతీయ మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి వెన్న రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎలుక ఆంజనేయులు, బొల్లుమల్ల రాజమౌళి ఆధ్వర్యంలో మంగళవారం రాజ్యాంగ హక్కుల సాధన సభ, చలో ఢిల్లీ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి వెన్న రాజు మాట్లాడుతూ... రాజ్యాంగ పరిరక్షణ సాధన సభను నవంబర్ 20న ఢిల్లీ జంతర్‌మంతర్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. అంబేద్కర్ అందించిన రాజ్యాంగం అమల్లోకి వచ్చి 77 సంవత్సరాలు గడిచినా పేద, దళిత వర్గాల జీవన స్థితి మారలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాల, అనుబంధ కులాల ప్రజలను పెద్ద ఎత్తున ఢిల్లీ చలో కార్యక్రమంలో పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి తమ డిమాండ్లు వినిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ ఇన్‌చార్జి ఆగే కిషోర్, మానకొండూరు ఇన్‌చార్జి లింగం కుమార్, చిగురుమామిడి మండల అధ్యక్షుడు రాకం కర్ణాకర్, రాగుల మోహన్, బొల్లుమల్ల రాజయ్య, మేదర పోచయ్య, బురికి రాజయ్య, కుట్ట చంద్రయ్య, మాసం సదికుమార్, వీసా అజయ్, దొంత కర్ణాకర్, జెల్లా ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దేశిని చిన్న మల్లయ్య వర్ధంతి

ప్రతిపక్షం, చిగురుమామిడి, నవంబర్ 11: ఇందుర్తి మాజీ శాసనసభ్యులు దేశిని చిన్న మల్లయ్య 8వ వర్ధంతి కార్యక్రమాన్ని ఆయన స్వగ్రామమైన బొమ్మనపల్లిలో ఘనంగా నిర్వహించారు. కుటుంబ సభ్యులు, గ్రామ గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మల్లయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా గౌడ సంఘం నాయకులు మాట్లాడుతూ... దేశని చిన్న మల్లయ్య నాలుగుసార్లు ఇందుర్తి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించి ప్రజలకు విశేష సేవలందించారని గుర్తు చేశారు. బొమ్మనపల్లి గ్రామ సర్పంచ్‌గా కూడా నాలుగుసార్లు ఎన్నికై గ్రామ అభివృద్ధికి కృషి చేశారని, ఎస్సీ, బీసీ సంక్షేమ హాస్టల్లు, పలు అభివృద్ధి కార్యక్రమాలు ఆయన ఆధ్వర్యంలో అమలయ్యాయని తెలిపారు. మల్లయ్య అన్ని వర్గాల ప్రజలతో మమేకమై జీవించారని, కమ్యూనిస్టు ఉద్యమం, ప్రత్యేక తెలంగాణ ఉద్యమాల్లో ఆయన పాత్ర చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ ప్రజాసేవలో ముందుకు సాగుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో స్వర్గీయ మల్లయ్య సతీమణి రాజవ్వ, కుమారులు లక్ష్మణ్, కుమార్, కూతురు ఎల్లవ్వ, గ్రామ గౌడ సంఘం అధ్యక్షులు వీరగోని విజ్జగిరి, దేశని రాజయ్య, తాళ్లపల్లి సత్యం, చంద్రయ్య, తాళ్లపల్లి కుమార్, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

"



మోదీ, చంద్రబాబు, పవన్ కలిసి రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నారు. వాటర్‌షెడ్ పథకం కింద గుంటూరు(D) వెంగళాయపాలెం చెరువు పునరుద్ధరణ పనుల ద్వారా భూగర్భజలాలు పెరగడంతోపాటు పశువులకు తాగునీరు లభిస్తుంది. ఇదే తరహాలో దేశవ్యాప్తంగా చెరువులను అభివృద్ధి చేస్తాం. మధ్యప్రదేశ్ ప్రజలు నన్ను మామ అంటారు. ఇకపై ఏపీ వారికీ మామనే.
-కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్

ఘనంగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి

ప్రతిపక్షం, హనుమకొండ, నవంబర్ 11: హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో జాతీయ విద్యా దినోత్సవం, స్వాతంత్ర్య సమరయోధుడు, దేశ తొలి విద్యాశాఖ మంత్రి, భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి కార్యక్రమాన్ని మంగళవారం జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి రోజైన నవంబర్ 11న జాతీయ విద్యా దినోత్సవాన్ని ప్రతి ఏటా నిర్వహిస్తారు. దేశ తొలి విద్యాశాఖ మంత్రి అయిన మౌలానా అబుల్ కలామ్ దేశంలో విద్యాభివృద్ధికి బాటలు వేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వై.వి.గణేష్, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి కె.ఏ. గౌస్ హైదర్, వివిధ శాఖల అధికారులు, కలెక్టరేట్ ఉద్యోగులు పాల్గొన్నారు.

రుచి కరమైన భోజనాన్ని అందించాలి

- విద్యార్థులతో కలిసి భోజనం చేసిన పేట కలెక్టర్

ప్రతిపక్షం ప్రతినిధి, నారాయణపేట్, నవంబర్ 11: విద్యార్థులకు నాణ్యతతో కూడిన రుచికరమైన మధ్యాహ్న భోజనాన్ని అందించాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. మంగళవారం ఆమె మక్తల్ పట్టణంలోని మహాత్మా జ్యోతిబా పూలె పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అదే సమయంలో పాఠశాలలో నిర్వహిస్తున్న మౌలానా అబ్దుల్ కలామ్ ఆజాద్ జయంతి (జాతీయ విద్యా దినోత్సవం) వేడుకల్లో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు అజాద్ జయంతి గురించి స్పీచ్ లు ఇచ్చారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.పదవ తరగతి సిలబస్ ఇప్పటివరకు ఎంత వరకు పూర్తి అయిందని విద్యార్థులను ద్వారా తెలుసుకున్నారు. ఏ సబ్జెక్ట్ చదవడానికి కష్టం అవుతుందని ప్రశ్నించారు. గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం మెరుగైన ఫలితాలు సాధిస్తామని విద్యార్థులు తెలపగా అందులో 20 మంది విద్యార్థులు 550 పై మార్కులకు పైగా సాధిస్తామన్నారు. తర్వాత భోజన సదుపాయల పై కలెక్టర్ ఆరా తీశారు. రోజూ ఉదయం ఎన్ని గంటలకు లేస్తారని లేచాక ఏమి చేస్తారని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల ఫ్యూచర్ ప్లానింగ్ గురించి ఒక్కొక్కరిని అడిగారు. వసతి గృహంలో ఏమైనా సమస్యలు ఉంటే చెప్పాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులకు వండిన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.మధ్యాహ్న భోజన నాణ్యత, రుచిని తెలుసుకునేందుకు విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో మక్తల్ తహసిల్దార్ సతీష్ కుమార్, ఎంపీడీవో, రెవెన్యూ అధికారులు, వసతి గృహ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ కి సీసీ కెమెరాలు

ప్రతిపక్షం ప్రతినిధి, నారాయణపేట్, నవంబర్ 11: భీష్మ రాజ్ ఫౌండేషన్ ఛైర్మన్ డాక్టర్ కె.రాజ్ కుమార్ రెడ్డి జన్మదినం సందర్భంగా దన్వాడ తెలంగాణ మోడల్ స్కూల్ లో సొంత నిధులతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించి, ప్రారంభించిన భీష్మ రాజ్ ఫౌండేషన్ ఛైర్మన్ డాక్టర్ కె.రాజ్ కుమార్ రెడ్డి. ఈ కార్యమంలో స్కూల్ ప్రిన్సిపాల్ వైశాలి వ్యాస్, మణి మాల మేడం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతు బంధు, బోనస్ ఎగ్గొట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం

- మరోసారి రైతులను మభ్యపెట్టడానికి కొనుగోలు కేంద్రాలు
- బీఆర్ఎస్ జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్



ప్రతిపక్షం, వనపర్తి ప్రతినిధి, నవంబర్ 11: రైతులు పండించిన ధాన్యం కోసం ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిన రైతులకు ఎటువంటి ప్రయోజనం జరగడం లేదని, గతంలో బకాయిపడ్డ డబ్బులు చెల్లించలేని దుస్థితిలో ప్రభుత్వం ఉన్నదని బిఆర్ఎస్ జిల్లా అధికార ప్రతినిధి.వాకిటి శ్రీధర్ ఘాటుగా విమర్శించారు.ఈ సందర్భంగా పాలకులకు,అధికారులకు కొనుగోలు కేంద్రాలపై స్పష్టమైన అవగాహన లేదని,తలోమాట మాట్లాడడం వల్ల రైతులు గందరగోళంలో ఉన్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.వరి,మొక్కజొన్న పంటల ఉత్పతి బాగా పెరిగిందని,మద్దతు ధర లేక మిల్లర్ల దగ్గరకు వెళితే రూ.1600లు అడుగుతున్నారని.. గత్యంతరం లేని పరిస్థితుల్లో రైతులు నష్టపోతున్నారని మండిపడ్డారు.వర్షాలు పెరిగి ఈసారి 2లక్షల పైగా ఎకరాల్లో వరి సాగు చేశారని,ప్రభుత్వం అంచనా వేసి తగు ఏర్పాట్లతో పాటు..మద్దతు ధర,బోనస్ ఇచ్చి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.రైతులకు రెండుసార్లు రైతు బంధు ఎగ్గొట్టారని,రుణ మాఫి కూడా చేయకుండా ,బోనస్ ఇవ్వకుండా రైతులను అరిగోస పెడుతున్నారని... ఇప్పటికైనా ప్రభుత్వం రైతులకు అండగా నిలవాలని కోరారు.

నిర్మల్‌లో మౌలానా ఆజాద్ క్లాక్ టవర్ నిర్మాణానికి కృషి

- నిర్మల్ మార్కెట్ కమిటీ చైర్మన్ సోమా భీమ్ రెడ్డి

ప్రతిపక్షం, నిర్మల్, నవంబర్ 11: నిర్మల్ లో మౌలానా అబుల్ కలాం ఆజాద్ స్మారక క్లాక్ టవర్ నిర్మాణానికి కృషి చేయడం జరుగుతుందని మార్కెట్ కమిటీ చైర్మన్ సోమా భీంరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మౌలానా ఆజా చౌక్ లోని స్మారక క్లాక్ టవర్ ముందర కలాం గుణం ఎడ్యుకేషనల్ అండ్ యూత్ వెల్ఫేర్ సొసైటీ నిర్మల్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో మౌలానా ఆజాద్ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి పలువురు ఘనంగా నివాళులు అర్పించారు. తమ ప్రభుత్వాహయంలో మైనార్టీల సంక్షమానికి సముచిత ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతున్నదని చెప్పారు. మౌలానా ఆజాద్ క్లాక్ టవర్ నిర్మాణానికి స్థానిక డిసిసి అధ్యక్షునితో సంప్రదించి తక్షణమే నిర్మాణ పనులు పూర్తి అయిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని చెప్పారు. సొసైటీ జిల్లా అధ్యక్షులు వ్యవస్థాపకులు మొహమ్మద్ ఉస్మాన్ మాట్లాడుతూ 23 సంవత్సరాలుగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ ద్ స్మారకార్థం పలు సేవ కార్యక్రమాలను నిర్వహిస్తూ ఫ్లాట్ టవర్ నిర్మాణం కోసం ఎదురుచూస్తున్నామన్నారు. ఇందులో పలువురు ఆయా రాజకీయ పక్షాల నాయకులు ప్రజా ప్రతినిధులు, సొసైటీ బాధ్యులు ఉన్నారు.

పత్తి, ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి

- పుల్కల్ లో ధాన్యం కొనుగోలు కేంద్రం తనిఖీ చేసిన కలెక్టర్

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 11 : ధాన్యం, పత్తి కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అన్నారు. మంగళవారం కలెక్టర్ పి. ప్రావీణ్య మండల కేంద్రమైన పుల్కల్ లో సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో పరిశీలించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రం కు వచ్చిన ధాన్యం వివరాలు ఇప్పటివరకు తూకం వేసి మిల్లులకు పంపిన ధాన్యం వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రం కు వచ్చిన ధాన్యం సరైన తేమ శాతం ఉన్న ధాన్యం తూకం వేసి వెంటనే మిల్లులకు పంపించాలని సిబ్బందికి సూచించారు రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకోవాలన్నారు. మండలంలోని హార్వెస్టర్ యజమానులతో సమావేశం నిర్వహించి ఆర్పిఎం ఎక్కువగా ఉంచి హార్వెస్టర్లు నడిపేలా అవగాహన కల్పించాలని తాసిల్దార్ కు సూచించారు. ఆర్పిఎం ఎక్కువగా ఉంచితే ధాన్యం లో తాలు రాదని కలెక్టర్ తెలిపారు. ఈ విషయంపై హార్వెస్టర్ యజమానులకు రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ, రెవెన్యూ శాఖ అధికారులకు సూచించారు. అనంతరం గ్రామ శివారులోని కోదండ రామా ఇండస్ట్రీస్ లో ఏర్పాటు చేసిన సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రంలో పత్తి కొనుగోలు ప్రక్రియను అడిగి తెలుసుకున్నారు రైతులకు నూతన పత్తి కొనుగోలు విధానం పైఅవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ,అధికారులకు మార్కెటింగ్ శాఖ అధికారులకు కలెక్టర్ సూచించారు. రైతులు కిసాన్ కంపాస్ యాప్ స్లాట్ బుక్ చేసుకొని అందులో సూచించిన విధంగా నిర్ణీత సమయానికి సీసీఐ కొనుగోలు కేంద్రానికి పత్తిని తీసుకురావాలని సూచించారు.

పదవ తరగతిలో శతశాతం ఫలితాలు సాధించాలి : కలెక్టర్ పి ప్రావీణ్య.

పుల్కల్ మండల పర్యటనలో భాగంగా సింగూరు లోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను (బాలుర) ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల తరగతి గదులను కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు . విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ పరీక్షలంటే ఉండే భయాన్ని తొలగించాలని కలెక్టర్ ఉపాధ్యాయులకు సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పాఠశాలలోని స్టోర్ రూమ్ను డైనింగ్ హాల్ను కిచెన్ షెడ్ ను పరిశీలించారు. నాణ్యమైన ఆహారాన్ని అందించాలని ఆదేశించారు.ఆహార పదార్థాలు కలుషితం కాకుండా అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బియ్యం సంచుల కింద బియ్యం తడవకుండా చెక్కలు వేసి వాటిపై బియ్యం సంచులు నిల్వ ఉంచాలని సిబ్బందికి సూచించారు. పాఠశాలలోని విద్యార్థుల కోసం వచ్చిన స్కూలు యూనిఫామ్ క్లాత్ ను వెంటనే పంపి యూనిఫామ్స్ కుట్టించాలని సిబ్బందికి సూచించారు. పాఠశాలల్లో తాగునీటి వసతి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి అయినట్లు కలెక్టర్ హామీ ఇచ్చారు.

ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణం వేగవంతం చేయాలి.

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పనులు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అన్నారు . పుల్కల్ మండలం గొంగ్లూర్ గ్రామంలో నిర్మిస్తున్న ఇందిర ఇండ్లు కలెక్టర్ పరిశీలించారు. ఇండ్ల నిర్మాణం స్థాయినిబట్టి వెంట వెంటనే బిల్లులు మంజూరయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. మండలానికి మంజూరైన ఇండ్లు ఇప్పటివరకు నిర్మాణం లో ఏ దశల్లో ఉన్నాయో అధికారులు అడిగితెలుసుకున్నారు. ఇండ్ల నిర్మాణం పనులు వేగవంతం అయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆందోల్ ఆర్ డి ఓ పాండు, సంబంధిత శాఖల అధికారులు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మహనీయుడు మౌలానా అబుల్ కలామ్ ఆజాద్

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 11 : భారతరత్న మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ జయంతి సందర్భంగా మంగళవారం సంగారెడ్డి జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఘనంగా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా అదనపు కలెక్టర్ మాధురి హాజరై, మౌలానా ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి ఆయనకు ఘనమైన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాధురి మాట్లాడుతూ భారత తొలి విద్యాశాఖ మంత్రి, స్వాతంత్ర్య సమరయోధుడు ,మహా విద్యావేత్త మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని దేశవ్యాప్తంగా ప్రతి సంవత్సరం నవంబర్ 11 ను జాతీయ విద్యా దినోత్సవం గా జరుపుకోవడం జరుగుతుందన్నారు. మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ భారత స్వాతంత్ర్య ఉద్యమంలో మాత్రమే కాకుండా విద్యారంగ అభివృద్ధికి కూడా విశేష సేవలు అందించారని పేర్కొన్నారు. ఆయన దూరదృష్టి ఫలితంగానే భారతదేశంలో విద్యా విస్తరణకు పునాదులు వేశారని, దేశ యువత ఆయన ఆలోచనలను స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారిణి విశాలాక్షి, డి.ఆర్.ఓ పద్మజ రాణి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్,లు కలెక్టరేట్ సిబ్బంది, సామాజిక సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యే సమాజ అభివృద్ధికి మూలం

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 11 : మహాత్మా జ్యోతిబా బాలుర పాఠశాల, సంగారెడ్డిలో ఈ రోజు జాతీయ విద్యా దినోత్సవం కార్యక్రమాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, సంగారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ అవగాహన శిబిరం ప్రధాన జిల్లా మరియు సెషన్స్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్‌పర్సన్ జి. భవాని చంద్ర ఆదేశాల మేరకు నిర్వహిచారు. కార్యక్రమానికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి బి. సౌజన్య ప్రధాన అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా సౌజన్య మాట్లాడుతూ భారత తొలి విద్యా మంత్రి మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ సేవలను స్మరించి, విద్య ప్రతి వ్యక్తికి మౌలిక హక్కు మాత్రమే కాకుండా సమాజ అభివృద్ధికి మార్గదర్శక శక్తి అని వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్. ధన్‌రాజ్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వరి కొనుగోలు కేంద్ర్రాలను పరిశీలించిన కలెక్టర్

ప్రతిపక్షం ప్రతినిధి, నారాయణపేట్, నవంబర్ 11: మక్తల్ నియోజకవర్గంలోని మాగనూర్ మండలం, అడివి సత్యారం గ్రామ పంచాయతీ లో గల వరి కొనుగోలు కేంద్రాన్ని మంగళ వారం జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ పరిశీలించారు. కేంద్రానికి ఇప్పటి వరకు ఎన్ని క్వింటాళ్ల ధాన్యం విక్రయానికి వచ్చిందని అడిగి తెలుసుకున్నారు. సన్న రకం బియ్యం సెంటర్ లో గన్ని బ్యాగ్ లు ఎన్ని ఉన్నాయని కలెక్టర్ ప్రశ్నించగా, 15 వేల బ్యాగ్స్ అందుబాటులో ఉన్నాయని నిర్వాహకులు కలెక్టర్ కు తెలిపారు. అనంతరం, కలెక్టర్ మాగనూరు మండలం అమ్మ పల్లి, వడ్వాట్, గుడే బల్లూరు అడివి సత్యారం పంచాయతీ పరిధి లోని పీఏసీఎస్ వరి ధన్య కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఈ వారం రోజుల్లో హార్వెస్టింగ్ ఎంత ఉంటుందని అడిగి తెలుసుకున్నారు. ఎన్ని బస్తాలు ఉన్నాయని అడగగా వారానికి 5000 బ్యాగ్ ల బ్యాగులు వస్తాయని, ఒక లారీలో 800 ల బస్తాలు వస్తాయని అక్కడి సిబ్బంది తెలిపారు. రెండేసి కేంద్రాలు ఉన్న చోట కూలీలను పురమాయించాలని ఆమె సూచించారు. గుడేబల్లురు కేంద్రం నుంచి ఇప్పటి వరకు 1776 ధాన్యం బస్తాలను మిల్లులకు తరలించడం జరిగిందని సిబ్బంది చెప్పారు. అన్ని కేంద్రాలలో తప్పనిసరిగా వివరాలను ట్యాబ్ లలో నమోదు చేయాలని, కొనుగోళ్లకు సంబంధించిన అన్ని వివరాలను రిజిస్టర్ లో నమోదు చేయాలన్నారు. ముఖ్యంగా కేంద్రాలలో రైతులకు ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. ప్రతి అధికారి స్థానికంగా ఉండాలన్నారు. సన్న రకం బియ్యం బస్తాలపై ఎస్ అని రాయాలన్నారు. అలాగే సంచులలో ధ్యానం నింపిన తరవాత ఎర్ర దారంతో సంచులను కుట్టించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో మాగానూరు తహసిల్దార్, ఎంపీడీఓ, సంబంధిత ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

మక్కల కొనుగోలును మరింత వేగవంతం చేయాలి

- కలెక్టర్ స్నేహ శబరీష్

ప్రతిపక్షం, హనుమకొండ, నవంబర్ 11: కొనుగోలు కేంద్రాలకు వచ్చిన మక్కల (మొక్కజొన్నల) కొనుగోళ్ల ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం నందనంలోని ఫార్మర్ సర్వీస్ కోఆపరేటివ్ సొసైటీ (పిఎసిఎస్)లో నిర్వహిస్తున్న మక్కల కొనుగోళ్ల ను జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి పరిశీలించారు. మక్కల కొనుగోలు కేంద్రానికి ఇప్పటివరకు ఎంతమంది రైతులు మక్కలను తీసుకువచ్చారని, ఇప్పటివరకు ఎంత కొనుగోలు చేశారని, ఇంకా ఎంత పంట ఉత్పత్తి రానుందని, అధికారులు, నిర్వాహకులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. వరి ధాన్యం పరిశీలించి కొనుగోలు ప్రక్రియ గురించి అడిగి తెలుసుకున్నారు. అక్కడ ఉన్న మొక్కజొన్న రైతులతో కలెక్టర్ మాట్లాడారు. కేంద్రంలోనికి రైతులు తీసుకువచ్చిన మక్కలను పరిశీలించి రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ సొసైటీ ద్వారా వరి ధాన్యము కొనుగోలును ప్రారంభించాలన్నారు. మక్కల కొనుగోలు కేంద్రానికి మక్కలను తీసుకువచ్చే రైతులు నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. ఇంకా మొక్కజొన్న పంటలు వేసుకున్న రైతులు ఆన్లైన్లో నమోదు చేసుకోనట్లయితే వెంటనే వారి వివరాలు నమోదు చేయాలని మండల వ్యవసాయ అధికారికి సూచించారు. మొక్కజొన్నలు, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు సంబంధించి జిల్లా కలెక్టర్ పలు సూచనలు చేశారు.

ఎఫ్ ఎస్ సీ ఎస్ మార్ట్ ను సందర్శించిన కలెక్టర్

ఐనవోలులోని నందనం ఫార్మర్స్ సర్వీస్ కో ఆపరేటివ్ సొసైటీ రూరల్ మార్ట్ ను హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి సందర్శించారు. మార్ట్ ద్వారా ఏయే వస్తువుల విక్రయాల ను చేపడుతున్నారనే వివరాలను నిర్వాహకులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా సహకార అధికారి సంజీవరెడ్డి, తహసీల్దార్ విక్రమ్ కుమార్, మార్క్ ఫెడ్ డిఎం శ్యామ్, మండల వ్యవసాయ అధికారి సునీల్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధిలో ఏపీ బ్రాండ్‌ను మళ్లీ తీసుకొస్తున్నాం. ప్రతి ఇంట్లో ఓ పారిశ్రామికవేత్త ఉండాలనేది తమ లక్ష్యం. వైసీపీ పాలనలో బెదిరింపులతో పారిశ్రామికవేత్తలు పారిపోయారు. మా హయాంలో పెట్టుబడుల వెల్లువ కొనసాగుతోంది. యువతకు 20 లక్షల ఉద్యోగాలు ఇస్తాం. ప్రతి 50కి.మీలకు ఒక పోర్టు నిర్మిస్తాం.

- ఏపీ సీఎం చంద్రబాబు

విశ్వ వీక్షణం

పాక్ రాజధాని ఇస్లామాబాద్‌లో పేలుడు

- ఆత్మాహుతి దాడిలో 12 మంది మృతి

ఇస్లామాబాద్ (పాకిస్తాన్), నవంబర్ 11: పాకిస్తాన్‌లో మరోసారి ఉగ్రవాదులు రెచ్చిపోయారు. రాజధాని ఇస్లామాబాద్‌లో భారీ పేలుడు సంభవించింది. ఉగ్రవాదులు జరిపిన ఈ ఆత్మాహుతి దాడిలో 12 మంది మృతి చెందగా, సుమారు 20 మంది గాయపడ్డారు. మంగళవారం జ్యుడీషియల్ కాంప్లెక్స్ సమీపంలో ఈ ఘోర పేలుడు సంభవించింది. మధ్యాహ్నం 12.30 సమయంలో కోర్టు గేటు వద్ద పార్క్ చేసిన ఓ కారులో పేలుడు జరిగింది. కారులో గ్యాస్ సిలిండర్‌ను అమర్చి పేల్చినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలిందని అధికారులు తెలిపారు. పేలుడు తీవ్రంగా ఉండటంతో పలు వాహనాలు కూడా ధ్వంసమయ్యాయి. మృతులు, క్షతగాత్రులలో ఎక్కువ శాతం న్యాయవాదులు, కోర్టులో పని చేస్తున్న సిబ్బంది ఉన్నట్లు తెలుస్తోంది. ఈ దాడి జరిగిన వెంటనే రెస్క్యూ సిబ్బంది ఘటనాస్థలికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టాయి. భద్రతా బలగాలు ఈ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకొని తనిఖీలు చేపట్టాయి. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. దాడికి సంబంధించి బాధ్యత వహిస్తూ ఏ ఉగ్రవాద సంస్థ ఇంతవరకు ప్రకటన చేయలేదు.

ఉగ్రవాదుల కుట్ర మూలాలను ఛేదిస్తాం

- ఎవ్వరినీ వదిలేది లేదన్న భారత ప్రధాని మోడీ

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, భూటాన్, నవంబర్ 11: ఢిల్లీ పేలుడు ఘటనను ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తీవ్రంగా ఖండించారు. ప్రస్తుతం భూటాన్ పర్యటనలో ఉన్న ప్రధాని అక్కడ మంగళవారం నిర్వహించిన ఓ సమావేశంలో మాట్లాడారు. ఉగ్ర కుట్ర మూలాలను ఛేదిస్తామని వెల్లడించారు. దీనికి బాధ్యులైన కుట్రదారులను వదిలే ప్రసక్తే లేదన్నారు. ఢిల్లీ పేలుడు ఘటన తనను కలచివేసిందన్నారు. ఈ మేరకు మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.ఢిల్లీలోని ఎర్రకోట వద్ద జరిగిన దాడి ఘటన తనను కలచివేసిందని. దాడికి పాల్పడిన నిందితులను ఎట్టి పరిస్థితులలోనూ వదిలిపెట్టబోమని ప్రధాని హెచ్చరించారు. ఈ ఘటనపై విచారణ ముమ్మరంగా సాగుతోందని చెప్పారు. అక్కడ అమాయకుల ప్రాణాలు తీసినవారిని కనిపెట్టి చట్టం ముందు నిలబెడతామన్నారు. పేలుడులో ప్రాణాలు కోల్పోయిన మృతుల కుటుంబాలకు సంతాపం తెలియజేశారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రధాని ఆకాంక్షించారు. ఈ ఘటనపై ఎప్పటికప్పుడు సమీక్ష చేస్తున్నట్లు ప్రధాని వెల్లడించారు.

ఆఫీసులో పని చేస్తున్న సమయంలో మనకు తరచూ ఆకలి వేస్తుంటుంది. ఇటువంటి సమయాల్లో మనం సాధారణంగా చిప్స్, బిస్కెట్లు లేదా ఇతర ప్యాక్ చేసిన ఆహారాలను తరచుగా ఆశ్రయిస్తాం. వీటిని ఎక్కువగా తినడం వల్ల ఊబకాయం, మధుమేహం, ఇతర ఆరోగ్య సంబంధిత సమస్యలు వస్తాయని తెలుసు అయినా తింటుంటాం.. మరి అటువంటి స్నాక్స్‌తో అనారోగ్యం కొనితెచ్చుకునేకంటే.. మనమే ఇంట్లో ఆరోగ్యవంతమైన చిరుతిళ్లను నిమిషాల్లో తయారు చేసుకోవచ్చు..

ఈ చిరుతిళ్లు.. హెల్దీ గురూ!!

ఆఫీసులో పని చేస్తున్నప్పుడు కొంచెం ఆకలిగా అనిపించడం మామూలే. చాలా మంది ప్రజలు ఇంటి నుండి ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకువస్తారు, కానీ ఇప్పటికీ అప్పుడప్పుడు ఏదో తినాలని భావిస్తారు. ఈ చిన్న ఆకలిని నిర్లక్ష్యం చేస్తే, అది అలసట మరియు చిరాకుకు దారితీస్తుంది. పని సమయంలో చిప్స్, బిస్కెట్లు మరియు వేఫర్‌లు తినడం వల్ల చాలా కేలరీలు ఉన్నందున నిద్రలేమికి కారణమవుతుంది.అంతే కాదు ఇలా తినడం వల్ల మన ఆరోగ్యంపై చెడు ప్రభావం పడుతుంది. అందువల్ల, ఈ ఆఫీసు ఆకలిని తీర్చడానికి, ఆరోగ్యకరమైన మరియు పోషకమైన స్నాక్స్ ఎంచుకోవడం చాలా ముఖ్యం. ఆరోగ్యానికి కూడా మేలు చేసే స్నాక్స్‌గురించి తెలుసుకుందాం.

మిక్స్‌డ్ నట్స్

బాదం, వాల్‌నట్, జీడిపప్పు వంటి మిక్స్‌డ్ నట్స్‌లో ప్రోటీన్, ఆరోగ్యకరమైన కొవ్వులతో పాటు ఫైబర్ పుష్కలంగా ఉంటాయి. ఇవి ఆకలిని తీర్చడమే కాకుండా మానసిక ఆరోగ్యానికీ మేలు చేస్తాయి. ఇలాంటి మిక్స్‌డ్ నట్స్‌తో ఒక రోజంతా శక్తివంతంగా ఉండడానికి వీలు పడుతుంది.

ఫ్రూట్, నట్ బటర్స్

మీరు ఆపిల్ లేదా అరటిపండు ముక్కలపై ఒక చెంచా వేరుశెనగ బటర్ లేదా బాదం బటర్‌అప్లై చేయడం ద్వారా రుచికరమైన పోషకాలతో కూడిన చిరుతిండిని సిద్ధం చేసుకోవచ్చు. నట్ బటర్‌లో ప్రోటీన్ తో పాటు ఆరోగ్యకరమైన కొవ్వులు ఉంటాయి, ఇవి మిమ్మల్ని చాలా సేపటి వరకు పాటు శక్తివంతంగా ఉంచుతాయి.

యోగర్ట్, బెర్రీలు

పెరుగు ప్రోటీన్ యొక్క అద్భుతమైన మూలం. బ్లూబెర్రీస్, స్ట్రాబెర్రీలు వంటి తాజా బెర్రీలను జోడించడం ద్వారా మీరు రుచికరమైన, పోషకమైన చిరుతిండిని తయారు చేసుకోవచ్చు. బెర్రీస్‌లో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి, ఇవి శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడతాయి.

వెజిటబుల్ స్టిక్స్

క్యారెట్ , దోసకాయ లేదా క్యాప్సికమ్ ముక్కలను హమ్మస్‌తో ముంచి తినడం స్నాక్స్‌లో ఒక మంచి ఎంపిక. పోషకాలకు పోషకాలు.. రుచికి రుచినీ ఆస్వాదించవచ్చు. హమ్మస్ చిక్‌పీస్ నుండి తయారవుతుంది. ఇందులో ప్రోటీన్ మరియు ఫైబర్ పుష్కలంగా ఉంటుంది.

ఓట్‌మీల్ బార్లు

ఇంట్లో తయారుచేసిన ఓట్ మీల్ బార్లలో ఫైబర్, ప్రోటీన్, శక్తి పుష్కలంగా ఉంటాయి. మీరు వాటిని వివిధ రకాల గింజలు, ఎండిన పండ్లతో తయారు సుకోవచ్చు. ఈ బార్లు పని సమయంలో తీన్నారంటే రోజంతా మిమ్మలిని హుషారుగా ఉంచుతాయి.

పాప్‌కార్న్

ఆలివ్ నూనెలో తేలికగా కాల్చిన పాప్‌కార్న్ తక్కువ కేలరీలతో పాటు ఫైబర్‌రిచ్ అల్పాహారం. మీరు దీనికి కొద్దిగా ఉప్పు, రుచి కోసం ఇతర మసాలా పొడులను కూడా జోడించవచ్చు.

చియా పుడ్డింగ్

మీరు చియా గింజలను పాలు లేదా పెరుగులో నానబెట్టి చియా పుడ్డింగ్ చేయవచ్చు. తాజా పండ్లను కూడా జోడించడం ద్వారా మీరు దీన్ని మరింత రుచికరంగా చేయవచ్చు. చియా గింజలు ఒమేగా3 కొవ్వు ఆమ్లాలు, ఫైబర్ పుష్కలంగా కలిగి ఉంటాయి.. ఇవి ఆరోగ్యకరం.

కాల్చిన శనగలు

కాల్చిన శనగలలో ప్రోటీన్, ఫైబర్ పుష్కలంగా ఉంటాయి. ఇవి తింటే చాలా సేపు కడుపు నిండుగా ఉన్న అనుభూతిని కలిగిస్తాయి. వీటికి వివిధ రకాల మసాలాలు, సలాడ్స్ కూడా జోడించి తినవచ్చు.

అవోకాడో టోస్ట్

బ్రౌన్ బ్రెడ్‌పై మెత్తని అవకాడోను పూయడం ద్వారా రుచికరమైన, పోషకాలతో కూడిన స్నాక్స్ నిమిషాల్లో రెడీ చేసుకోవచ్చు. అవకాడోలో ఆరోగ్యకరమైన కొవ్వులు ఉంటాయి, ఇవి మీ గుండె ఆరోగ్యానికి మేలు చేస్తాయి.

డార్క్ చాక్లెట్ నట్స్

కొన్ని డార్క్ చాక్లెట్‌కు వివిధ రకాల గింజలను జోడించడం ద్వారా రుచికరమైన మరియు శక్తినిచ్చే చిరుతిండిని తయారు చేసుకోవచ్చు. డార్క్ చాక్లెట్ లో ఉండే యాంటీఆక్సిడెంట్లు శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడతాయి. గింజలలో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది.

సందర్శకులకు ఎర్రకోట సందర్శన బంద్

- బాంబు పేలుడు నేపథ్యంలో అధికారుల నిర్ణయం

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, నవంబర్ 11: దేశ రాజధాని ఢిల్లీలో ఉన్న ఎర్రకోట సమీపంలో సోమవారం రాత్రి ఏడు గంటలకు కారు పేలుడు ఘటన జరిగిన విషయం తెలిసిందే. ఆ పేలుడు ధాటికి 12 మంది మృతిచెందగా, 20 మంది వరకు గాయపడ్డారు. ఈ నేపథ్యంలో ఎర్రకోటను బంద్ చేశారు. రాబోయే మూడు రోజులపాటు సందర్శకులకు ప్రవేశం ఉండదని అధికారులు చెప్పారు. ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా దీనిపై ఓ ప్రకటన చేసింది. కారు బాంబు పేలుడు జరిగిన ప్రదేశంలో ప్రస్తుతం ఫోరెన్సిక్ ఇన్వెస్టిగేషన్ జరుగుతున్నదని వెల్లడించింది. ప్రజలు భారీస్థాయిలో గుమ్మికూడే అవకాశం ఉన్న నేపథ్యంలో ఎర్రకోటను బంద్ చేస్తున్నట్లు ఏఎస్ఐ ప్రకటించింది. పేలుడుకు, ఫరీదాబాద్ టెర్రర్ మాడ్యూల్‌కు లింకు ఉన్నట్లు ప్రాథమిక విచారణ ద్వారా వెల్లడవుతున్నది. పేలుడు కోసం డిటోనేటర్లు వాడినట్లు అనుమానిస్తున్నారు. అమోనియం నైట్రేట్ రసాయనం వాడి ఉంటారని భావిస్తున్నారు. సూసైడ్ బాంబర్ డాక్టర్ ఉమర్ మహమ్మద్ పేలుడుకు ముందు తన కారును ఎర్రకోట పార్కింగ్ ఏరియాలో సుమారు మూడు గంటల పాటు పార్కింగ్ చేశాడు. పేలుడు విచారణ చేపడుతున్న పోలీసులు పుల్వామాలో ఉన్న డాక్టర్ ఉమర్ ఫ్యామిలీని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనతో లింకున్న నలుగురిని ఇప్పటి వరకు అరెస్టు చేశారు. రెడ్‌ఫోర్ట్ మెట్రో స్టేషన్‌ను మంగళవారం మూసివేశారు.

భారీగా పెరిగిన ఎమ్మెల్యేల ఆస్తులు

- సమగ్ర నివేదిక విడుదల చేసిన ఏడీఆర్

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, నవంబర్ 11: ఒకప్పుడు ప్రజాసేవ చేసేవారంతా ఉదారంగా ఉండేవారు. నిరాడంబర జీవితం గడిపేవారు. వివాదాల జోలికి వెళ్లేవారు కాదు.' సంపాదించుకోవాలి, తరాలకు సరిపడా దాచుకోవాలి, అడ్డగోలుగా దోచుకోవాలి' అని అనుకునేవారు కాదు. కానీ, ఇప్పుడు పరిస్థితి మారిపోయింది. దాచుకోవడం పెరిగిపోయింది. దోచుకోవడం ఒక స్థాయి దాటిపోయింది. రాజకీయాలలోకి తమ కుటుంబ సభ్యులను తీసుకురావడం అధికమైపోయింది. దేశవ్యాప్తంగా ఈ పరిస్థితి ఉన్నప్పటికీ, తెలుగు రాష్ట్రాలలో అది తీవ్రంగా ఉంది. పలు రాష్ట్రాల ఎమ్మెల్యేల ఆస్తులపై ఏడీఆర్ నివేదిక విడుదల చేసింది. దీని ప్రకారం ఆంధ్రప్రదేశ్ ఎమ్మెల్యేల ఆస్తులు 11,323 కోట్లు అని తేలింది. తెలంగాణ రాష్ట్రంలో ఎమ్మెల్యేల ఆస్తులు 4,637 కోట్లు ఉన్నట్టు తెలుస్తోంది. కర్ణాటక రాష్ట్రంలో ఎమ్మెల్యేలకు 14,179 కోట్ల ఆస్తులు ఉన్నట్టు తెలుస్తోంది.

దేశంలో మొత్తం 119 మంది బిలియనీర్ ఎమ్మెల్యేలు ఉన్నారు. ఇందులో కర్ణాటక నుంచి 31 మంది, ఆంధ్రప్రదేశ్ నుంచి 27 మంది ఉన్నారు. మెజారిటీ ఎమ్మెల్యేలకు ఎక్కువగా మైనింగ్,ఇతర వ్యాపారాలు ఉన్నాయి. చాలా మంది ఎమ్మెల్యేలు కాంట్రాక్టులు నిర్వహిస్తున్నారు. ఆర్థికంగా స్థిరత్వం ఎక్కువగా ఉన్నవారు రాజకీయాలకు వస్తున్నారు. సంపాదనను పెంచుకుంటున్నారు. అందువల్లే ఈ స్థాయిలో వారికి ఆస్తులు పెరుగుతున్నాయని ఏడీఆర్ నివేదికలో పేర్కొంది. ఆస్తులు ఈ స్థాయిలో పెరుగుతున్నప్పటికీ నేతల మీద నమోదవుతున్న కేసుల సంఖ్య అంతంత మాత్రంగానే ఉంది. పైగా ఆ కేసులు అంతగా విచారణకు నోచుకోవడం లేదు.

నిఠారీ హత్యల కేసులో సుప్రీం కీలక తీర్పు

- సురేందర్ కోలీపై ఆరోపణలను కొట్టేసిన ధర్మాసనం

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, నవంబర్ 11: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నిఠారీ వరుస హత్యల కేసులో సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. మరణశిక్ష పడిన సురేందర్ కోలీపై ఉన్న ఆరోపణలను కొట్టివేసింది. అతడిని నిర్దోషిగా ప్రకటిస్తూ, వెంటనే విడుదల చేయాలని ఆదేశించింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ విక్రమ్‌నాథ్‌లతో కూడిన ధర్మాసనం మంగళవారం ఈ తీర్పును ప్రకటించింది. ఈ తీర్పుతో 19 యేండ్ల నిఠారీ కేసు మరోసారి దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఒక కత్తి ఆధారంగా సురేందర్ కోలీని నిందితుడిగా నిర్ధారించడం సరికాదని స్పష్టం చేసింది. నేరానికి తగిన సాక్ష్యాధారాలు లేవని, ప్రాసిక్యూషన్ తగిన రీతిలో తన వాదనలను నిరూపించలేకపోయిందని పేర్కొంది. ఇప్పటికే సురేందర్ కోలీపై నమోదైన 16 కేసులకు 12 కేసులలో అతడు నిర్దోషిగా తేలిన విషయాన్ని గుర్తుచేసింది. 15 యేండ్ల బాలిక హత్య కేసులోనూ అతడిపై ఉన్న ఆరోపణలను రద్దు చేస్తూ వెంటనే విడుదల చేయాలని అధికారులను ఆదేశించింది. 2006లో నోయిడా సమీపంలోని నిఠారీ గ్రామంలో ఈ భయానక ఘటన వెలుగులోకి వచ్చింది. వ్యాపారవేత్త మోనిందర్‌సింగ్ పంధేర్ ఇంటి వెనుక మురుగుకాల్వలో 16 మంది చిన్నారుల అస్థికలు బయటపడటంతో దేశమంతా షాక్‌కు గురైంది. సీబీఐ దర్యాప్తు చేపట్టి, పంధేర్‌తోపాటు అతడి ఇంటి సహాయకుడు సురేందర్ కోలీని అరెస్టు చేసింది. 19 కేసులు నమోదు చేసింది.



సౌతాఫ్రికాతో రెండు టెస్టులు గెలిచి తీరాలి

టీమిండియా స్టార్ పేసర్ మహమ్మద్ సిరాజ్

ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్ చేరుకోవాలంటే, సౌతాఫ్రికాతో జరిగే రెండు టెస్టులలోనూ తప్పక విజయం సాధించాలని టీమిండియా స్టార్ పేసర్ మహమ్మద్ సిరాజ్ అన్నాడు. సౌతాఫ్రికాను ఓడిస్తే డబ్ల్యూటీసీ సైకిల్‌లో ముందడుగు వేయవచ్చని పేర్కొన్నాడు. నిజానికి ఈ సైకిల్‌ను టీమిండియా డ్రాతో ప్రారంభించింది. ఇంగ్లండ్ పర్యటనలో ఐదు టెస్ట్‌ల సిరీస్‌ను 2-2తో డ్రా చేసుకుంది. తర్వాత వెస్టిండీస్‌తో జరిగిన రెండు టెస్ట్‌లను 2-0తో గెలుచుకుంది. డబ్ల్యూటీసీ పాయింట్స్ టేబుల్‌లో టీమిండియా 61.5 తో మూడో స్థానంలో ఉంది. ఆస్ట్రేలియా, శ్రీలంక టాప్-2లో ఉన్నాయి. గత డబ్ల్యూటీసీ సైకిల్‌లో టీమిండియా కొద్దిలో ఫైనల్ చేరే అవకాశాన్ని చేజార్చుకుంది. అగ్రస్థానంలో నిలిచి ఆస్ట్రేలియా, సౌతాఫ్రికా ఫైనల్ చేరాయి. సౌతాఫ్రికా విజేతగా నిలిచింది. ఇపుడు ఈ నెల 14 నుంచి సౌతాఫ్రికాతో రెండు టెస్ట్‌ల సిరీస్‌లో ప్రారంభం కానుంది. కోల్‌కతాలో తొలి మ్యాచ్ జరుగుతుంది. ఈ నేపథ్యంలో సిరాజ్ మాట్లాడుతూ ఈ సిరీస్ డబ్ల్యూటీసీ సైకిల్‌కు చాలా కీలకమని పేర్కొన్నాడు. ఆ జట్టును ఓడిస్తే ఫైనల్ చేరుకునే అవకాశాలు పెరుగుతాయన్నాడు. ఆ జట్టు పాకిస్తాన్‌తో 1-1తో డ్రా చేసుకున్నప్పటికీ, తమ ఫామ్‌పై మాకు నమ్మకం ఉందన్నాడు. ఇంగ్లండ్ పర్యటనలో మెరుగైన ప్రదర్శన చేశామన్నాడు. తాను మంచి లయతో బౌలింగ్ చేస్తున్నానని, దానిని సద్వినియోగం చేసుకోవాలనుకుంటున్నానని వివరించాడు. ఈ సైకిల్‌లో సిరాజ్ 7 మ్యాచ్‌లు ఆడి 26.54 సగటుతో 33 వికెట్లు పడగొట్టాడు.

14 నుంచి టీమిండియా సౌతాఫ్రికా టెస్ట్ సిరీస్

కోల్ కతాలో తొలి టెస్టు టాస్ కు బంగారు నాణెం

ఈ నెల14 నుంచి భారత్, సౌతాఫ్రికా మధ్య రెండు టెస్ట్‌ల సిరీస్ మొదలవుతుంది. కోల్‌కతా ఈడెన్ గార్డెన్స్ లో తొలి మ్యాచ్ జరుగుతుంది. 22 నుంచి ప్రారంభమయ్యే రెండో మ్యాచ్ గౌహతిలో జరుగుతుంది. ఈ సిరీస్‌లో టాస్ కోసం ప్రత్యేకంగా ఓ గోల్డ్ కాయిన్ ఉపయోగించనున్నారు. బెంగాల్ క్రికెట్ అసోసియేషన్ ప్రత్యేకంగా దీనిని తయారు చేయించింది. కాయిన్‌కు ఒకవైపు జాతిపిత మహాత్మా గాంధీ చిత్రం, మరోవైపు నల్లజాతి సూరీడు, సౌతాఫ్రికా మాజీ అధ్యక్షుడు నెల్సన్ మండేలా చిత్రం ముద్రించారు. శాంతి, స్వేచ్ఛ, అహింసా మార్గంలో నడిచిన ఈ మహనీయుల గౌరవార్థం ప్రత్యేక నాణేన్ని రూపొందించారు. రెండు మ్యాచులలోనూ టాస్ వేయడానికి దీనిని ఉపయోగించనున్నారు. 2015 నుంచి ఇరు జట్ల మధ్య జరిగే టెస్ట్ సిరీస్‌ను 'మహాత్మా గాంధీ, నెల్సన్ మండేలా ఫ్రీడమ్ ట్రోఫీ'గా పిలుస్తున్నారు. ఆరేండ్ల తర్వాత ఈడెన్ గార్డెన్స్ వేదికగా టెస్ట్ మ్యాచ్ జరుగుతోంది. బెంగాల్ క్రికెట్ అసోసియేషన్ తగు ఏర్పాట్లు చేసింది. ఢిల్లీ పేలుడు ఘటన నేపథ్యంలో కోల్‌కతాలో భద్రతను కట్టుదిట్టం చేశారు. ఇప్పటికే సౌతాఫ్రికా ఆటగాళ్లు భారత్‌కు చేరుకున్నారు. ఇరు జట్ల ఆటగాళ్లు బస చేస్తున్న హోటల్ వద్ద కూడా భద్రతను భారీగా ఏర్పాటు చేశారు. కోల్‌కతా పోలీస్ కమిషనర్ మనోజ్ వర్మ మంగళవారం ఈడెన్ గార్డెన్స్‌ను సందర్శించి భద్రతా ఏర్పట్లను పరిశీలించారు. బెంగాల్ క్రికెట్ అసోసియేషన్ అధికారులు, పోలీసులు భద్రత ఏర్పాట్ల గురించి సమావేశం ఏర్పాటు చేశారు.

ప్రభాస్ @ 23 'రాజాసాబ్' సర్‌ప్రైజ్ లుక్ రిలీజ్

రెబల్ స్టార్ ప్రభాస్ ఇండస్ట్రీకి అడుగుపెట్టి 23 ఏళ్లు పూర్తయింది. 2002లో 'ఈశ్వర్'గా మొదలైన ఈ ప్రయాణం, బాహుబలి, సలార్, కల్కి లాంటి సినిమాలతో "ఇండియాస్ బిగ్గెస్ట్ సూపర్‌స్టార్" రేంజ్‌కు చేరింది. ఈ స్పెషల్ డే సందర్భంగా, ఏదైనా అప్‌డేట్ వస్తుందా అని ఉదయం నుంచి ఫ్యాన్స్ ఈగర్‌గా వెయిట్ చేస్తున్నారు. వాళ్ల వెయిటింగ్‌కు పర్ఫెక్ట్ ట్రీట్ ఇస్తూ, డైరెక్టర్ మారుతి "ది రాజా సాబ్" టీమ్ నుంచి ఒక సాలిడ్ సర్‌ప్రైజ్ వదిలాడు. ఫ్యాన్స్ కోసం ఒక సరికొత్త పోస్టర్‌ను రిలీజ్ చేయడమే కాకుండా, డైరెక్టర్ మారుతి తన ట్వీట్‌లో ఒక ఎమోషనల్ పోస్ట్ పెట్టాడు. '23 ఏళ్ల క్రితం ఆయన తన ప్రయాణాన్ని మొదలు పెట్టారు. సరిగ్గా ఇదే రోజున ఆయన 'ది రాజా సాబ్'లో తన జర్నీని ముగిస్తున్నారు (షూటింగ్ ని ఫినిష్ చేస్తున్నారు). ఈ విక్టోరియస్ జర్నీలో భాగం కావడం నా అదృష్టం' అంటూ మారుతి ట్వీట్ చేశాడు. అంటే, 23 ఏళ్ల మైల్‌స్టోన్ రోజే 'రాజా సాబ్' షూటింగ్ ఫినిష్ కావడం ఫ్యాన్స్‌కు డబుల్ కిక్ ఇచ్చే న్యూస్. గత కొన్నేళ్లుగా ప్రభాస్‌ను హెవీ, డార్క్, ఇంటెన్స్ యాక్షన్ రోల్స్‌లో చూసిన ఫ్యాన్స్‌కు, ఈ పోస్టర్ కళ్లకు పండగలా ఉంది. స్టైలిష్ రెడ్ అండ్ బ్లాక్ డ్రెస్, కూలింగ్ గ్లాసెస్, వెనుక తన గ్యాంగ్‌తో నడిచి వస్తున్న ప్రభాస్ లుక్.. పక్కా 'వింటేజ్ రెబల్ స్టార్' వైబ్‌ను తెచ్చేసింది. ఫ్యాన్స్ ఎప్పటినుంచో మిస్ అవుతున్న ఆ ఎనర్జీ, ఆ స్వాగ్ ఈ పోస్టర్‌లో ఫుల్లుగా లోడ్ అయి ఉన్నాయి.

'పిఠాపురంలో' టైటిల్ పోస్టర్ ఆవిష్కరణ

'ప్రేయసి రావే' ఫేమ్ మహేష్‌చంద్ర దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'పిఠాపురంలో'. దీనికి ఉపశీర్షిక 'అలా మొదలైంది'. డా. రాజేంద్రప్రసాద్, పృధ్వీ రాజ్, కేదార్ శంకర్, మణిచందన, సన్నీ అఖిల్, విరాట్, సాయిప్రణీత్, శ్రీలు, ప్రత్యూష తదితరులు ఈ చిత్ర ప్రధాన తారాగణం. మహేష్‌చంద్ర సినిమా టీమ్ పతాకంపై దుండిగల్ల బాలకృష్ణ, ఆకుల సురేష్ పటేల్, ఎఫ్‌ఎం మురళి (గోదారి కిట్టయ్య) ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమా టైటిల్ పోస్టర్‌ని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ ''ఈ సినిమా కాన్సెప్ట్ గురించి దర్శకులు చెప్పారు. మంచి సందేశాత్మక చిత్రంగా అనిపిస్తోంది. యువతరం కుటుంబ సమేతంగా ఎలాంటి నిర్ణయాలు తీసుకోవాలి, ఎలా ఎదగాలనే సందేశం ఈ సినిమాలో ఉంది. ఈ చిత్రాన్ని అందరూ ఆదరించాలి'' అని చెప్పారు. డా. రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ''ఇవాళ సమాజంలో ఏం జరుగుతుందనే పాయింట్‌ని దర్శకుడు మహేష్‌చంద్ర అద్భుతంగా డీల్ చేశాడు. స్టోరీ నచ్చి నేను కూడా ఇష్టంగా ఈ సినిమా చేశాను. 'ఆ నలుగురు', 'మీ శ్రేయోభిలాషి', 'ఓనమాలు' తరహాలోనే సందేశాన్ని అందిస్తూనే యువతరాన్ని ఆకట్టుకునే అంశాలున్న సినిమా ఇది'' అని తెలిపారు.

ముంబై ఇండియన్స్ జట్టులో భారీ మార్పులు!

దీపక్ చాహర్, సత్యనారాయణ రాజు, ముజీబ్ ఔట్!

గత ఐపీఎల్ సీజన్‌లో ముంబై ఇండియన్స్ అంతగా రాణించలేదు. మిశ్రమ ఫలితాలను అందుకున్నప్పటికీ, విజేతగా మాత్రం నిలవలేకపోయింది. అసాధారణ ప్రదర్శనతో ప్లే ఆఫ్స్ కు చేరిన ముంబై ఇండియన్స్ క్వాలిఫయర్-2లో పంజాబ్ కింగ్స్ చేతిలో ఓడిపోయి టోర్నీ నుంచి తప్పుకుంది. జస్‌ప్రీత్ జట్టులో చేరడంతో వరుసగా ఆరు మ్యాచులు గెలిచి ప్లే ఆఫ్స్ బెర్త్ దక్కించుకుంది. ఎలిమినేటర్‌లో గుజరాత్ టైటాన్స్‌ను ఓడించి క్వాలిఫయర్-2కు అర్హత సాధించింది. కీలక మ్యాచ్‌లో ఓడిపోయింది. ఫైనల్ చేరకున్నా ముంబై జట్టు బలంగానే ఉంది. అయినప్పటికీ యాజమాన్యం జట్టులో మార్పులు చేయాలనుకుంటోంది. అ క్రమంలో కొంతమంది ఆటగాళ్లను వదిలేసే అవకాశం ఉంది. వారి స్థానాలలో బయట నుంచి క్రీడాకారులను ఎంచుకోనుంది. దీపక్ చాహర్, సత్యనారాయణ రాజు, ముజీబ్ ఉర్ రెహ్మాన్, రీస్ టోప్లీ, రాబిన్ మింజ్, కర్ణ్ శర్మను రిలీజ్ చేసే అవకాశాలు ఉన్నాయి. ముంబై ఇండియన్స్ రిలీజ్ జాబితా (అంచనా): దీపక్ చాహర్ (రూ.9.25 కోట్లు), ముజీబ్ ఉర్ రహమాన్ (రూ.1.50 కోట్లు), రీస్ టోప్లీ (రూ.70 లక్షలు), రాబిన్ మింజ్ (రూ.65 లక్షలు), కర్ణ్ శర్మ (రూ.50 లక్షలు). రిటైన్ జాబితా హార్దిక్ పాండ్యా (రూ. 18 కోట్లు), రోహిత్ శర్మ (రూ.16.30 కోట్లు), జస్‌ప్రీత్ బుమ్రా (రూ. 18 కోట్లు), సూర్యకుమార్ యాదవ్ (రూ. 16.35 కోట్లు), తిలక్ వర్మ (రూ. 8 కోట్లు), నమన్ ధీర్ (రూ. 5.25 కోట్లు), ట్రెంట్ బౌల్ట్ (రూ. 12.50 కోట్లు), ర్యాన్ రికెల్టన్ (రూ. కోటి), దీపక్ చాహర్ (రూ. 9.25 కోట్లు), విల్ జాక్స్ (రూ. 5.25 కోట్లు), అశ్వనీ కుమార్ (రూ.30 లక్షలు), మిచెల్ సాంట్నర్ (రూ. 2 కోట్లు), క్రిష్ణన్ శ్రీజిత్ (రూ. 30 లక్షలు), రాజ్ బవా (రూ. 30 లక్షలు), సత్యనారాయణ రాజు (రూ. 30 లక్షలు), అర్జున్ టెండూల్కర్ (రూ. 30 లక్షలు), లిజాడ్ విలియమ్స్ (రూ. 75 లక్షలు), విగ్నేష్ (రూ. 30 లక్షలు).

57 యేండ్ల తరువాత ఢిల్లీని ఓడించిన జేకే

7 వికెట్ల తేడాతో ఘన విజయం

ప్రతిష్టాత్మక రంజీ ట్రోఫీలో జమ్మూ కశ్మీర్ దుమ్ము రేపింది. 57 యేండ్ల తమ క్రికెట్ చరిత్రలోనే తొలిసారిగా ఢిల్లీ జట్టును ఓడించింది. 42 సార్లు నిరాశే ఎదురైనప్పటికీ, 43వ ప్రయత్నంలో విజయం సాధించింది. మంగళవారం ముగిసిన మ్యాచ్‌లో 7 వికెట్ల తేడాతో ఢిల్లీపై గెలిచింది. న్యూఢిల్లీ అరుణ్ జైట్లీ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో జమ్మూ కశ్మీర్ బ్యాటింగ్, బౌలింగ్‌లో రాణించింది. టాస్ గెలిచి ముందుగా బౌలింగ్ ఎంచుకుని ఢిల్లీని తొలి ఇన్నింగ్స్‌లో 211 పరుగులకే ఆలౌట్ చేసింది. జేకే బౌలర్ ఆకీబ్ నబీ ఐదు వికెట్లతో ఢిల్లీ పతనాన్ని శాసించాడు. ఢిల్లీ కెప్టెన్ ఆయుష్ బదోని (64), ఆయుష్ దోసేజా (65), సుమిత్ మథుర్ (55) పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగుకు దిగిన జేకే తొలి ఇన్నింగ్స్‌లో 310 పరుగుల భారీ స్కోర్ చేసింది. కెప్టెన్ పరాస్ డోగ్రా 106 పరుగులతో సెంచరీ చేశాడు. 99 పరుగుల లోటుతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఢిల్లీ 69.1 ఓవర్లలో 277 పరుగులకు ఆలౌటైంది. ఆయుష్ బదోని (72), ఆయుష్ డోసెజా (62) పరుగులు చేశారు. అటు, వన్షాజ్ శర్మ ఆరు వికెట్లు తీయగా, సహిల్ లోత్రా మూడు వికెట్లు పడగొట్టాడు. జమ్మూ కశ్మీర్ ముందు 43.3 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి సునాయసంగా గెలుపొందింది. కమ్రాన్ ఇక్బాల్ 133 పరుగులు సెంచరీతో రాణించాడు. ఇరు జట్లు ఇప్పటి వరకు 42 మ్యాచులు ఆడితే, 37 సార్లు ఢిల్లీ గెలిచింది. 4 మ్యాచ్‌లు డ్రా అయ్యాయి, ఒక మ్యాచ్ ఫలితం తేలలేదు. తాజా విజయంతో జమ్మూ కశ్మీర్ సుదీర్ఘ నిరీక్షణకు తెరదించింది.

కాంతలో నాది పెర్ఫార్మెన్స్ ఓరియెంటెడ్ క్యారెక్టర్

హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సే

దుల్కర్ సల్మాన్ మోస్ట్ ఎవైటెడ్ పీరియాడికల్ డ్రామా 'కాంత'. సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వం వహిస్తున్నారు. రానా, సముద్రఖని కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రంలో భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్. దుల్కర్ సల్మాన్ 'వేఫేర్ ఫిల్మ్స్ ప్రైవేట్ లిమిటెడ్', రానా దగ్గుబాటి 'స్పిరిట్ మీడియా' సంయుక్తంగా నిర్మిస్తున్నారు. టీజర్, ట్రైలర్, పాటలు అద్భుతమైన రెస్పాన్స్ తో మంచి బజ్ క్రియేట్ చేశాయి. నవంబర్ 14న ఈ సినిమా గ్రాండ్ గా విడుదల కానుంది. ఈ సందర్భంగా భాగ్యశ్రీ బోర్సే సినిమా విశేషాల్ని పంచుకున్నారు.

కాంతలో మీ క్యారెక్టర్ ఎలా ఉంటుంది? ఈ కథ చెప్పినప్పుడు మీకు ఏం అనిపించింది?

కాంత నాకు చాలా స్పెషల్ ఫిల్మ్. ఫుల్ పెర్ఫార్మెన్స్ కి స్కోప్ ఉన్న క్యారెక్టర్. చాలా ఎక్సైటెడ్ గా ఫీల్ అయ్యాను. దుల్కర్ గారు రానా గారితో కలిసి స్క్రీన్ షేర్ చేసుకోవడం అనేది మరింత ఆనందాన్ని ఇచ్చింది. న్యూ కమ్మర్ కి ఇలాంటి క్యారెక్టర్ దొరకడం అదృష్టం. ఒక ఛాలెంజ్ గా ఈ క్యారెక్టర్ ని తీసుకున్నాను. కుమారి క్యారెక్టర్ కి ఏం కావాలో గ్రౌండ్ వర్క్ చేశాను. 1960 టైమ్స్ ని రీ క్రియేట్ చేయాలి. అది చాలా టఫ్ జాబ్. ఈ సినిమా కోసం పాత తెలుగు తమిళ్ సినిమాలు చూశాను. శ్రీదేవి గారు సావిత్రి గారి నటన గమనించాను. వాటన్నిటినీ ఇన్స్పిరేషన్ గా తీసుకుని కుమారిని కొత్తగా రీక్రియేట్ చేయడం జరిగింది. డైరెక్టర్ గారు చాలా సపోర్ట్ చేశారు. కుమారి క్యారెక్టర్ చాలా అద్భుతంగా వచ్చింది.

మీరు ఫస్ట్ సైన్ చేసిన సినిమా ఇదేనా?

నేను ఫస్ట్ కాంత కథనే విన్నాను. అయితే కొన్ని కారణాలవల్ల ఈ సినిమా కాస్త ఆలస్యంగా మొదలైంది. ఆ గ్యాప్ లో వేరే రెండు సినిమాలు చేయడం జరిగింది. టెక్నికల్ గా నేను ఫస్ట్ సైన్స్ చేసిన కథ కాంతనే.

ఈ షూటింగ్ ఎక్స్పీరియన్స్ ఎలా అనిపించింది?

షూటింగ్ అంతా చాలా పాజిటివ్ గా జరిగింది. అందరం ఫ్రెండ్స్ లా ఉండేవాళ్ళం. ఇది నేను 2023లో విన్న కథ అప్పటి నుంచి మాకు జర్నీ ఉంది. చాలా మంచి వర్కింగ్ ఎక్స్పీరియన్స్ ఉంది. ప్యూర్ పెర్ఫార్మెన్స్ ఓరియెంటెడ్ క్యారెక్టర్. ఒక న్యూ కమ్మర్ కి ఇలాంటి అవకాశం దొరకడం చాలా అరుదు.

రానా గారితో వర్క్ చేయడం ఎలా అనిపించింది?

రానా గారికి సినిమా అంటే చాలా పాషన్. ఆయన ఎప్పుడూ సినిమా గురించే మాట్లాడుతారు. ఆయన సినిమాకి సంబంధించిన ప్రతి విషయంలో కేర్ తీసుకుంటారు. ఒక యాక్టర్ గా రానా గారి దగ్గర నుంచి చాలా విషయాలు నేర్చుకున్నాను. ఆయన గ్రేట్ పెర్ఫార్మర్.

డైరెక్టర్ సెల్వ గురించి?

డైరెక్టర్ సెల్వ గారు చాలా టాలెంటెడ్. చాలా మంచి మనిషి. ఆయన మంచితనం ఆయన రైటింగ్ లో కూడా కనిపిస్తుంది. కుమారి క్యారెక్టర్ ని ఆయన రాసుకున్న విధానం నన్ను ఆశ్చర్యపరిచింది. చాలా అద్భుతంగా ఉంటుంది. అందరి యాక్టర్స్ నుంచి చాలా మంచి పెర్ఫార్మెన్స్ లో తీసుకున్నారు.

రవితేజ, విజయ్ దేవరకొండ ఇప్పుడు దుల్కర్ సల్మాన్ వర్క్ చేశారు .. ఈ వర్కింగ్ ఎక్స్పీరియన్స్ గురించి చెప్పండి?

కెరీర్ బిగినింగ్ లోనే ఇంత మంచి స్టార్స్ తో వర్క్ చేయడం చాలా ఆనందాన్నిచ్చింది. అందరూ కూడా చాలా సపోర్టివ్ గా ఉంటారు. అందరూ కూడా నా పట్ల ఎంతో కైండ్ గా ఉన్నారు.

కాంత, ఆంధ్ర కింగ్ వరుసగా వస్తున్నాయి కదా ఎలా అనిపిస్తుంది?

చాలా ఎక్సయిట్ గా వుంది.. అదే టైంలో నెర్వస్ గా కూడా ఉంది. నా వరకు 100% ఇచ్చాను . తప్పకుండా మంచి రిజల్ట్ ఉంటుందని నమ్ముతున్నాను

కాంత సినిమా నుంచి ఒక యాక్టర్ గా మీరు ఏమి ఆశిస్తున్నారు?

ఇప్పటివరకు ఒక కమర్షియల్ పెర్ఫార్మర్ అన్నారు. ఈ సినిమా తర్వాత భాగ్యశ్రీని ఒక పర్ఫార్మర్ కూడా అంటారని ఆశిస్తున్నాను. ఈ సినిమా నాకు నటించే అవకాశాన్ని ఇచ్చింది.

నిర్మాతలు గురించి ?

రానా గారు, దుల్కర్ గారు అద్భుతమైన నటులే కాదు.. సినిమా అంటే పాషన్ వున్న నిర్మాతలు కూడా. మంచి కథలు ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలనే తపనతో వుంటారు. వారి పాషన్ తో సినిమాని చాలా గ్రాండ్ గా తీశారు. అద్భుతమైన ప్రొడక్షన్ వాల్యూస్ వున్న సినిమా కాంత.

సినిమాలో మ్యూజిక్ ఎలా ఉండబోతుంది?

ఇందులో డాన్సింగ్ సాంగ్ నాకు చాలా ఇష్టం. మ్యూజిక్ కి చాలా మంచి స్కోప్ ఉన్న సినిమా ఇది.

మీకు ఇష్టమైన జానర్?

నాకు యాక్షన్ రొమాన్స్ అన్ని జోన్స్ ఇష్టమే. అన్ని రకాల పాత్రలు చేయాలనే ఉంటుంది.

కాంతతో తమిళ్ లో కూడా పరిచయం అవుతున్నారు.. భవిష్యత్తులో అక్కడ కూడా కంటిన్యూ చేసే అవకాశం ఉందా?

ఒక ఆర్టిస్ట్ కి లాంగ్వేజ్ బ్యారియర్ ఉండదు. మంచి స్క్రిప్ట్స్ ఉంటే చేస్తాను. అయితే నా ఫస్ట్ ప్రిఫరెన్స్ తెలుగు సినిమాకే.

కొత్త సినిమాలు గురించి?

తెలుగు సినిమాలు, అలాగే హిందీ సినిమాలు ఉన్నాయి. ప్రాజెక్ట్స్ గురించి మేకర్స్ అనౌన్స్ చేస్తారు.

కాంత, ఆంధ్ర కింగ్ ఈ రెండు కూడా సినిమాతో ముడి పడిన కథలు కదా.. ఎలా అనిపిస్తుంది?

కాంతలో సినిమాలో సినిమా ఉంటుంది. ఆంధ్ర కింగ్ ఒక ఫ్యాన్ బయోపిక్. ఈ రెండు కూడా దేనికవే డిఫరెంట్ సినిమాలు. కాంతలో కుమారి క్యారెక్టర్ కి ఆంధ్ర కింగ్ లో మహాలక్ష్మి క్యారెక్టర్ కి అసలు పోలికే ఉండదు. దేనికవే ప్రత్యేకమైన సినిమాలు. రెండు సినిమాలు ప్రేక్షకులని అలరిస్తాయని నమ్ముతున్నాను.



Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana - 500013.
Published at H.No. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana - 500008. Editor: FAZUL RAHAMAN MOHAMMED. 040-4390 2732, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200